జూన్
2018

146

సంపుటి : 13 సంచిక : 2 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

వ్యవసాయ రంగ సంక్షోభం - పరిష్కార మార్గాలు
మధ్యాసియాలో మళ్లీ యుద్ధ ఘంటికలు
దళిత ఆగ్రహం
చరిత్ర గురించి మార్క్స్ భావన
పేదలకు అందని అభివృద్ధి ఫలాలు
విద్య ప్రైవేటీకరణ నీతి ఆయోగ్ లక్ష్యం
ప్రచ్ఛన్న శ్రమ దోపిడీ
పెట్టుబడిదారీ విధానం - కారల్ మార్క్స్
ధీశాలి చిర్రావూరి లక్ష్మీనరసయ్య

స్ఫూర్తి

# ధీశాలి చిర్రావూరి లక్ష్మీనరసయ్య

యు. రామకృష్ణ

తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం సందర్భంగా ఇద్దరు సహచరులతో కలిసి జైలు పైనే అరుణపతాకం ఎగురవేసిన ధీశాలి ఆయన. జైలు బారకాసుల్లో బంధించబడిన వారందరికీ రహస్యంగా సందేశాలు పంపి, జైలు ప్రతిధ్వ నించేలా నినాదాలు చేయించిన విప్లవకారు డాయన. ప్రపంచ కార్మికుల దీక్షా దినమైన 'మే దినోత్సవం' రోజున ఆ జైలు 'ప్రపంచ కార్మికులారా, ఏకంకండు!' నినాదాల తో మార్మో గిపోయింది. తన కళ్ళుగప్పి జైలుపై ఎర్రజెండా ఎగురవేయడంతో జైల్లో ఖైదీల కదలికలను అనుక్షణం డేగ కళ్ళతో పరిశీలించే సిఐడి నిర్ఘాంతపోయాడు. జైలు సూపరిం టెండెంటు చెమటతో తడిసి ముద్దయిపోయాడు. సిఐడి ఇది తనకు అవమానంగా భావించాడు. వెంటనే ఎస్పికి చెప్పి జైలుకు పోలీసులను పిలిపించాడు. జెండా ఎవరు ఎగురవేశారని అడిగారు. తానే ఎగురవేశానంటూ ముందుకు వచ్చాడో యువకుడు. సిఐడి, జైలు సూపరింటెం డెంటు, పోలీసులు బ్రాన్పడిపోయారు. కొద్దిసేపు వారికి నోట మాట రాలేదు. అంతకు కొద్దికాలం కిందట ఆ యువకుణ్ణి జైల్లో ఒళ్ళు హూనమయ్యేలా చిత్రహింసలు పెట్టారు. రెండేళ్ళపాటు చేతులకూ, కాళ్ళకూ సంకెళ్ళు వేశారు. చేతి గోళ్ళ వెనుక గుండు సూదులు గుచ్చి నరకాన్ని చూపారు. జైలు వెలుపల ఆయన ఆస్తులనూ, ఇంటిని జప్తు చేశారు. ఆయ న ఇంటినే పోలీసు స్టేషనుగా మార్చివేశారు. అయినా ఆయన పట్టుదల కొద్దిగా కూడా సడల లేదు. తన ఆచూకీ కోసం కన్నతల్లినీ, భార్యనూ జైల్లో పెట్టినా చలించలేదా యువకుడు. ఎన్ని చేసినా కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆయన ధృడదీక్ష ఏ మాత్రం సన్నగిల్లలేదు. జైలు నుంచే ఖమ్మం మున్సిపల్ కౌన్సిలరుగా పోటీ చేసి గెలుపొందా రు. ఆయనను పురపాలక సంఘ ఛైర్మను కాకుండా ప్రభుత్వం ఎంతగా ప్రయత్నించినా సఫలం కాలేకపోయింది. దాదాపు మూడు దశాబ్దాల పాటు ఖమ్మం మున్సిపల్ ఛైర్మన్‌గా



వ్యవహరించిన ఆ తెలంగాణా రైతాంగ సాయు ధ పోరాటయోధుడే చిర్రావూరి లక్ష్మీనరసయ్య. ప్రస్తుతం ఆయన శత జయంతి సంవత్సరం జరుగుతున్నది.

సనాతన సంప్రదాయ కుటుంబంలో జన్మించిన చిర్రావూరి నమ్మిన సిద్ధాంతాన్ని అంతిమ శ్వాస విడిచేవరకూ విడనాడని ధీరుడు. తల్లితండ్రులకు చిర్రావూరి ఒక్కరే సంతా నం.15-3-1915వ తేదీన ఆయన జన్మించా డు. తనకు ఊహ వచ్చేనాటికి, అంటే 1930వ సంవత్సరంలో ప్రజలపై పెత్తందారుల దౌర్జన్యాలు, పటేల్ పట్వారీల దుర్మార్గాలు, వెట్టి చాకిరీ చేయించుకోవడం, తెలుగుకు ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్బంధంగా ఉర్దూ చదివించడం, అన్నీ ఉర్దూ పాఠశాలలే ఏర్పాటు చేయడం చిర్రా వూరిలో నైజాము పట్ల అసహ్యాన్ని కలుగజే శాయి. దీంతో ఆయన బెజవాడ వెళ్ళిపోయారు. అక్కడ స్వాతంత్ర్య సమరయోధుడు అయ్యదేవర కాళేశ్వరరావు వంటి నేతల ఉపన్యాసాలు విన్నారు. గాంధీ పిలుపు మేరకు కొనసాగుతున్న ఉద్యమాలకు ఆకర్షితులయ్యారు. అక్కడ విద్యార్థులు సమ్మె చేస్తుండటంతో ఆయన తిరిగి ఖమ్మం చేరుకున్నారు. బెజవాడలో కలిగిన చైతన్యంతో ఖమ్మం హైస్కూల్లో 200 మంది విద్యార్థులను సమీకరించి విద్యార్థి సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆ సంఘానికి ఆయన కార్య దర్శిగా ఉన్నారు. హైస్కూల్లో విద్యార్థి ఉద్యమాలు జరక్కుండా చిర్రావూరిని ప్రధానోపాధ్యాయుడు తరచూ బెదిరిస్తుండేవాడు. దీంతో ఆయనలో పట్టుదల మరింత హెచ్చింది. అదే సమయంలో హిందూ-ముస్లిం తగాదాలూ పెచ్చరిల్లాయి. ఇవి ఉపాధ్యాయుల్లోనూ ఉండేవి. దీంతో చదు వు పట్ల ఆసక్తి సన్నగిల్లింది. విద్యార్థుల్లో మాత్రం నాయకుడుగా గౌరవం ఉండేది. దాన్ని ఉపయో గించి విద్యార్థి ఉద్యమాలు నిర్మింస్తుండేవాడు.

ఆ సమయంలోనే ఆంధ్ర మహాసభ కార్యక్రమాలకు ఆకర్షితుడయ్యాడు. 1934లో ఖమ్మంలో జరిగిన మూడో ఆంధ్ర మహాసభ జరగకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరిగాయి. స్థానికంగా ఉన్న అభ్యుదయ శక్తుల మధ్య ఘర్షణకు మహాసభ వేదికగా మారింది. వక్తలు బయట నుంచి వచ్చారంటూ సభలో కొందరు విమర్శలు చేశారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలపై చర్చలు లేవు. సహపంక్తి భోజనాలు, వితంతు వివాహాలు, గ్రంథాలయాల పునరుద్ధరణ వంటి సాంఘిక కార్యక్రమాలపై చర్చలు జరిగాయి. దేవాలయాల్లో హరిజనుల ప్రవేశంపై నిషేధం ఉంది. దానిపైనా చర్చ లేదు. అయినప్పటికీ సభను నిలిపివేయాలని కొందరు చేసిన ప్రయత్నాన్ని చిర్రావూరి నిరోధించారు. అప్పటికి ఆయన కాంగ్రెసు అభిమాని. దీనిని అడ్డుపెట్టుకొని ఆయనను హైస్కూలు నుంచి పంపించేందుకు ప్రయత్నాలు జరిగాయి. దీన్ని ఆయన పెద్దగా పట్టించుకోలేదు. 1935లో ఖమ్మంలోని జీర్ణ గ్రంథాలయాన్ని పునరుద్ధరించి 1939 వరకూ దానికి కార్యదర్శిగా పనిచేశారు. ఆ తరువాత గ్రంథాలయ కమిటీకి ఎన్నికలు జరిపించి ప్రజలకు అప్పగించారు. 1938లో త్రిపురలో జరిగిన కాంగ్రెసు మహాసభకు హాజరై నప్పుడు కమ్యూనిస్టు నాయకులతో పరిచయ మేర్పడింది. ఖమ్మంలో రాజకీయ తరగ తులు జరిగితే హాజరయ్యారు. ఆ తరగతుల్లోనే చండ్ర రాజేశ్వరరావుతో పరిచయమేర్పడింది. ఆయన ద్వారా కమ్యూనిస్టు పార్టీతో సంబంధా లేర్పడ్డాయి.

1939లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెసు ఆధ్వర్యంలో సత్యాగ్రహం జరిగింది. అప్పుడున్న ఆంధ్రమహాసభ నాయకులు సత్యాగ్రహ వాలంటీర్లను రిక్రూట్ చేస్తున్నారు. చిర్రావూరి స్థానికంగానే సత్యాగ్రహం జరగాలంటూ రిక్రూట్ మెంట్‌ను ప్రతిఘటించారు. దీనికి సంప్రదాయ వాదులు అంగీకరించలేదు. ఏమైనా సరే ఇక్కడే సత్యాగ్రహం జరగాలని నిర్ణయించారు. ఇంతలో గాంధీజీ సత్యాగ్రహం ఉపసంహరించుకున్నారు. దీంతో ఆయనకు కాంగ్రెసుపై విశ్వాసం సన్న గిల్లింది. కమ్యూనిస్టు

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. ధీశాలి చిర్రావూరి లక్ష్మీనరసయ్య
యు. రామకృష్ణ .................. 2

2. వ్యవసాయ రంగ సంక్షోభం పరిష్కార మార్గాలు
ప్రొ॥ వెంకటేష్ ఆత్రేయ ........... 4

3. మధ్యాసియాలో మళ్లీ యుద్ధ ఘంటికలు
ఎస్. వెంకట్రావు ................ 11

4. దళిత ఆగ్రహం
దివ్య త్రివేది .................... 15

5. చరిత్ర గురించి మార్క్స్ భావన
ఇర్ఫాన్ హబీబ్ .................... 19

6. పేదలకు అందని అభివృద్ధి ఫలాలు
ఆర్. శ్రీవత్సన్ .................... 21

7. విద్య ప్రైవేటీకరణ నీతి ఆయోగ్ లక్ష్యం
ప్రాతివా కుందు.................... 23

8. ప్రచ్ఛన్న శ్రమ దోపిడీ
ఇవా స్వెడ్లర్........................ 27

9. పెట్టుబడిదారీ విధానం-కారల్‌మార్క్స్
ప్రభాత్ పట్నాయక్ ............... 30



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటోరియల్ 9490099333**
**మేనేజర్: 9490099275**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# శాంతిభద్రతలు

**త**మిళనాడులోని తూతుకుడి వద్ద స్టెరిలైట్ ఫ్యాక్టరీ కాలుష్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ప్రజలపై పోలీసులు జరిపిన కాల్పుల్లో 13 మంది చనిపోయారు. ఈ కాల్పుల ఘటనపై, రాజకీయ నాయకునిగా మారిన తమిళ సినీ హీరో రజనీ కాంత్ వ్యాఖ్యానిస్తూ, సంఘవిద్రోహ శక్తులు శాంతిభద్రతల సమస్య సృష్టించినందువల్లనే పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చిందని సెలవిచ్చారు. ఆయన అంతటితో ఆగలేదు... ప్రతి విషయానికీ ఆందోళన చేసుకుంటూ పోతే తమిళనాడు శ్మశానంగా మారిపోతుందన్నారు. అక్కడితోనీ ఆగలేదు... ఇలా ప్రజలు ఆందోళనలు చేస్తుంటే తమిళనాడులోకి పెట్టుబడులెలా వస్తాయని ప్రశ్నించారు. అదీ ఆయన బాధ...

13 మంది ప్రజల నిండు ప్రాణాలను పోలీసులు పైశాచికంగా బలిగొన్నందుకు ఆయనకు బాధలేదు. 1990ల నుండి తూతుకుడిలో స్టెరిలైట్ ఫ్యాక్టరీ కాలుష్యానికి అనేకమంది ప్రజలు క్యాన్సర్, ఇతర శ్వాసకోశ వ్యాధులతో చనిపోయినా ఆయనకు బాధలేదు. దశాబ్దాలుగా ఇక్కడి ఫ్యాక్టరీలు వెదజల్లుతున్న కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న ఆందోళనలు ఆయనకు లెక్కలో లేదు. ఆయన బాధల్లా ఇలా "హింసాకాండ" జరిగితే రాష్ట్రంలోకి పెట్టుబడులు రావు అని. రాజకీయాల్లో కొత్త పూజారి కాబట్టి రజనీకాంత్ సూటిగా మనసులో మాట చెప్పేశారు. కానీ సరళీకరణ ఆర్థిక విధానాలను సమర్ధిస్తున్న బూర్జువా రాజకీయ నాయకులందరిదీ ఇదే వైఖరి. వారికి ప్రజల ప్రాణాల కన్నా పెట్టుబడులు ముఖ్యం. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఈ మాట ఎన్నిసార్లు అనలేదు? శాంతి భద్రతలు లేకపోతే రాష్ట్రంలోకి పెట్టుబడులు రావు. ప్రతిపక్షాలు ఉద్యమాలు, ఆందోళనలతో శాంతి భద్రతల సమస్య సృష్టిస్తున్నాయి. అందువల్ల ఉద్యమాలను 'ఉక్కుపాదాలతో' అణచేస్తానని ఆయన పదేపదే చెప్పారు. తెలంగాణా ముఖ్యమంత్రి కెసిఆర్ అయితే ఏకంగా ధర్నా చౌక్‌ను మూసేసి ఆందోళనలపైనే పరోక్షంగా నిషేధం పెట్టారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానిదీ ఇదే బాట. మధ్య ప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వం రైతుల ఆందోళనపై కాల్పులు జరిపి అనేక మంది ప్రాణాలు బలి తీసుకుంది.

మన ఆర్థిక వ్యవస్థల మీద ఒక సారి ఫైనాన్స్ పెట్టుబడి ఆధిపత్యం సాధించాక పాలకులకు అన్నిటికన్నా ముఖ్యం ఆ పెట్టుబడిని ప్రసన్నం చేసుకోవడమే. అందువల్ల వారు ఫైనాన్స్ పెట్టుబడికి కోపం తెచ్చే ఏ పనీ చేయరు. ఇతరులను చేయనివ్వరు. ఫైనాన్స్ పెట్టుబడి లాభాలు పోగుచేసుకోవడానికి ఏమాత్రం అడ్డంకులు వచ్చినా అది రాష్ట్రం విడిచి, దేశం విడిచి పారిపోతానని మొరాయిస్తుంది. దాన్ని అదుపు చేసే స్థితిలో లేనప్పుడు ప్రసన్నం చేసుకోవడమే మార్గంగా కనిపిస్తుంది. కాని చిక్కేమిటంటే ఫైనాన్స్ పెట్టుబడిని ప్రసన్నం చేసుకోవాలంటే కార్మికులపైనా, విస్తృతమైన శ్రామిక ప్రజలపైనా దోపిడీ తీవ్రం చేయడానికి అవకాశం ఇవ్వాలి. ప్రజలనే కాదు పర్యావరణాన్నీ దోపిడీ చేయడానికీ అవకాశం ఇవ్వాలి. ఈ రెండు దుష్ఫలితాలు అనుభవించేది శ్రామిక వర్గమే. అందువల్ల ఈ విధానాల ఫలితంగా శ్రామిక వర్గం అసంతృప్తి చెందుతుంది. గతంలో లాగా అసంతృప్తులను బుజ్జగించే శక్తి కూడా ప్రభుత్వాల వద్ద నశించి పోతుంది. ఇక వారి వద్ద ఉన్నది ఒక్కటే. అణచివేత. ఇప్పుడు పాలక పక్ష ప్రభుత్వాలన్నీ ఈ అణచివేతనే ఆయుధంగా చేసుకుని పాలిస్తున్నాయి. బూర్జువా పార్టీలు ప్రతిపక్షంలో ఉంటే ఈ అణచివేతను వ్యతిరేకించి అందలమెక్కడానికి ప్రయత్నిస్తాయి. అధికారంలోకి వస్తే అవీ ఆ విధానాలనే అమలు చేస్తాయి.

బంతిని ఎంతగా నేలకేసి కొడితే అది అంతగా పైకి లేస్తుంది. బూర్జువా పార్టీల అణచివేత ఎంత పెరిగితే ప్రజల పోరాటాలు, ఆందోళనలు అంతగా పెరుగుతాయి. వామపక్షాలు వాటికి నాయకత్వం వహిస్తే అవి ప్రత్యామ్నాయ విధానాల వైపు మళ్లుతాయి. లేకుంటే మితవాద శక్తుల చేతిలోనో, సంస్కరణ వాదుల చేతిలోనో పడి చెదిరిపోతాయి. ప్రపంచ వ్యాపితంగానూ, మన దేశంలోనూ నయా ఉదారవాదం విఫలమైంది. ప్రజా పోరాటాలు పెరుగుతున్నాయి. వామపక్షాలు వాటిని అందుకుని ఉద్యమించే కాలమిది.


**చందా వివరాలు**

విడిప్రతిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

ఈ మాసం ముఖ్యాంశం

# వ్యవసాయ రంగ సంక్షోభం పరిష్కార మార్గాలు



రచయిత ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు

**ప్రొ॥ వెంకటేష్ ఆత్రేయ**

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో 19 5 18వ తేదీన జరిగిన సభలో వెంకటేశ్ ఆత్రేయ చేసిన ఉపన్యాసాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం. **- ఎడిటర్**

ఈ ఏడాది కామ్రేడ్ పి. సుందరయ్య స్మారక ఉపన్యాసం ఇవ్వడానికి నన్ను ఆహ్వానించడం నాకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నాను. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య భారత కమ్యూనిస్టు ఉద్యమంలో అగ్రగణ్యుడు. దేశవ్యాప్తంగా వేలాది మంది కమ్యూనిస్టులు, మార్క్సిస్టులకు స్ఫూర్తి ప్రదాత. పార్టీ సంస్థాగత నిర్మాణం, విస్తరణ, దేశంలో వ్యవసాయక సమస్య అధ్యయనం, జనతా ప్రజాతంత్ర విప్లవ సాధనకు అవసరమైన వ్యూహాలు, ఎత్తుగడలు రూపొందించడం, పార్లమెంటరీ రంగంలోను ప్రజాకార్య క్షేత్రంలోను కమ్యూనిస్టుల పని ఎలా ఉండాలి వంటి బహుముఖ కార్యకలాపాల ద్వారా కామ్రేడ్ సుందరయ్య నవభారత నిర్మాణానికి, ప్రజాసంక్షేమానికి ఎనలేని కృషి చేసారు. కామ్రేడ్ సుందరయ్య జీవితాన్ని కమ్యూనిస్టుగా ఆయన చేసిన కృషి చూసి ఉత్తేజం పొందిన వేలాది మందిలో నేనూ ఒకడిని భావిస్తున్నాను. అటువంటి కామ్రేడ్ సుందరయ్యకు ఘనంగా నివాళి అర్పిస్తున్నాను. సుందరయ్య స్మారక ఉపన్యాసం ఇవ్వడానికి నన్ను ఆహ్వానించిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

ఇక నేరుగా ఉపన్యాస అంశమైన భారతదేశ వ్యవసాయ సంక్షోభం విషయానికి వస్తాను. ఒక క్రమ పద్ధతిలో అర్థం చేసుకోవడానికి వీలుగా ముందుగా స్వాతంత్ర్యానంతర కాలం - 1947 నుండి భారత వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ ఎలా పరిణామం చెందిందీ, 1991లో నయా ఉదారవాద సంస్కరణలు చేపట్టాక వ్యవసాయ రంగం మీద ఎలాంటి ప్రభావం పడిందీ, వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోవడానికీ, సంస్కరణలకీ ఉన్న లంకె ఏమిటి అనే విషయాలు మాట్లాడుకుందాం. అలాగే వ్యవసాయ సంక్షోభం ప్రత్యేక లక్షణాలు ఏమిటి, నయా ఉదారవాద సంస్కరణల ప్రభావం అంతటా ఏకరీతిగా ఎందుకు లేదు? స్థల కాలాలను బట్టి మార్పులు ఎందుకు ఉన్నాయి? అలాగే నిర్దిష్ట కాలంలో, నిర్దిష్ట తరగతుల మీద, నిర్దిష్ట భౌగోళిక ప్రాంతాల్లో ఎలా ఉందో పరిశీలిద్దాం (ఇక్కడ నేను ప్రాంతీయతను దృష్టిలో పెట్టుకోలేదు.) 1991-2018 మధ్య కాలానికి సంబంధించి ఈ పరిణామాలను వివరిస్తాను. చివరిగా వ్యవసాయ సంక్షోభాన్ని మార్క్సిస్టు దృక్పథం నుండి ఎలా పరిశీలించాలి, భారతదేశ వ్యవసాయక సమస్యలలో భిన్నమైన అంశాలతో కలిపి ఎలా చూడాలో వివరించే ప్రయత్నం చేస్తాను.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చే సమయానికి దేశంలో వ్యవసాయ రంగం అత్యంత వెనుకబాటు దశలో ఉంది. బ్రిటిష్ వలస పాలనా కాలంలో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థని పెట్టుబడిదారీ పూర్వ దోపిడి పద్ధతుల ద్వారా చాలా బలహీనపరిచారు. 20వ శతాబ్దపు మొదటి ఐదు దశాబ్దాలలో దేశంలో వ్యవసాయ ఉత్పత్తి సాలీనా ఒకటి, ఒకటిన్నర శాతానికి మించని దైన్యస్థితిలో ఉండేంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి తలసరి ఆహార ధాన్యాలు ఉత్పత్తి 150 కిలోలు మాత్రమే. వ్యవసాయానికి అనువైన భూమిలో కేవలం ఆరో వంతు భూమికి మాత్రమే నీటిపారుదల సౌకర్యం అందుబాటులో ఉంది. పెద్దపెద్ద భూఖండాలు భూస్వాముల, జమిందారుల ఏలుబడిలో కేంద్రీకరింపబడి ఉండేవి. వెట్టి చాకిరి, దుర్మార్గమైన కౌలుదారీ వ్యవస్థ వంటి పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి సంబంధాల మూలంగాదారుణమైన దోపిడి జరుగుతుండేది.

1950-60 దశకాల మధ్యన జమిందారీ విధానం రద్దు వంటి పరిమితమైన భూసంస్కరణ చట్టాలు వచ్చాయి. భూ యాజమాన్యం, సాగు, భూ పరిమితి వంటి అంశాలపై శాసనాలు చేసినా అవి భూమిపై గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టడంలో, భూమి అతి కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించబడి ఉండడాన్ని దెబ్బ తియ్యడంలో విఫలమయ్యాయి.

స్వాతంత్ర్యానంతరం వ్యవసాయ రంగంలో కొంత చురుకుదనం మొదలవడం ముఖ్యమైన మార్పుగా మనం గమనించాలి. పరిమిత భూ సంస్కరణలు, సాగునీరు, విద్యుత్ రంగాలలో ప్రభుత్వం పెట్టుబడులు పెట్టడం, అలాగే గ్రామీణాభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనులు. వీటన్నింటి మూలంగా వ్యవసాయ రంగ మౌలిక వ్యవస్థలో పెద్దమార్పులు తీసుకురాలేక పోయినప్పటికీ బ్రిటిష్ వలస పాలన కాలం నాటికంటే మెరుగైన వ్యవసాయ ఉత్పత్తి చేసేదానికి వీలుపడింది. 1950-51, 64-65 మధ్య కాలంలో వ్యవసాయోత్పత్తి సాలీనా 3.3 శాతం, ఆహార ధాన్యాల ఉత్పత్తి సాలీనా 3 శాతం పెరుగుతూ వచ్చింది. పరిమితమైన భూ సంస్కరణలు, సాగునీటి సౌకర్యాల కల్పన మూలంగా సాగు భూమి వైశాల్యం పెరిగింది. దరిమిలా వ్యవసాయోత్పత్తి, ఆహార ధాన్యాల ఉత్పత్తులలో ఆ మేరకు మెరుగుదల సాధ్యమైంది. అయితే 1966లో ఏర్పడిన ఆహార ధాన్యాల సంక్షోభం ఆనాటికి అనుసరిస్తున్న వ్యవసాయ అభివృద్ధి విధానాల్లో డొల్లతనాన్ని బహిర్గతం చేసింది. ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి అప్పటి పాలకులు ఎంచుకున్న కొత్త వ్యవసాయ వ్యూహమే సస్య విప్లవం. వ్యవసాయ సంబంధాల్లో మార్పుల కోసం ప్రయత్నించకుండా వ్యవసాయాన్ని ఆధునీకరించడమే ఈ సస్య విప్లవం లక్ష్యం. వరి, గోదుమ పంటలకు కనీస మద్దతు ధర కల్పించడం,

పండిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయడం, వ్యవసాయంలో కొత్త సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, హైబ్రిడ్ వంగడాలు, విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, బ్యాంకుల జాతీయకరణ పర్యవసానంగా వ్యవసాయ రంగానికి పెరిగిన రుణవితరణ, సాగునీటి పారుదల కల్పించడంలో పెరిగిన ప్రభుత్వం పెట్టుబడులు, వ్యవసాయ పరికరాల కొనుగోళ్ళు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగొళ్ళకు ప్రభుత్వ సబ్సిడీలు ఇవ్వడం – వీటితోపాటు వ్యవసాయ పరిశోధ నలు విస్తరణ కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడం ఇవన్నీ సస్య విప్లవం'లో భాగంగా చేపట్టిన చర్యలే. ఈ వ్యూహం మూలంగా ప్రధానంగా వరి, గోధుమ పంటలు, సాగునీటి పారుదల సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే అధికదిగుబడి సాధ్యమైంది. పంటల వారీగా, భౌగోళిక ప్రాంతాల వారీగా, వ్యవసాయం మీద ఆధారపడిన జనాభా తరగతుల వారీగా అసమానతలు ఏర్పడ్డాయి. ఎకరాకు పండే పంట దిగుబడి పెరగటం వలన వ్యవసాయో త్పత్తిలో అభివృద్ధి సాధ్యపడిందే తప్ప వ్యవసాయ సంబంధాల్లో ఏ మార్పూ రాలేదు. ఆ రకంగా 1965-66, 1974-75 మధ్య కాలంలో వ్యవసాయోత్పత్తి సాలీనా 3.2 శాతం, ఆహారధాన్యాల ఉత్పత్తి 3.4 శాతం చొప్పున పెరిగాయి. వ్యవసాయరంగంలో పెట్టుబడులు తగ్గుముఖం పట్టినా 1980ల వరకు వ్యవసాయోత్పత్తి పెరుగుతూ వచ్చింది. 1980-81, 1990-91 మధ్య కాలంలో వరి 3.8 శాతం, గోధుమ 4.38 శాతం, వ్యవసాయోత్పత్తి 4 శాతం పెరిగింది.

> ❝ఇక ప్రైవేటీకరణ విషయానికి వస్తే ప్రభుత్వం విద్య, వైద్యం మౌలిక వసతుల కల్పన వంటి అన్ని కీలకమైన రంగాల పట్ల తన బాధ్యతలనుంచి తప్పుకొని ఆయా రంగాలను కారు చౌకగా ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు కట్టబెట్టడం. ఈ సంస్థలు, వ్యక్తులు ప్రజా సంక్షేమం కన్నా లాభాలు ఇబ్బడి ముబ్బడిగా సంపాదించడానికే ప్రాధాన్యం ఇస్తారని వేరుగా చెప్పనక్కరలేదు.❞



సమస్యల పరిష్కారంకోసం మహారాష్ట్రలో లాంగ్‌మార్చ్ చేస్తున్న రైతాంగం

### నయా ఉదారవాద సంస్కరణలు – వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ

1991లో కేంద్రంలో అధికారంలో ఉన్న మైనార్టీ ప్రభుత్వం సంస్కరణల పేరిట ఉదారవాద విధానాలయిన నియంత్రణల రద్దు, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలను తలెత్తుకుంది. ఆ తరువాత అవే విధానాలను ముందుకు తీసుకుపోవడం, ఇటు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అదే బాట పట్టడంతో వ్యవసాయ రంగ సంక్షోభం తీవ్రమైంది. నయాఉదారవాద విధానాలు ముఖ్యంగా మూడు పార్శ్వాలను కలిగి ఉంటాయి. నియంత్రణల తొలగింపు. దీనినే సరళీకరణ అని ముద్దుగా పిలుస్తుంటారు. నియంత్రణలు తొలగించటం అంటే కోటాలు, లైసెన్సులు వంటివన్నీ ఎత్తేయ్యడం ద్వారా ప్రైవేటు పెట్టుబడిదారుల ఇష్టారాజ్యానికి అన్నీ వదిలెయ్యడమే. పాలనా పరమైన సంకెళ్ళను తొలగించడం ద్వారా ప్రైవేటు పెట్టుబడి పారిశ్రామిక పెట్టుబడిగా మారి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని మనకు చూపెడుతుంటారు. ప్రభుత్వం విద్య, వైద్యం మౌలిక వసతుల కల్పన వంటి అన్ని కీలకమైన రంగాల నుంచి తప్పుకొని, వాటిని కారు చౌకగా ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు కట్టబెట్టడమే ప్రైవేటీకరణ. ఇక ప్రపంచీకరణ అంటే అన్ని రకాల సరుకుల ఎగుమతి, దిగుమతులకు తలుపులు బార్లా తెరవడం. ఇష్టారాజ్యంగా ద్రవ్య పెట్టుబడి రాకపోకలకు అవకాశాలు కల్పించటం. ఇలాంటి విదేశీ ద్రవ్యపెట్టుబడి మూలంగా దేశానికి ఒరిగేదేమీ ఉండదు. నయా ఉదారవాద విధానాల్లో అత్యంత అనుకూల ప్రభావం పడేది ఈ విదేశీ ద్రవ్య పెట్టుబడి మూలంగానే. ద్రవ్య విధానం, ద్రవ్యలోటు ఈ రెండూ విదేశీ ద్రవ్య పెట్టుబడికి దాసోహం అనాల్సిందే. ద్రవ్యలోటు అంటే ప్రభుత్వానికి రుణేతర మార్గాల్లో వచ్చే ఆదాయం, అదిపెట్టే ఖర్చుల మధ్య ఉండే అంతరం. ఈ ద్రవ్యలోటు సాధ్యమైనంత తక్కువగా ఉంటేనే ద్రవ్య పెట్టుబడి వస్తుందనేది ప్రభుత్వాల నమ్మకం. ద్రవ్యలోటు తగ్గించుకోవడానికి సామాన్య ప్రజానీకానికి అందించే సంక్షేమ పథకాలు, సబ్సిడిల్లో కోత పెట్టటల, పెట్టుబడులకు కేటాయింపులు తగ్గించటం చేస్తుంది. సంపన్న వర్గాలు, కార్పొరేట్ సంస్థల మీద పన్నులు పెంచడం పెట్టుబడుల వాతావరణాన్ని దెబ్బతీసి, ఉపాధి పెరిగే అవకాశాలు లేకుండా చేస్తుందని సరళీకరణవాదులు పాతాలు చెబుతుంటారు. అందుకే ద్రవ్యలోటు తగ్గించడం అంటే సామాన్య ప్రజల మీద పన్నుల భారం పెంచడం, వారికి అందే సౌకర్యాలలో కోత విధించడం పరిపాటిగా మారిపోయింది.

ద్రవ్యలోటు తగ్గించుకునే పేరిట ప్రభుత్వం వ్యయంలో కోత పెట్టడానికి గాను ఎరువులు, క్రిమి సంహారక మందులు, విద్యుత్, ఆయిల్ వంటి వాటికి అందిస్తున్న రైతువారీ సబ్సిడీలను తెగ్గోసారు. 1991లో కేంద్ర ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్ చేసిన మొదటిపని అది. క్రమానుగతంగా ఎరువులు, ఇంధన ధరలు పెంచుకుంటూపోయారు. రైతు సంఘాలు,

> **"సరళీకరణలో భాగంగా బ్యాంకింగ్ రంగంలో అమలు చేసిన నరసింహన్ కమిటీ సిఫార్సులతో వ్యవసాయరంగానికి అందుతున్న సంస్థాగత రుణం తగ్గింది. వడ్డీరేట్లు పెరిగాయి. అంకెల్లో వ్యవసాయరంగ రుణాలు పెరిగినట్లు కనబడినా ప్రాధాన్యతారంగ నిర్వచన పరిధిని విస్తరించిన మూలాన బడా భూస్వాములు, కార్పొరేట్ సంస్థల వారు భారీగా రుణాలు పొందారు."**

వామపక్షపార్టీలు నికరంగా ఎదిరించినా యుపిఎ-1, యుపిఎ-2, ప్రభుత్వాలు ఇదే విధానాలను కొనసాగించాయి. ఇక గత నాలు గేళ్ళుగా అధికారంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం మరింత దుర్మార్గంగా ధరలు పెంచేసింది.

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటిఓ) నిబంధనలకు అనుగుణంగా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల మీద పరిమాణాత్మక ఆంక్షలు ఎత్తివేయడం, దిగుమతి సుంకాలు తగ్గించడం మూలంగా 1990 చివర్లో వ్యవసాయ దిగుమతులు భారీగా పెరిగాయి. దీనికి తోడు అంతర్జాతీయంగా ధరలు పడిపోవటంతో వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోయాయి.

సరళీకరణలో భాగంగా బ్యాంకింగ్ రంగంలో అమలు చేసిన నరసింహన్ కమిటీ సిఫార్సులతో వ్యవసాయరంగానికి అందుతున్న సంస్థాగత రుణం తగ్గింది. వడ్డీరేట్లు పెరిగాయి. అంకెల్లో వ్యవసాయరంగ రుణాలు పెరిగినట్లు కనబడినా ప్రాధాన్యతారంగ నిర్వచన పరిధిని విస్తరించిన మూలాన బడా భూస్వాములు, కార్పొరేట్ సంస్థల వారు భారీగా రుణాలు పొందారు. 1969లో బ్యాంకులను జాతీయం చేసిన తర్వాత 1990 వరకు గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు శాఖలు విస్తరించగా, 1991 తరువాత ఈ సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఇదంతా నయా ఉదారవాద విధానాల పర్యవసానమే. దీనిమూలంగా రైతాంగం వడ్డీ వ్యాపారులు, పెత్తందారులపై ఆధారపడటం పెరిగింది.

ద్రవ్యోటును తగ్గించుకోవడంలో భాగంగా ఒక పక్కన సంపన్న వర్గాలకు, కార్పొరేట్ రంగానికి భారీ పన్ను మినహాయింపులు ఇస్తూ గ్రామీణాభివృద్ధి వ్యయానికి కోత పెట్టారు. ఫలితంగా నీటి పారుదల, రోడ్లు, ఇంధనం, ప్రజారవాణా వ్యవస్థ, గ్రామీణ ప్రాంతాల్లో శీతల గిడ్డంగుల నిర్వహణ వంటివి తీవ్రంగా దెబ్బతిన్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, వ్యవసాయానికి పట్టుకొమ్మల వంటి ఈ రంగాలు దెబ్బతినడం మూలంగా గ్రామీణ ప్రాంతాల్లో డిమాండు పడిపోయింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సంక్షోభానికి గురయింది.

నయా ఉదారవాద విధానంలో భాగంగా ప్రభుత్వం పెట్టుబడులలో భారీ కోతపెట్టడంతో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, వ్యవసాయ పరిశోధన వ్యవస్థలు దెబ్బతినిపోయాయి. విత్తన రంగంపై నియంత్రణ సడలడం, తనిఖీలు తూతూమంత్రంగా మారిపోవడంతో కార్గిల్, మోన్‌సాంట్ వంటి బహుళజాతి విత్తన కంపెనీలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోకి చొచ్చుకు వచ్చేసాయి. రైతాంగం మీద ఈ కంపెనీల దోపిడి పెరిగింది.

నయా ఉదారవాద సంస్కరణలు ప్రజా పంపిణీ వ్యవస్థని తీవ్రంగా దెబ్బతీసాయి. 1991-94 మధ్య కాలంలో చౌక ధరల దుకాణాల్లో అందించే సరుకుల రేట్లు 90శాతం పెరిగాయి. రెండోపక్కన మెజారిటీ సామాన్య ప్రజానీకం పోషకాహారం కొరతతో బాధపడుతూ ఉండిపోయారు. 1997 లక్షిత ప్రజా పంపిణీ వ్యవస్థ పేరిట పేద కుటుంబాలను దారిద్రరేఖ ఎగువన ఉన్న కుటుంబాలు, దిగువన ఉన్న కుటుంబాలుగా కొత్తగా వర్గీకరించారు. 2001లో అధికారం చేపట్టిన బిజెపి సంకీర్ణ ప్రభుత్వం ఈ రెండు తరగతులకు అందించే నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచేసింది. 2001 జులై నాటికి ప్రభుత్వ గిడ్డంగులలో 60 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు పోగుబడిపోయాయి. మరోపక్కన గ్రామీణ పేదల, వ్యవసాయ కార్మికుల, చేతివృత్తుల కుటుంబాల ప్రజానీకం ఆకలితో అల్లాడిపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో సంక్షోభం పెరగడానికి ప్రజాపంపిణీ వ్యవస్థ దెబ్బతిని పోవడం కూడా ఒక కారణం. 1997-2012 మధ్యకాలం రెండున్నర లక్షలమందికి పైగా రైతులు బలవన్మరణాలకు పాల్పడం గ్రామీణ ఆర్థికవ్యవస్థ సంక్షోభ తీవ్రతను తెలియచేస్తుంది.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలకు ఎదురయిన ప్రజా ప్రతిఘటన దృష్ట్యా ఆయా ప్రభుత్వాలు అప్పుడప్పుడు కొన్ని ఉపశమన చర్యలు చేపట్టాయి. 2004-2008 మధ్య కాలంలో కేంద్రంలో అధికారంలో ఉన్న యుపిఎ-1 ప్రభుత్వం వామపక్ష పార్టీల మద్దతు మీద ఆధారపడి మనుగడ సాగించిన దృష్ట్యా ఆ పార్టీ వత్తిడి మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, అటవీ హక్కుల చట్టం రూపొందించడం కీలకమైన పురోగామి చర్యలే. అయినప్పటికీ 2004 నుండి గ్రామీణ సంక్షోభం కొనసాగుతూ వస్తుంది. 2008లో ఏర్పడిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం పర్యవసానంగా వ్యవసాయ సంక్షోభం నుండి రైతాంగ కుటుంబాలు, వ్యవసాయ ఆధారిత కుటుంబాలు తేరుకోలేక పోయాయి.

**వ్యవసాయ రంగ దుస్థితి స్వరూపం**

ఆర్థిక సంస్కరణల కాలంలో వ్యవసాయ అభివృద్ధి బాగా కుంటుపడింది. ఇంతకు ముందు మనం 1950-51,1965-66 మధ్య, వ్యవసాయం 3.3 శాతం అభివృద్ధి సాధించిందని, 1964-65,1974-75 మధ్య కాలంలో 3.2 శాతం అభివృద్ధి సాధించిందని చూసాం. 1974-75, 1984-85 మధ్య ఇది 2.6 శాతంకు పడిపోయి 1984-85, 1994-95ల మధ్య 4.1 శాతంకు పెరిగింది - ఇది నయా ఉదారవాద సంస్కరణలు మొదలైన తొలినాళ్లలో అన్నమాట. అయితే ఈ పెరుగుదల 1994-95, 2004-05 మధ్య కాలంలో 0.6 శాతంకు పడిపోయింది. అంటే నయా ఉదారవాద సంస్కరణల అమలు ప్రారంభిచడంతోటే అభివృద్ధి పడిపోయిందని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు.

2004-05 తరువాత వ్యవసాయాభివృద్ధి రేటులో కొంత ఎదుగుదల ఉన్నప్పటికీ ఇది నిరంతరం కొనసాగుతుందని చెప్పలేని పరిస్థితి ఉంది. ఉత్పత్తి పెరుగుదల రేటును గనక పరిశీలిస్తే 1991-2010 మధ్యకాలంలో, అంటే నయా ఉదారవాద సంస్కరణలు అమలు జరుగుతున్న కాలంలో, 1981-91ల మధ్యకాలంలో కన్నా ఈ రేటు గణనీయంగా పడిపోవడం చూడగలం. చిరు ధాన్యాలకు సంబంధించినంత వరకు ఈ కాలంలో ఎదుగుదల రేటు అతి తక్కువగా ఉన్నది; 1967-81 నాటికన్నా తక్కువగా ఉన్నది.

1990ల నుండి అన్ని ముఖ్యమయిన పంటలలోను ఉత్పత్తిలో పెద్దగా పెరుగుదల

లేకపోవడం మనం గమనించవచ్చు. 2002-03 కరువు సంవత్సరంలో తరుగుదల ఉంది. ఆహార ధాన్యాల విస్తీర్ణం కూడా స్థిరంగానే ఉండిపోయింది. ఆహార పంటలలో పోషకాలు పుష్కలంగా ఉన్న చిరుధాన్యాల నుండి వరి గోధుమలవైపు మళ్లడం మనం గమనించవచ్చు; భారతదేశంలోని ఆహారధాన్యాలు పండించే పొలాలు ఇతర పంటలకు మళ్లడాన్ని గాని, వ్యవసాయేతర పనులకు వాడడాన్ని గాని అధికారికంగా క్రమబద్ధీకరించలేదు. అందువలన ఆ ప్రాంతం ఆహార ఉత్పత్తి చేసే పొలాలు గానే చూపబడుతుంది.

**సంక్షోభం భిన్నత్వాన్ని గుర్తించకపోవడం**

నయా ఉదారవాద సంస్కరణలు మొదలైనప్పటి నుండి వ్యవసాయ సంక్షోభం తీవ్రం అయిన మాట నిజమే అయినా ఇది వివిధ ప్రాంతాలు, దశలలో మారలేదు; గ్రామీణ ప్రాంతంలోని వర్గాలలో కూడా మారలేదు.

వివిధ దశలను పరిగణలోనికి తీసుకుంటే - నయా ఉదారవాద సంస్కరణలు అప్పటికి ఇంకా వ్యవసాయ రంగాన్ని ఏమాత్రం ప్రభావితం చేయని దశ -1991-1997 మధ్య కాలం అది. అప్పటికింకా డబ్ల్యూ.టి.ఓ షరతులను అమలు పరచడానికి రెండేళ్ల సమయం ఉంది. ద్రవ్య పెట్టుబడి తన ప్రభావాన్ని పూర్తిగా చూపలేదు. మూడో కారణం ప్రపంచ వినిమయ ధరలు ఇంకా పతనం కావడం మొదలవలేదు. కారణాలు ఏమయినా వాస్తవాలు మన ముందు స్పష్టంగా ఉన్నాయి. 1997-98, 2003-04ల మధ్య వ్యవసాయ ఆర్థిక రంగం అతి పెద్ద సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ కాలంలోనే రైతుల ఆత్మహత్యలు పెరిగాయి.

ఈ కాలంలో వ్యవసాయ పరికరాల వినిమయం పెరగడం కూడా చూడవచ్చు. అంటే 1991-1997 మధ్య ఏడాదికి స్థూల నీటి సౌకర్యం ఉన్న భూమి 2.6 శాతం పెరిగింది. విద్యుత్ వాడకం 9. 4 శాతం పెరిగింది, అదనంగా పంట వేయడం 0.4 శాతం పెరిగింది. ఇందుకు భిన్నంగా 1997 -2006 మధ్య కాలంలో వినిమయంలో ఎదుగుదల లేదు. వ్యవసాయంలో విద్యుత్ వినిమయం ఏడాదికి 0.5 శాతం తగ్గింది. అదనంగా పంట వేయడం 0.1 శాతం పెరిగింది. 2006 నుండి వ్యవసాయంలో పెట్టుబడులు పెరగడం మొదలైంది. అధికారిక లెక్కల ప్రకారం 2004 -2010 మధ్యకాలం వ్యవసాయం కొంత మేర పుంజుకుంది. నాలుగో టేబుల్‌లో ఆహారపంటల దిగుబడి పెరుగుదల, ఉత్పత్తి కూడా పెరిగింది.

**“ఇదివరకే చూసినట్లు వ్యవసాయ సంక్షోభం వేరు వేరు పంటలలో వేరు వేరుగా ఉన్నది. బిటి విత్తనంతో అధిక దిగుబడి వస్తున్నందున పత్తి పంటలో ఈ సంక్షోభం కాస్త తక్కువగా ఉన్నది. ఈ తేడాలు ప్రాంతాల వారీగా కూడా ఉన్నాయి. వ్యవసాయం వివిధ స్థాయిలలో ఉన్నందువలన గ్రామీణ ప్రాంతం అంతటినిగాని, రైతులందరిని గాని ఈ సంక్షోభం ఒకే విధంగా ప్రభావితం చేయదు.”**



తమ ఉత్పత్తులను అమ్ముకోవడం కోసం మార్కెట్‌యార్డ్‌లో నిరీక్షిస్తున్న రైతులు

ఒక అధికారిక ప్రచురణ ప్రకారం పదవ పంచవర్ష ప్రణాళిక కాలం అయిన 2002-2007 మధ్య కాలంలో పంట దిగుబడి, వార్షిక సరాసరి పెరుగుదల రేటు 1.29 శాతం, 0.59 శాతంగా ఉంది. ఇది 2007-2012 మధ్య కాలంలో 3.80 శాతం, 3.55 శాతం పెరిగింది. 2016 -17 గణాంకాలు లేవు. ఉన్న సమాచారం మేరకు 2012 నుండి ఆహార ఉత్పత్తిలో కూడా ఎగుడు దిగుడులు ఉన్నప్పటికీ పెరుగుతూనే ఉన్నది.

ఈ అంకెలను చూసి వ్యవసాయ / గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సంక్షోభం నుండి పూర్తిగా బయట పడిందని నిర్ధారణకు రాలేము. 2003-2010 కాలాన్నే తీసుకుందాము.

2003-2004లో వ్యవసాయం, వ్యవసాయానుబంధ రంగాలు 10 శాతం పెరుగుదలను నమోదు చేశాయి. ఇది 2002-03 లోని తీవ్ర కరువు నుండి బయట పడినట్టు సూచిస్తుంది; కానీ 2004-05లో పెరుగుదల '0' శాతంగా ఉంది. 2005-06 లో 5.0 శాతం నమోదు కాగా 2006-07 లో 3.8 శాతంకు పడిపోయింది. 2007-08 లో 4 శాతం పెరగగా, 2008-09లో 1.6 శాతానికి పడిపోయింది. 2009-10లో మరింతగా దిగజారి 0.2 శాతంగా ఉంది. అలాగే ఆహార ధాన్యాల దిగుబడి కూడా ఒడిదుడుకులకు లోనయింది. ఏటికేడు మారుతున్నది. ఆ తరువాతి సంవత్సరాల ఉత్పత్తిలో కూడా పెద్ద తేడాలు ఏమి లేవు. అందువలన పంట దిగుబడులను చూస్తే కోలుకోవడం అన్నది ఋతుపవనాలపై ఆధారపడి ఉన్నది.

**కొనసాగుతున్న పెట్టుబడి సంచయం**

ఇదివరకే చూసినట్లు వ్యవసాయ సంక్షోభం వేరు వేరు పంటలలో వేరు వేరుగా ఉన్నది. బిటి విత్తనంతో అధిక దిగుబడి వస్తున్నందున పత్తి పంటలో ఈ సంక్షోభం కాస్త తక్కువగా ఉన్నది. ఈ తేడాలు ప్రాంతాల వారీగా కూడా ఉన్నాయి. వ్యవసాయం వివిధ స్థాయిలలో ఉన్నందువలన గ్రామీణ ప్రాంతం అంతటినిగాని, రైతులందరిని గాని ఈ సంక్షోభం ఒకే విధంగా ప్రభావితం చేయదు. వ్యవసాయంపై ఆధార పడిన వాళ్లలో ఒక భాగం అయిన భూస్వామ్య పెట్టుబడి దారులు నయా ఉదారవాద విధానాల అమలుతో లాభపడి భూములతో సహా ఆస్తులు పోగుచేసుకుని లాభపడ్డారు. వారి సంచయన వనరులను వివిధ రకాలుగా మార్చుకోగలి

**“సంస్కరణల కాలంలో వ్యవసాయ రంగంలో పెట్టుబడి సంచయం కొనసాగిందని, పెద్ద స్థాయిలో అసమానతల పెరుగుదలను గుర్తించడం అంటే కేవలం ఈ కాలంలో వీటి ప్రభావమే ఎక్కువగా ఉందని అనడం కాదు. అందుకు భిన్నంగా సంస్కరణల కాలంలో వ్యవసాయం ఎక్కువగా ఒత్తిడికి లోనయింది. 1997-2017 మధ్య 3లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడడం ఈ ఒత్తిడిని తెలియ చేస్తుంది.”**

గారు. రకరకాల వ్యవసాయ యంత్రాల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. (విద్యుత్ సంక్షోభం వలన డీజిల్ ఇంజనుల సంఖ్య బాగా పెరిగింది). 1992-2003 మధ్య కాలంలో ట్రాక్టర్ల వినియోగం రెట్టింపు అయింది. 2004-05, 2015-16 మధ్య కాలంలో ట్రాక్టర్ల, పవర్ టిల్లర్ల అమ్మకాలు చెప్పుకోదగిన స్థాయిలో పెరిగాయి.

2002-2007మధ్య కాలంలో అంటే పదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో జాతీయ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలలో స్థూల పెట్టుబడి పోగుపడటం 13.9 శాతం ఉండగా, 2007-2011 మధ్య కాలంలో 18.8 శాతంకు పెరిగింది. అంటే వాస్తవంలో సంచయం కేవలం స్వాధీనాల వల్లనే కాక వచ్చిన మిగులును తిరిగి పెట్టుబడి పెట్టడం ద్వారా సమకూరిందని అర్థం అవుతున్నది. అంతేకాదు. సంచయన వేగం కూడా 1997-2005 మధ్య అంతంత మాత్రంగా ఉంటే, 2005-2012 మధ్య మరింత వేగంగా ఉన్నది. 2011-12 ,2015-16 మధ్య స్థూల పెట్టుబడి పోగుపడటానికి, స్థూల వ్యవసాయ, వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలకి చేరిన అదనపు విలువలకి మధ్య దామాషా సరాసరి 17 శాతంగా ఉన్నది. ఈ పెట్టుబడి సంచయంలో అత్యధిక భాగం ప్రైవేటు రంగంలోనే జరిగింది. ఇదే కాలంలో ప్రభుత్వరంగం వాటాలో స్థూల పెట్టుబడి సంచయం 20 శాతంకు మించలేదు. అంటే నయా ఉదారవాద విధానాలు అమలు జరిగిన తరువాత వ్యవసాయ అనుబంధ రంగాలలో ప్రాంతాల వారీగా కొన్ని తేడాలు ఉన్నప్పటికీ కొంత మేరకయినా పెట్టుబడి సంచయం జరిగిందని స్పష్టమవుతున్నది. అయితే ఇది ప్రైవేటు రంగం లోనే జరిగిందన్నది వాస్తవం. పెట్టుబడి సంచ యం ద్వారా గ్రామీణ ప్రజలలోని ఒక తరగతి ఉత్పత్తి వనరులపై పట్టు పెంచుకున్నారని తెలియజేస్తున్నది.

**అధిక స్థాయిలో అసమానతల పెరుగుదల**

సంస్కరణల కాలంలో వ్యవసాయ రంగంలో పెట్టుబడి సంచయం కొనసాగిందని, పెద్ద స్థాయిలో అసమానతల పెరుగుదలను గుర్తించడం అంటే కేవలం ఈ కాలంలో వీటి ప్రభావమే ఎక్కువగా ఉందని అనడం కాదు. అందుకు భిన్నంగా సంస్కరణల కాలంలో వ్యవసాయం ఎక్కువగా ఒత్తిడికి లోనయింది. 1997-2017 మధ్య 3లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడడం ఈ ఒత్తిడిని తెలియ చేస్తుంది. 1993-94, 1999-2000 మధ్య గ్రామీణ ఉపాధి పూర్తిగా చతికిలపడింది. 2004-05, 2011-12ల మధ్య కాలంలో ఉపాధి చాల నెమ్మదిగా పెరిగింది. 2011-12 నుండి గ్రామీణ ఉపాధి మరింత తగ్గడం ప్రారంభించింది. 1999-2000, 2004-05ల మధ్య పెరిగిన గ్రామీణ ఉపాధి అంతా అసంఘటిత రంగంలోనే జరిగింది, అదీ తక్కువ ఉత్పాదకత గల స్వయం ఉపాధి రంగంలో. శ్రామికుల వార్షిక ఆదాయాలు - స్వయం నియమిత, వేతన కార్మికులను కలుపుకుని - వేతన రేట్లు స్థిరంగా నిలవడమో లేదా వాస్తవంలో తరగడమో జరిగింది. 2004-05, 2011-13 మధ్య నిజవేతనాలలో స్వల్ప పెరుగుదల (వార్షిక ఆదాయాలకు భిన్నమైనది - సంవత్సరంలో ఎన్ని రోజులు పని ఉంటుందో అన్న దానిపై ఇది ఆధారపడి ఉంటుంది) ఆ తరువాత కాలంలో ముఖ్యంగా 2011-2013లలోని ధరల పెరుగుదల, ముఖ్యంగా ఆహార వస్తువుల ధరల పెరుగుదల కారణంగా కరిగి పోయింది. వాస్తవంలో ఆహార సరుకులు, ఇంధనం, ఎరువుల సబ్సిడీలపై కోత ఒకవైపు, విద్య, వైద్యంమొదలైన వాటిపై ప్రభుత్వ ఖర్చులు తగ్గుతుండడం మరోవైపు వ్యవసాయంపై ఆధారపడిన అత్యధిక గ్రామీణ పేదల జీవితాల్లో సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది. మొత్తంగా చూసు కుంటే 2012 తరువాత నిరుద్యోగం మరింత తీవ్రతరమైంది.

**పెరిగిన విదేశీ పెట్టుబడుల పాత్ర**

1991లో నయా ఉదారవాద సంస్కరణల అమలు ప్రారంభించిన నాటి నుంచి భారతదేశ వ్యవసాయ రంగంలో విదేశీ పెట్టుబడులు చొరబడడం ప్రారంభమయ్యింది. 2000లలో తాజా పరిచిన మార్క్సిస్టు పార్టీ కార్యక్రమంలో ఈ విధంగా చెప్పబడింది. “ఉదారవాద విధానాలు అమలు చేయడంతో ప్రపంచ మార్కెట్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న గుత్తపెట్టుబడిదారీ సంస్థల ప్రత్యక్ష జోక్యం, వ్యవసాయ ఉత్పత్తులపై వారి అదుపు పెరుగుతుంది. అసమాన మార్పిడి ద్వారా ధరలలో హెచ్చుతగ్గులు పెరగడంతో రైతులను దోపిడీ చేయటం తీవ్రమౌతుంది. ఫలితంగా రైతు వ్యవసాయ ఉత్పత్తులను అమ్మేవాడిగాను, పారిశ్రామిక ఉత్పత్తులను కొనేవాడిగాను కూడా నష్టపోతాడు”(పేరా. 3. 22). డబ్ల్యు టి ఓ ఆధ్వర్యంలో వ్యవసాయ వస్తువుల దిగుమతులపై పరిమితులను ఎత్తివేయబడ్డాయి. ఇది రైతుల జీవనోపాధిని బాగా దెబ్బతీసింది. భారత దేశంలోని బడా వ్యాపారులు, బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసం భూ పరిమిత చట్టాలను సవరించాలని రాష్ట్రాలపై ఒత్తిడి పెరుగుతున్నది.

వ్యవసాయోత్పత్తిలో-విత్తనాలు, పశు పోషణ, ఇతర రంగాలలోనూ బహుళజాతి సంస్థలు ప్రవేశిస్తున్నాయి. బహుళజాతి సంస్థలు, డబ్ల్యు.టి.ఓల ఒత్తిడి పెరగటంతో భారత దేశం జీవ సంపదపై హక్కులను వదులుకోవలసి వస్తున్నది. రైతులు, నిజంగా పశుపోషణ వృత్తిలో ఉన్నవారు తమ హక్కులను కోల్పోతున్నారు. వ్యవసాయ పరిశోధనలు, సాంకేతికాభివృద్ధి బలహీన పడుతున్నాయి.” (పేరా 3.23) సంస్కరణల కాలంలో భారతదేశ వ్యవసాయరంగం పైన పేర్కొన్న వాటన్నిటిని అనుభవించింది. ఇదివరకటి యు పి ఎ, ప్రస్తుత బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వాలు సంస్కరణలను మరింత వేగవంతం చేయడానికి, వ్యవసాయరంగంలో విదేశీ పెట్టుబడులు పెరగడాన్ని ప్రోత్సహిస్తున్నాయి. 2013 నాటికి యు పి ఎ ప్రభుత్వం వ్యవసాయంలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు స్వయంచాలక పద్ధతి ద్వారా అనుమతిచ్చింది. పూలు, పండ్ల తోటలు, తేనెటీగలు, కూరగాయలు, పుట్టగొడుగుల పెంపకం మాత్రం ఇందుకు మినహాయించారు. తేయాకు రంగంలో 100 శాతం విదేశీ

పెట్టుబడులు అనుమతించబడ్డాయి. శీతలీకరణ లోనూ 100 శాతం పెట్టుబడులు అనుమతిం చబడతాయి. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం రక్షణతో సహా అన్ని రంగాలలోను విదేశీ పెట్టుబడులకు అనుమతులిచ్చింది.

వ్యవసాయం ఇందుకు మినహాయింపు కాదు. సంస్కరణల కాలంలో కార్పొరేట్ వ్యవ సాయం పెరగడం చూసాం. వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కోడానికి యు.పి.ఏ ప్రభుత్వం కార్పొరేట్ వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున పెంచాలనుకుంది. విదేశీ, స్వదేశీ గుత్తాధి పతులను విత్తన తయారీ, ఎరువులు, వ్యవ సాయ పనిముట్ల తయారీలో ప్రోత్సహించడం; పరిశోధనలు, ఇతర సేవలపై ప్రభుత్వం చేసే ఖర్చులను కుదించుకోవడం; వ్యవసాయ రంగానికి ఇచ్చే రుణాలను తగ్గించడం, నీటి పారుదల, పంటలను నిల్వచేసుకునే సదుపా యాలు కల్పించక పోవడం చేస్తున్నారు. మల్టీ బ్రాండ్ రిటైల్ రంగంలోకి విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తులపై పరిమితులను తీసివేయడం, పన్నులు తగ్గిం చడం, మద్దతు ధరల విధానాన్ని బలహీన పరచడం, నెమ్మదిగా ధాన్య సేకరణను నిలిపివేయడం చేశారు. 2014లో అధికారం లోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఈ విధానాలనే మరింత వేగంగా కొనసాగించింది. ఈ విధా నాలు మౌలికంగా నయాఉదారవాద విధానాల ప్రతిబింబాలే; చిన్న, మధ్యతరగతి రైతులను వ్యవసాయం నుండి బయటకు పంపాలని, వ్యవసాయాన్ని ఆధునీకరించడానికి, ఉత్పత్తిని పెంచడానికి భూమిని ప్రైవేటు కంపెనీలకు వప్పచెప్పవలసిందేనని వారు భావిస్తున్నారు. ఆ క్రమంలో భూములను కేంద్రీకరించడం ఒక భాగం. సమాంతరంగా ఎన్నో రాష్ట్ర ప్రభుత్వాలు భూపరిమితి చట్టాలను, పెద్ద వ్యాపారులు పెద్ద కమతాలను దాదాపు ఏ కౌలు లేకుండా రాష్ట్రాల దగ్గరి నుండి పొందడానికి అనువుగా చట్టాల సవరణలు చేస్తున్నాయి. చిన్న, మధ్య తరగతి రైతులు తమ భూములను అమ్ము కునేందుకు ప్రోత్సహిస్తున్నాయి. సారాంశం ఏమిటంటే, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ రంగా నికి పెద్ద ఎత్తున సబ్సిడీలను ఇస్తున్నది. మౌలిక సదుపాయాలు, ఋణం, యాంత్రీకరణ, పరి శోధనలు తదితర బాధ్యతల నుండి ఈ స్కీము లు ప్రభుత్వాన్ని తప్పిస్తాయి. రైతులు చెల్లించ గల స్థాయిలో యంత్రాల ధరలను నియం త్రించాల్సిన పనిలేదు. పంటను గిట్టుబాటు ధరలకు సేకరించాల్సిన పనిలేదు. పంటల ధర లను ఎక్కువగా ఎగుడు దిగుడులకు లోను కాకుండా స్థిరీకరించాల్సిన అవసరం ఉంది.

> **“ఈ నయా ఉదారవాద విధానాలకు భిన్నంగా వాటి స్థానంలో వ్యవసాయానికి సంబంధించిన మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం పెట్టుబడులను పెట్టాలి. సమయానికి చెల్లించగల ధరలకు పెట్టుబడు లకు కావలిసిన యంత్రాలను సరఫరా చేయాలి; చౌకగా రుణాలు మంజూరు చేయాలి; పరిశోధనలను ప్రోత్సహించాలి; గిట్టుబాటు ధరలను నిర్ణయించి పంటలను సేకరించాలి.”**



రాజస్తాన్‌లో పోరాటంలో పాల్గొన్న రైతు మహిళలు

### వ్యవసాయ సంక్షోభం పరిష్కార మార్గాలు

ఈ నయా ఉదారవాద విధానాలకు భిన్నంగా వాటి స్థానంలో వ్యవసాయానికి సంబంధించిన మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం పెట్టుబడులను పెట్టాలి. సమయానికి చెల్లించగల ధరలకు పెట్టుబడు లకు కావలిసిన యంత్రాలను సరఫరా చేయాలి; చౌకగా రుణాలు మంజూరు చేయాలి; పరిశోధనలను ప్రోత్సహించాలి; గిట్టుబాటు ధరలను నిర్ణయించి పంటలను సేకరించాలి; పంటల ధరలు ఎక్కువగా తగ్గకుండా ఉండే విధంగా స్థిరీకరించాలి. పెద్దకమతాలు ఆర్థికం గా ఉపయోగంగా ఉన్నట్టయితే ఆ లాభాలు పొందేందుకు రైతులు సంఘాలుగా ఏర్పడేం దుకు ప్రోత్సహించాలి. అంతేకాని ప్రైవేటు గుత్తాధిపత్యానికి స్థానం కల్పించకూడదు.

కార్పొరేట్లకు అనుకూలంగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం, చాలా రాష్ట్ర ప్రభుత్వాలు నయా ఉదారవాద సంస్కరణలు అమలుకాక ముందు రైతులు పొందిన పరిమితమయిన ప్రయోజనాలను కూడా వెనక్కు తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నాయి. రైతులపై దాడికి ఉపయోగపడే నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే పెద్ద పెద్ద విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులు చొరబడకుండా ప్రత్యేకంగా పోరాడాలి; ఈ పోరాటాలు భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా జరగాలి; భూ సంస్కరణల కోసం విస్తృతంగా పోరాడాలి.

మార్క్స్ గాని మార్క్సిస్టులు గాని పెట్టుబడిదారీ వ్యవస్థలో 'సంక్షోభం' అన్న పదం పెట్టుబడి పునరుత్పత్తి జరుగుతున్న క్రమంలో ఏర్పడుతున్న అడ్డంకులను తెలియచేయడానికి ఉపయోగించారు. నయాఉదారవాద కాలంలో వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆర్థికవ్యవస్థ పునరుత్పత్తి క్రమానికి పెద్ద ఎత్తున భంగం కలిగిస్తున్నదని ఎన్నో అధ్యయనాలు వెల్లడి స్తున్నాయి. అయితే వ్యవసాయ సంక్షోభానికి కారణమైన సంస్కరణలు చెప్పుకోదగ్గ స్థాయిలో – నిజానికి దీర్ఘకాలంపాటు – పెట్టుబడి దారి రైతుల, పెట్టుబడి దారి భూస్వాముల పెట్టుబడి పెరగకుండా నిలువరించలేదు. ఇంత తీవ్ర వ్యవసాయ సంక్షోభ కాలంలో కూడా ఏ మాత్రం సంక్షోభ ప్రభావం చూపని ప్రాంతాలు, పంటలు, కాలాలు ఉన్నాయి. గత రెండు దశాబ్దాలలో భారతదేశ వ్యవసాయంలో పెద్ద ఎత్తున యాంత్రీకరణ పెరిగింది; పెట్టు బడులు పెరిగాయి. నయా ఉదారవాద విధా నాల అమలుకు ముందుకాలం అంతగా కాక

> **"భూ గుత్తాధిపత్యం, ఉత్పత్తి, సంపద అంతా పెద్ద పెట్టుబడిదారీ, ధనిక రైతుల చేతులలో కేంద్రీకరించ బడి ఉంది; వారే గ్రామీణ ప్రాంతాలను శాసిస్తున్నారు. భూమి, ఉత్పత్తి, సంపద కేంద్రీకరించి ఉండడంతో పాటు వారి చేతుల్లోనే రాజకీయ, సామాజిక ఆధిపత్యం కూడా ఉందని అధ్యయనాలు చెప్తున్నాయి."**



వ్యవసాయ సంక్షోభంతో ఆత్మహత్య చేసుకున్న రైతు

పోయినా పంటల దిగుబడులు కూడా పెరిగాయి. వ్యవసాయ పనిముట్ల అమ్మకాలు కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగాయి. భూములు వదులు కోవడం, భూ రియల్ ఎస్టేట్ మాఫియాలు ఉండడం, కార్పొరేట్లు భూములను లాక్కోవడం ఉన్నాకూడా సంచయం అంతా ఇలా భూములు లాక్కోవటం వల్లే జరగడం లేదు. ఉత్పత్తిశక్తుల పెరుగుదల ఉంది; కొద్దిమంది రైతులు ధనికులుగా మారారు. ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం ఫలితంగా ద్రవ్య లోటును, ఖర్చులను తగ్గించాలనుకోవడం దేశంలో ఉత్పాదక పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్నది. దీని ఫలితం సరాసరి ఆర్థిక వ్యవస్థలోని గిరాకీ మీద కూడా పడుతున్నది. అయినప్పటికీ భారతదేశ వ్యవసాయ రంగంలో సంస్కరణల ద్వారా నిజమయిన సంచయం జరిగింది. ఇది వ్యవసాయంలో నిరంతరంగా యాంత్రీకరణ పెరుగుతుండడంలో ప్రతిఫలిస్తుంది; భూస్వాముల, పెద్ద పెట్టుబడిదారీ రైతుల వాస్తవ సంపదలు పెరగడంలో కనిపిస్తున్నది. గ్రామీణ భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థ, అశేష చిన్న సన్నకారు రైతుల మధ్య ఉన్న మౌలిక వైరుధ్యంలో ఎలాంటి మార్పు లేదు; ఈ సమస్య ఇప్పుడే పరిష్కారం అయ్యేటట్టు కనిపించడం లేదు. భూ గుత్తాధిపత్యం, ఉత్పత్తి, సంపద అంతా పెద్ద పెట్టుబడిదారీ, ధనిక రైతుల చేతులలో కేంద్రీకరించబడి ఉంది; వారే గ్రామీణ ప్రాంతాలను శాసిస్తున్నారు. భూమి, ఉత్పత్తి, సంపద కేంద్రీకరించి ఉండడంతో పాటు వారి చేతుల్లోనే రాజకీయ, సామాజిక ఆధిపత్యం కూడా ఉందని అధ్యయనాలు చెప్తున్నాయి. ఆర్థికంగా, సామాజికంగా మహిళలు, ఆదివాసీలపై దాడులు, దళితుల అణచివేత గ్రామీణ ప్రాంతంలోని ప్రతి పల్లెలో నిరంతరంగాకొనసాగే ప్రక్రియగా ఉన్నది. గ్రామాలలో ఉత్పత్తిశక్తుల అభివృద్ధికి భూస్వామ్య వ్యవస్థ అడ్డంకిగా ఉన్నది.

అయితే గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే రాజ్యం బడా పెట్టుబడిదారుల నేతృత్వంలో ఉన్నది. కానీ భూస్వాముల ప్రయో జనాలను కూడా కాపాడుతున్నది; అందువలన భూస్వాములకు ఈ పరిమితులు న్నాయి. వ్యవసాయ సమస్యను గురించి తెలుసుకునే ముందు ప్రజాస్వామ్యాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలి, వ్యవసాయం మీద ఆధారపడే అశేష జనం బాగుపడేందుకు మార్గాలేమిటి అని ప్రశ్నించుకోవడం మంచిది; ఉన్న వ్యవస్థ లో ఇవి ముందుకెళ్ళకుండా ఆపుతున్నదేమిటి అని ప్రశ్నించుకోవాలి. ఇక్కడే అసలయిన సమాధానం ఉంది. ఉత్పత్తి శక్తుల పైన పెత్తనం గ్రామీణ ప్రాంతంలో భూస్వాముల, కొత్త పెట్టుబడిదారీ రైతుల చేతిలో ఉండడం కీలకం. రైతుల ఉత్పత్తి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది అసంఖ్యాక రైతులు, ముఖ్యంగా పేద రైతులకు పెట్టుబడుల ధరలు పెరగడం, పంటల ధరలు అస్థిరంగా ఉండడం ఫలితంగా నష్టాలను ఎదుర్కొంటున్నారు. అందువలన చిన్న కమతాల సమస్య ప్రధానమైనది. ఈ సమస్య వ్యవసాయ సమస్యలలో ఒకటి. నిజానికి చిన్నకమతాల సంక్షోభం ఉత్పత్తి శక్తుల అభివృద్ధి, విస్తరణకు ఆటంకం అని ప్రచారం చేస్తున్నారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడుల ప్రయోజనాలు వ్యవసాయ పరిశోధనలు, సేవల విస్తృతి, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితరాలు మొదటిగా భూస్వాములకు చేరాలా లేక గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని అన్ని వర్గాలకు చేరాలా అన్న సూచన కీలకం. వ్యవసాయ సమస్యకు పరిష్కారం సాధించటం ఎవరు ప్రజల స్నేహితులు, ఎవరు శత్రువులు అన్నది అర్థంచేసుకోవటంలో ఉంది; ప్రజాస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అడ్డంకిగా ఉన్నదెవరు, శ్రమజీవుల స్వేచ్ఛకు, ప్రజా సమూహాన్ని పేదరికం నుండి విముక్తి గావించడానికి ఉన్న అడ్డందుకులేమిటి అని తెలుసుకోవడంలో ఉంది.

ఈ ప్రశ్ననే కామ్రేడ్ సుందరయ్య ఎంతో లోతుగా అధ్యయనం చేసారు. సైద్ధాంతికంగానే కాదు, ఆచరణ లోకూడా; గ్రామీణ ప్రాంతంలో రైతాంగ విభజనను, పెట్టుబడిదారుల అభివృద్ధిని తన రాజకీయ జీవితకాలం సుందరయ్య అధ్యయనం చేసారు. భూస్వామ్య వ్యవస్థ – ఇది కేవలం ఆర్థికపరమైనది మాత్రమే కాదు, రాజకీయ, సామాజిక అంశం కూడా. ఇప్పుడీ పరిధిలో పెద్ద పెట్టుబడిదారీ రైతులు కూడా చేరారు – ఈ సమస్యలన్నిటికీ మూలం బడా పెట్టుబడిదారులు, వీరి వర్గ మిత్రులు. వీరు దేశ నాయకత్వ స్థానంలో ఉన్నారనడానికి ఎటువంటి సందేహం లేదు. ఈ చట్రంలో సామ్రాజ్యవాదులు భూస్వాములకు తోడుగా ఉన్నారు.

**ముగింపు**

* ఈ వ్యవసాయ సంక్షోభ సమస్యను విశ్లేషించిన పత్రాన్ని ఈ కింది విధంగా సంక్షిప్తంగా చెప్పవచ్చు. నయా ఉదారవాద విధానాలు అమలవుతున్న ఈ కాలంలో ముఖ్యమైన అనేక పంటల దిగుబడి గణనీయమైన స్థాయిలో తగ్గింది. అధిక సంఖ్యలో ఉన్న రైతులకు పంటలు పండించడం. పశుపోషణ లాభదాయకంగా ఉండడం లేదు.

*1997–2017 మధ్య కాలంలో 3లక్షల

(మిగతా 34వ పేజీలో)

# మధ్యాసియాలో మళ్లీ యుద్ధ ఘంటికలు



రచయిత మార్క్సిస్టు పత్రిక సంపాదకులు

**ఎస్. వెంకట్రావు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బెదిరిస్తున్నట్లుగానే ఇరాన్ అణు ఒప్పందం నుండి వైదొలగుతున్నట్లు మే 8వ తేదీన ప్రకటించారు. దాంతో ఒక్కసారిగా మధ్య ఆసియా ప్రాంతంలో యుద్ధభయాలు నెలకొన్నాయి. ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్ది నిమిషాల్లోనే సిరియా మీద, గోలన్ గుట్టల మీద ఇజ్రాయిల్ క్షిపణి దాడులకు దిగడం, ఇరాన్‌పై రానున్న కాలంలో తీవ్ర చర్యలుంటాయని ట్రంప్ ప్రకటించడం ఈ భయాలను మరింత పెంచాయి. నిజానికి అధ్యక్ష ఎన్నికల ప్రచారంలోనే ట్రంప్ ఇరాన్ అణు ఒప్పందాన్ని తీవ్రంగా విమర్శించారు. అధికారంలోకి వస్తే ఒప్పందం నుండి వైదొలగుతానని ప్రకటించారు.

ట్రంప్ అధికారంలోకి వచ్చాక వరుసగా అనేక అంతర్జాతీయ ఒప్పందాలనుండి అమెరికా వైదొలగుతూ వచ్చింది. ప్రపంచ మానవాళి మనుగడకు అత్యంత కీలకమైన పారిస్ వాతావరణ ఒప్పందం నుండి అమెరికా వైదొలగుతున్నట్లు 2017 జూన్‌లో ట్రంప్ ప్రకటించారు. ఆయన అధికారంలోకి వచ్చాక అనేక వాణిజ్య ఒప్పందాల నుండి వైదొలిగారు. అందులో పసిఫిక్ సముద్ర ప్రాంత దేశాల వాణిజ్య ఒప్పందం (టిపిపి) ప్రధానమైంది. అంట్లాంటిక్ సముద్ర దేశాల ఒప్పంద (టిటిఐపి) చర్చల నుండి కూడా ఆయన వైదొలిగారు. గత అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ఆఫ్ఘనిస్తాన్ నుండి అమెరికా సైన్యాన్ని ఉపసంహరించే ప్రణాళిక ప్రకటించగా ట్రంప్ దాన్ని తిరగదోడి ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా సైన్యాన్ని మరింత పెంచారు. ఇరాన్ ఒప్పందం నుండి వైదొలగినట్లే ఉత్తర కొరియాతో కుదిరిన అవగాహన నుండి కూడా ఆయన తాజాగా వైదొలిగారు. ఉత్తర కొరియా అణు కార్యక్రమాన్ని ఆపేస్తే తాను శాంతి చర్చలకు సిద్ధమనీ, కొరియా నేత కిమ్ ఇల్ ఉన్‌తో చర్చలు జరుపుతాననీ చెప్పిన ట్రంప్ తాజాగా ఉత్తర కొరియా తన అణు స్థావరాన్ని ధ్వంసం చేశాక ఉన్‌తో చర్చలు జపరడం లేదని ప్రకటించి ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాడు.

**ఇరాన్ అణు ఒప్పందం ఏమిటి?**

ఇరాన్ అణ్వస్త్రాలు తయారు చేయకుండా నిరోధించడం కోసం 2015 జులైలో ఇరాన్‌కూ మరో ఆరు దేశాలకూ మధ్య ఒప్పందం కుదిరింది. దీన్ని సంయుక్త సమగ్ర కార్యాచరణ (జెసిపిఓఎ)– సాధారణ భాషలో ఇరాన్ అణు ఒప్పందం అంటున్నారు. ఒప్పందం మీద ఇరాన్‌తో పాటు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలోని అయిదు శాశ్వత సభ్యదేశాలు (అమెరికా, ఫ్రాన్స్ బ్రిటన్, రష్యా, చైనా) + జర్మనీ సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం ఇరాన్ తన అణు కార్యక్రమంలో చాలా వరకు రద్దు చేయాలి. రద్దు క్రమం అంతర్జాతీయ పర్యవేక్షకుల అజమాయిషీలో జరగాలి. దీనికి బదులుగా ఇరాన్‌పై అమెరికా విధించిన ఆర్థిక, వాణిజ్య ఆంక్షలు దశల వారీగా ఎత్తివేస్తారు. ఇరాన్ ఒప్పందానికి కట్టుబడి పనిచేసింది. దానికి బదులుగా ఇరాన్‌పై ఆంక్షలు కూడా క్రమంగా సడలుతూ వచ్చాయి. దాంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ కుదుట పడుతూ వచ్చింది. ఇరాన్ చమురు ఉత్పత్తి పెంచడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గడం ప్రారంభించాయి. దాంతో మన దేశానికీ, చైనాకూ, ఇంకా చాలా వర్ధమాన దేశాలకు మేలు జరిగింది. ఇరాన్ ఈ ఒప్పందాన్ని చక్కగా అమలు జరుపుతోందని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) కితాబిచ్చింది.

ఇంతలో ట్రంప్ ఈ ఒప్పందాన్ని రద్దు చేయాల్సిన అవసరముందని పదేపదే చెప్పడంతో ఒప్పందం అమలు సందిగ్ధంలో పడింది. ఇరాన్‌తో వ్యాపారం చేసే కంపెనీలు అయోమయంలో పడ్డాయి. దాంతో మళ్లీ ఇరాన్ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకుల నెదుర్కొంది. చివరికి ట్రంప్ చెప్పినంత పనీ చేశారు. ఇరాన్ ఒప్పందం నుండి వైదొలిగి పశ్చిమాసియా పరిస్థితిని ప్రమాదంలోకి నెట్టేశారు.

**అమెరికా వైదొలగడానికి కారణాలు**

ఇరాన్ అణు ఒప్పందంలోని నిబంధనలు పదిహేనేళ్ల తరువాత క్రమంగా సడలిపోయే విధంగా ఉన్నాయని, అందువల్ల ఈ ఒప్పందం ఇరాన్ అణుబాంబు తయారు చేయకుండా ఆపలేదని ట్రంప్ వాదన. పదిహేనేళ్ల తరువాత నిబంధనల్లో కొంత సడలింపు వస్తుందన్న మాట నిజమే గాని ఈ ఒప్పందాన్ని ఇరాన్ తూ.చ. తప్పక అమలు జరిపితే అది ఇకపై అణుబాంబు తయారు చేయగలగడం సాధ్యం కాదని ఒప్పందాన్ని పర్యవేక్షిస్తున్న నిపుణులు చెబుతున్నారు. ఇరాన్ ఇప్పటి వరకు ఒప్పందానికి కట్టుబడి తన అణు కార్యక్రమాన్ని రద్దు చేస్తూ వస్తోందని ఇన్‌స్పెక్టర్లు ముక్తకంఠంతో చెప్పారు. అయినా ట్రంప్ ఈ ఒప్పందం నుండి తప్పుకుని దానిపై తీవ్రమైన ఆర్థిక ఆంక్షలు విధించడానికి అసలు కారణాలు ట్రంప్ చెప్పిన మాటల్లో కాకుండా వేరే చోట ఉన్నాయి.

మధ్య ప్రాచ్యంలో ప్రస్తుతం ఒక్క ఇజ్రాయిల్ మాత్రమే అణ్వస్త్రాలు కలిగి ఉన్న దేశం. ఇజ్రాయిల్ అనేది చమురు సమృద్ధమైన ఈ ప్రాంతంలో అమెరికన్ సామ్రాజ్యవాదుల ఆధిపత్యాన్ని కాపాడే బంటుగా పనిచేస్తున్నది. ఇజ్రాయిల్ అణు కార్యక్రమంపై ఐఎఇఎకు గానీ, మరే అంతర్జాతీయ సంస్థకు గానీ అదుపు లేదు. వాస్తవానికి అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం

> **"ప్రస్తుత భూగోళ రాజకీయాల్లో మధ్య ఆసియా ప్రాంతంలో ఇరాన్ నిర్వహిస్తున్న పాత్ర అమెరికా, ఇజ్రాయిల్, సౌదీ అరేబియా పాలక పక్షాలకు కంటగింపుగా మారింది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియాపై దాడుల తరువాత ఈ ప్రాంతంలో గత ఆరేళ్లుగా అమెరికా సామ్రాజ్య వాదులకు ఎదురునిలిచి పోరాడుతోంది సిరియా లోని బషర్ అల్ అస్సద్ ప్రభుత్వం."**




(ఎన్‌పిటి)పై సంతకాలు చేయని దేశాల్లో భారత్, పాకిస్తాన్‌తో పాటు ఇజ్రాయిల్ కూడా ఉంది. కానీ దానిపై అమెరికా ఎటువంటి ఆంక్షలు విధించదు. పైగా దాని అణు కార్యక్రమానికి అమెరికా పరోక్షంగా తోడ్పాటు నందిస్తోంది. మరి ఇజ్రాయిల్‌ను ఒదిలిపెట్టి ఇప్పటివరకు ఒక్క అణుబాంబు కూడా తయారు చేయని, అణుబాంబు తయారీకి ఆమడ దూరంలో ఉన్న ఇరాన్‌పై అమెరికా ఎందుకు కత్తులు దూస్తున్నట్లు? ఎన్‌పిటిపై సంతకాలు చేసిన దేశాల్లో ఇరాన్ ఒకటి.

ప్రస్తుత భూగోళ రాజకీయాల్లో మధ్య ఆసియా ప్రాంతంలో ఇరాన్ నిర్వహిస్తున్న పాత్ర అమెరికా, ఇజ్రాయిల్, సౌదీ అరేబియా పాలక పక్షాలకు కంటగింపుగా మారింది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియాపై దాడుల తరువాత ఈ ప్రాంతంలో గత ఆరేళ్లుగా అమెరికా సామ్రాజ్య వాదులకు ఎదురునిలిచి పోరాడుతోంది సిరియా లోని బషర్ అల్ అస్సద్ ప్రభుత్వం. రష్యాతో పాటు ఇరాన్ కూడా అస్సద్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తోంది. పాలస్తీనా, లెబనాన్‌లలో ఇజ్రాయిల్ దురాగతాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా తిరుగుబాటులో కీలక పాత్ర నిర్వహిస్తున్న హిజ్బుల్లాకు ఇరాన్ మద్దతిస్తోంది. పాలస్తీనా హక్కుల కోసం పోరాడుతున్న హమస్‌కూ, ఇరాక్‌లో సున్నీ మిలీషియా దళాలకూ ఇరాన్ మద్దతు లభిస్తోంది. మధ్య ప్రాచ్యంలో అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేసే శక్తులకు ఊతం ఇచ్చే పాత్రనుండి వైదొలగాలన్న డిమాండుకు ఇరాన్ అంగీకరించకపోవడమే నేడు దానిపై ట్రంప్ సర్కారు హూంకరింపులకు, ఇజ్రాయిల్, సౌదీ పాలక పక్షాల బెదిరింపులకు కారణం.

వాస్తవానికి 1979లో అమెరికా అనుకూల షా ప్రభుత్వాన్ని కూలదోసి ఇస్లామిక్ రిపబ్లిక్ ఏర్పడిప్పటి నుండి 2003 వరకు ఇరాన్ పాత్ర ఈ ప్రాంతంలో నామమాత్రమే. దానికి ఇరాన్ అంతర్గత ఇబ్బందులతో పాటు అమెరికా ప్రోద్బలంతో సద్దాం హుస్సేన్ నాయకత్వంలోని ఇరాక్ ప్రభుత్వం ఇరాన్‌పై దాడి చేయడం, ఆఫ్ఘనిస్థాన్‌లో ఇరాన్ వ్యతిరేక తాలిబాన్లు అధికారం చెలాయించడం మొదలైన కారణాలున్నాయి. అయితే అమెరికా 2001లో ఆఫ్ఘనిస్తాన్ పైన, 2003లో ఇరాక్‌పైనా దాడిచేసి ఇరాన్‌కు చారిత్రకంగా వున్న శత్రువులను బలహీన పరిచింది. అంటే యుద్ధాలు అమెరికా చేస్తే గెలుపు ఇరాన్‌కు దక్కింది. అప్పటి నుండి ఈ ప్రాంతంలో ఇరాన్ చురుకైన పాత్ర నిర్వహిస్తూ వస్తోంది. ఇది అమెరికా-ఇజ్రాయిల్- సౌదీ (ఇతర గల్ఫ్ అరబ్ దేశాల) త్రయానికి మింగుడు పడని అంశం. ఇరాక్‌లో అమెరికా గెలిచింది. కానీ అక్కడ తనకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. సిరియాలో ఆరేళ్లుగా యుద్ధం చేస్తున్నా ఇరాన్ మిత్రుడైన బషర్ అల్ అస్సద్ ప్రభుత్వాన్ని కూలదోయలేక పోయింది. ఇరాన్‌కు సన్నిహిత మిత్రపక్షమైన హిజ్బుల్లాను ఓడించడానికి 2006లో ఇజ్రాయిల్ లెబనాన్‌పై దాడి చేసింది కానీ ఆ పని చేయలేకపోయింది. పాలస్తీనా అరబ్బులపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాగతాలకు వ్యతిరేకంగా హిజ్బుల్లా, హమస్ దళాలు చేస్తున్న పోరాటానికి ఈ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున మద్దతిస్తున్నారు. ఇజ్రాయిల్‌లోని పచ్చి మితవాద నెతన్యాహూ ప్రభుత్వానికి ఇది మింగుడు పడడం లేదు.

ఆవిధంగా ఈ ప్రాంతంలో పెరుగుతున్న ఇరాన్ ప్రాభవాన్ని నిలువరించేందుకుగాను అమెరికా-ఇజ్రాయిల్-సౌదీ త్రయం ఇరాన్ అణు కార్యక్రమం అనే రాగం ఎత్తుకున్నాయి. దాన్ని ఆర్థికంగా బలహీన పరచడానికి అణు బాంబు చేస్తున్నదన్న నెపం చూపించి ఆంక్షలకు తెగబడ్డాయి. ఆంక్షల బాధతో ఇరాన్ తమ దారికి దిగి వస్తుందనేది వాటి ఆశ. ఆంక్షలు ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశాయి. 2015కు ముందు దాని ఆర్థికాభివృద్ధి -7శాతం చొప్పున దిగజారిపోయింది. అయినా ఆంక్షలను తట్టుకుని ఇరాన్ నిలబడడంతో ఒబామా ప్రభుత్వం చర్చలకు తలగ్గింది. రెండేళ్ల చర్చల అనంతరం 2015లో ఇరాన్ అణు ఒప్పందం కుదిరాక దానిపై ఆంక్షలు సడలించారు. దాంతో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ ఏటా సగటున 12.5 శాతం అభివృద్ధి చెందుతూ వచ్చింది. అటువంటిది ఇప్పుడు ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత అంతర్జాతీయ మదుపుదారుల్లో అయోమయం నెలకొనడంతో ఈ కొద్ది మాసాల్లో ఇరాన్ ఆర్థికాభివృద్ధి 4 శాతానికి దిగిపోయింది.

### గల్ఫ్‌లో మరో యుద్ధ ప్రమాదం

ఇరాన్ అణుఒప్పందం నుండి వైదొలగుతామని ట్రంప్ ప్రకటించిన మరుక్షణమే ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు సిరియాలోని ఇరాన్ స్థావరాలపైనా, లెబనాన్‌లోని హిజ్బుల్ మిలీషియా పైనా బాంబుల వర్షం కురిపించాయి. లెబనాన్ సరిహద్దులోని గోలన్ గుట్టల వద్ద స్థావరాల నుండి ఇరాన్ సైనికులు

ఇజ్రాయిల్ మీదికి క్షిపణుల ప్రయోగించారనీ, అయితే తమ క్షిపణుల వాటిని మధ్యలోనే అడ్డుకుని నిర్వీర్యం చేశాయని ఇజ్రాయిల్ రక్షణ వర్గాలు తెలిపాయి. దీనికి ప్రతిగా తమ సైన్యం గోలన్ గుట్టలపైనున్న ఇరాన్ స్థావరాల మీదికి, సిరియా రాజధాని డెమాస్కస్ దగ్గరలోని ప్రభుత్వ స్థావరాల మీదికి క్షిపణులు ప్రయోగించి విధ్వంసం సృష్టించిందని వారు చెప్పారు. వాస్తవానికి ఇరాన్‌పై యుద్ధానికి కాలుదువ్వుతున్న ఇజ్రాయిల్ తనకు ఇప్పుడు మంచి అవకాశం దొరికినట్లు భావిస్తోంది. ట్రంప్ ప్రభుత్వం ఇరాన్ అణు ఒప్పందం నుండి వైదొలగక ముందే ఆ సమాచారం దానికి అందింది. వెనువెంటనే అది సిరియా, గోలన్‌ల లోని ఇరాన్ సైనిక స్థావరాలపై క్షిపణి దాడులకు దిగడం అనేది యుద్ధ కవ్వింపు చర్యే. ఇరాన్ గనుక సైనికంగా స్పందిస్తే వెంటనే పూర్తి స్థాయి యుద్ధం చేయడానికి అమెరికా– ఇజ్రాయిల్‌లు సిద్ధంగా ఉన్నాయన్న విషయం ఆ రెండు దేశాల ప్రతిస్పందనలను బట్టి తెలిసిపోతోంది. అదే సమయంలో ఎమెన్‌లో హౌతి తిరుగుబాటుదారులపై యుద్ధం చేస్తూ అనేక వేలమంది ప్రాణాలు తీస్తున్న సౌదీ అరేబియా కూడా ఇరాన్‌పై యుద్ధానికి ఎదురు చూస్తోంది. హౌతి తిరుగుబాటుదారులకు ఇరాన్ మద్ధతివ్వడం ఆపకపోతే "ఇరాన్ మాపై యుద్ధం ప్రకటించినట్లే భావిస్తాం.... దానికి సరైన రీతిలో సరైన సమయంలో సమాధానం చెబుతాం" అని సౌదీ విదేశాంగ మంత్రి అదెల్ అల్–జుబీర్ చేసిన ప్రకటన గల్ఫ్ జలాల్లో మరో యుద్ధ ప్రమాదాన్ని తెలియజేస్తోంది. బహ్రెయిన్, కతర్‌లోని అమెరికా సైనిక స్థావరాల నుండి ఎమెన్‌పైకి యుద్ధ విమానాలు నిత్యం చెక్కర్లు కొడుతున్నాయి. సౌదీ అరేబియా, దానికి అండగా అమెరికా ఎమెన్‌పై చేస్తున్న దాడులవల్ల ఇప్పటికే అనేక వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌పై అమెరికా దాడులకు దిగితే ఈ రెండు స్థావరాలు కీలకంగా పనిచేస్తాయి.

### ఐరోపా, ఇతర దేశాల వైఖరి

ఇరాన్ అణు ఒప్పందం నుండి అమెరికా వైదొలగడంతో ఐరోపా దేశాలు సంకట స్థితిని ఎదుర్కొంటున్నాయి. అవి ట్రంప్ సర్కారును అనుసరించలేవు. ఎందుకంటే వాటన్నిటి సమక్షంలో కుదిరిన ఒప్పందాన్ని ఇరాన్ చక్కగా అమలు చేస్తోంది. రెండోది ఇరాన్‌లో తమ సంస్థలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. కానీ ఒప్పందం నుండి వైదొలగిన అమెరికా ఆంక్షల వల్ల యూరోపియన్ సంస్థలు కూడా సమస్యలనెదుర్కొంటాయి. అందువల్లనే అమెరికా చర్యను దాని ఐరోపా 'మిత్ర' దేశాలు ముఖ్యంగా ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఒప్పందం నుండి అమెరికా వైదొలగడం అంటే "పాపాల పెట్టెను తెరిచినట్లే. దానర్థం యుద్ధాన్ని ఆహ్వానించడమే. ట్రంప్ యుద్ధాన్ని కోరుకుంటున్నారని నేననుకోవడం లేదు" అని ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రన్ ఇటీవల జర్మన్ పత్రిక డెర్ స్పీగల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మాక్రన్ గత ఏప్రిల్‌లో అమెరికా సందర్శించినప్పుడు ఒప్పందం నుండి వైదొలగవద్దని ట్రంప్‌కు వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేశారు. అయినా ట్రంప్ ఆయన విజ్ఞప్తిని తిరస్కరించారు. జర్మన్ ఛాన్సలర్ ఎంజెలా మెర్కెల్, బ్రిటిష్ విదేశాంగ మంత్రి బోరిస్ జాన్సన్‌లు చేసిన విజ్ఞప్తులను కూడా ట్రంప్ తిరస్కరించారు.

"ఇరాన్ ఒప్పందం నుండి అమెరికా వైదొలిగితే ఆ దేశంలో తమ పెట్టుబడులకు నష్టం వస్తుంది. దాంతోబాటు ఇరాన్‌తో యుద్ధం గనుక వస్తే అన్నిటికన్నా యూరప్ దేశాలు రెండు కారణాల వల్ల పెద్దగా నష్ట పోతాయి. మొదటిది, యుద్ధం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఆకాశాన్ని అంటుతాయి. రెండోది మరోసారి ఐరోపా పెద్ద ఎత్తున వలసల సమస్యను ఎదుర్కోవలసి వస్తుంది."



ఇరాన్ అణు ఒప్పందం సందర్భంగా వియన్నాలో సమావేశమైన ఇరాన్, యూరోపియన్ యూనియన్ అధికారులు

ఇటీవలి కాలంలో ఇతర అనేక విషయాల్లో మాదిరిగానే ఇరాన్ అణు ఒప్పందం విషయంలో కూడా అమెరికా, యూరప్ సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు కొట్టచ్చినట్లు ముందుకొచ్చాయి. ఇరాన్ ఒప్పందం నుండి అమెరికా వైదొలిగితే ఆ దేశంలో తమ పెట్టుబడులకు నష్టం వస్తుంది. దాంతోబాటు ఇరాన్‌తో యుద్ధం గనుక వస్తే అన్నిటికన్నా యూరప్ దేశాలు రెండు కారణాల వల్ల పెద్దగా నష్ట పోతాయి. మొదటిది, యుద్ధం వల్ల అంత ర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఆకాశాన్ని అంటుతాయి. రెండోది మరోసారి ఐరోపా పెద్ద ఎత్తున వలసల సమస్యను ఎదుర్కోవలసి వస్తుంది.

అందువల్లనే అమెరికా తప్పుకున్నా ఒప్పందాన్ని కాపాడుతామని ఐరోపా దేశాలు ప్రకటించాయి. ఒప్పందాన్ని కొనసాగించడానికి ఐరోపా దేశాలు తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలనీ, అమెరికా వైదొలగినందున వచ్చే నష్టాన్ని బర్తీ చేసే చర్యలు చేపట్టాలని ఇరాన్ ఒప్పందంలోని ఇతర దేశాను కోరింది. ఇరాన్ విదేశాంగ మంత్రి మొహమ్మద్ జావద్ జరీఫ్ పలు ఐరోపా దేశాల్లో పర్యటించి ఒప్పందాన్ని రక్షించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫలితంగా మే 26వ తేదీన ఒప్పందంలోని మిగిలిన దేశాలన్నీ జెనీవాలో సమావేశమై అమెరికా వైదొలగినప్పటికీ ఇరాన్ అణు ఒప్పందాన్ని రక్షించుకు తీరుతామని ముక్తకంఠంతో ప్రకటించాయి. ఈ సమావేశానికి ఇరాన్ విదేశాంగ మంత్రితో బాటు జర్మన్, ఫ్రాన్స్, బ్రిటన్, రష్యా, చైనా, ఐరోపా యూనియన్ ప్రతినిధులు హాజరయ్యారు. ఇప్పటివరకు ఉప్పు నిప్పుగా ఉన్న రష్యా, యూరప్ దేశాలు ట్రంప్ చర్యతో ఒక్కటవడం అంతర్జాతీయ రాజకీయాల్లో సంభవిస్తున్న కీలక పరిణామంగా చెప్పవచ్చు. ఫ్రెంచ్ అధ్య

> **"ఇరాన్‌పై అమెరికా ఆంక్షల వల్ల చమురు ఉత్పత్తి చేసే దేశాలు లాభపడితే చమురు దిగుమతులపై ఆధారపడే దేశాలు తీవ్రంగా నష్టపోతాయి. అలా నష్టపోయే దేశాల్లో భారత్ ప్రథమ స్థానంలో ఉంటుంది. ఎందుకంటే మన దేశానికి అవసరమైన చమురులో 80 శాతం దిగుమతి చేసుకుంటున్నాం. అమెరికా ఆంక్షల వల్ల మనకు రెండు విధాలా నష్టం వస్తుంది."**


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్


జర్మన్ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్


ఇరాన్ అధ్యక్షుడు రౌహానీ

క్షుడు మాక్రన్ ఇటీవల రష్యా పర్యటించినప్పుడు రెండు దేశాల అధినేతలు కలిసి అమెరికా చర్యను ఖండించారు. ఇరాన్ ఒప్పందం నుండి, ఉత్తర కొరియాతో చర్చల నుండి వైదొలగడం ట్రంప్ తెంపరితనాన్ని తెలియజేస్తోందని రష్యా అధ్యక్షుడు పుతిన్ మాక్రన్ సమక్షంలోనే ఘాటుగా విమర్శించారు.

ఏమైనా ముఖ్యమైన భాగస్వామి అమెరికా వైదొలగిన తరువాత ఇరాన్ అణు ఒప్పందాన్ని రక్షించడం పెద్ద సవాలే.

ఇరాన్‌లో అంతర్గతంగా కూడా ఒప్పందం నుండి వైదొలగాలన్న డిమాండ్ పెరుగుతోంది. అధ్యక్షుడు హస్సన్ రౌహాని ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రక్షించుకోవాలని కోరుకుంటున్నప్పటికీ దేశంలో ఒప్పందం పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్న శక్తులకు ఇది పెద్ద అవకాశంగా లభించింది. అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటూ ఒప్పందాన్ని ఇరాన్ ఎందుకు పాటించాలి, యథాతథంగా మనం అణ్వస్త్ర కార్యక్రమాన్ని కొనసాగిద్దాం అనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. దీన్ని ఈ ప్రభుత్వం ఎంతవరకు ప్రతిఘటించగలదో వేచి చూడాలి.

**భారత్ వైఖరి**

ఇరాన్‌పై అమెరికా ఆంక్షల వల్ల చమురు ఉత్పత్తి చేసే దేశాలు లాభపడితే చమురు దిగుమతులపై ఆధారపడే దేశాలు తీవ్రంగా నష్టపోతాయి. అలా నష్టపోయే దేశాల్లో భారత్ ప్రథమ స్థానంలో ఉంటుంది. ఎందుకంటే మన దేశానికి అవసరమైన చమురులో 80 శాతం దిగుమతి చేసుకుంటున్నాం. అమెరికా ఆంక్షల వల్ల మనకు రెండు విధాలా నష్టం వస్తుంది. మొదటిది, ఆంక్షల ఉచ్చులో చిక్కుకున్న మనకు ఇరాన్ నుండి దిగుమతులు దెబ్బతింటాయి. గత ఆంక్షల నుండి తేరుకుని ఇప్పటికే మన దేశం ఇరాన్‌తో సంబంధాలు మెరుగుపరుచుకుంటోంది. ఇరాన్‌లోని ఛబ్బహర్ నౌకాశ్రయాన్ని ఇరాన్‌తో కలసి మన దేశం సంయుక్తంగా నిర్మిస్తోంది. కీలకమైన చమురు దిగుమతుల రక్షణకు ఇది ఎంతోగానో తోడ్పడుతుందని నిపుణుల అంచనా. అంతే కాకుండా ఇరాన్ నుండి చమురు, సహజవాయు దిగుమతులు రూపాయల్లో జరగడం మనకు తోడ్పడే మరో అంశం. కానీ అమెరికా ఆంక్షల వల్ల ఇరాన్‌లో మన దేశ ప్రాజెక్టులు దెబ్బతింటాయి. రెండోది, ఇరాన్‌పై ఆంక్షల వల్ల ఇప్పటికే అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో పెరిగిపోతున్న ధరల వల్ల మన ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది.

అందువల్ల ఇరాన్‌పై అమెరికా ఆంక్షలను వ్యతిరేకించడంలో చైనా, రష్యా, యూరప్ కన్నా మన దేశం ముందుండాలి. కానీ అంతర్జాతీయ రాజకీయాల్లో అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్య ఉచ్చులో మన దేశాన్ని పాలక వర్గాలు ఇరికించడం వల్ల మోడీ ప్రభుత్వం ఆ పని చేయలేకపోతోంది. ఇరాన్ అణు ఒప్పందానికి, ఉత్తర కొరియాతో శాంతి చర్చలకు అమెరికా ద్రోహం చేసినా మన ప్రభుత్వం నుండి కించిత్ స్పందన లేకపోవడానికి కారణం మన దేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని పాలక వర్గాలు అమెరికాకు తాకట్టు పెట్టడమే. మిగతా విషయాలు ఎలా ఉన్నా ఇరాన్ విషయంలో అమెరికా ఆంక్షలు మనకు చాలా నష్టదాయకం అవుతాయి. దానిపై అమెరికా యుద్ధానికి పాల్పడితే మధ్య ప్రాచ్యం అల్లకల్లోలం అవుతుంది. ఇప్పటికే అక్కడ సిరియాలో ఆరేళ్లుగా రావణ కాష్టం కాలుతోంది. ఎమెన్ అంతర్యుద్ధం, పాలస్తీనా సమస్య, ఇప్పుడు ఇరాన్ సమస్య... మొత్తంగా మధ్య ప్రాచ్యం అతలాకుతలం అవుతంది. అది మన దేశంపై తీవ్రమైన ప్రభావం కలిగిస్తుంది. ఒకటి చమురు దిగుమతులు దెబ్బతినడం అయితే, రెండోది గల్ఫ్‌లో ఉన్న ప్రవాస భారతీయుల నుండి నిధులు రావడం ఆగిపోవడంతో బాటు దేశంలోకి వలసలు రావటం పెరుగుతుంది. అందువల్ల భారత ప్రభుత్వం విజ్ఞత ప్రదర్శించి ట్రంప్ యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకించాలి. చైనా, రష్యా, యూరప్ దేశాలతో కలిసి ఇరాన్‌పై ఆంక్షలను తిరస్కరించాలి.

❋

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!
**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ–2

# దళిత ఆగ్రహం

దివ్య త్రివేది



రచయిత్రి
ప్రముఖ పాత్రికేయురాలు

షెడ్యూలు కులాలు, షెడ్యూల్ తెగల (అత్యాచారాల నిరోధక) చట్టం అమలులో అరెస్టు, కేసుల నమోదులో సుప్రీంకోర్టు మార్పు చేసిన నిబంధనలపై దేశవ్యాప్తంగా దళిత సంఘాల నుంచి తీవ్ర స్థాయిలో నిరసనలు వ్యక్తమయ్యాయి. చట్టాన్ని కాపాడాలంటూ దళితులు పోరాటాలకు పూనుకున్నారు.

ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన సుప్రీం కోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు షెడ్యూలు కులాలు, తెగల అత్యాచారాల నిరోధక చట్టం 1989ని నీరుగార్చే విధంగా, సామాజిక న్యాయానికి తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉంది. చట్టంలోని 18వ సెక్షన్‌లో ఉన్న అంశాలకు (సెక్షన్ 438లోని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం ముందస్తు బెయిల్‌ను ముందుగానే కేటాయించడాన్ని అనుమతించని విధంగా ఏదైతే ఉన్నదో దానిని) నష్టం కలిగించే విధంగా తీర్పు ఉన్నది. సుభాష్ కాశీనాథ్ మహాజన్, మహారాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఈ కేసులో ఉదయ్ ఉమేష్‌లలిత్, ఆదర్శకుమార్ గోయల్ అనే ఇద్దరు న్యాయమూర్తులు మార్చి 20న ఈ తీర్పును ఇవ్వడం జరిగింది. వారు ఇచ్చిన ఈ తీర్పు ప్రకారం ఉన్నతాధికారి (నియామకపు అధికారి) వ్రాతపూర్వక అనుమతి లేకుండా ఒక ప్రభుత్వ ఉద్యోగిని అరెస్టు చేయడానికి వీలు లేదు. ఉద్యోగి కాని వారి విషయంలో అయితే ఆ జిల్లాకు సంబంధించిన సీనియర్ సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ (ఎస్‌పి) అంగీకారం లేకుండా అరెస్టు చేయడానికి వీలులేదు.

ఆ రకంగా ఇచ్చే అనుమతులు నమోదు చేయబడి, ముద్దాయికి అందించబడతాయి. అలాగే సంబంధిత కోర్టుకు అందచేయబడతాయి. ఒక వ్యక్తిని అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు హాజరు పెడితే, న్యాయమూర్తి తన విచక్షణ మేరకు తదనంతర నిర్బంధానికి అనుమతి తెలుపుతారు. సారాంశంగా కోర్టు చెప్పిందేమంటే అత్యాచారాల నిరోధక చట్టం క్రింద ఏదైనా కేసుగా నిర్ధారించబడిపపుడు ప్రాథమిక సమాచార నివేదిక లేకుండా (ఎఫ్ఐఆర్) ఆ కేసు రిజిష్టరు చేయబడదు. అలాగే ఈ కేసు నిష్ప్రయోజనమైనది లేదా ప్రేరేపితమైనది కాదు" అనే దానిని పరిశీలన చేయమంటుంది. ఒకవేళ ఈ కేసు నిజమైనది కాదని తేలినట్లైతే, ముద్దాయికి ముందస్తు బెయిల్ పొందే విధంగా స్వేచ్ఛను కల్పించాలి. దీని వెనుక చట్టాన్ని మార్చాలన్న ఆదేశం ఉంది. కాగితాల మీద చాలా అందంగా ఉండి ఆచరణలో దానిని ఉల్లంఘించే విధంగా ఈ ఆదేశాలు ఉన్నాయి.

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కింద బొంబాయి హైకోర్టు చేత నమోదు చేయబడిన మొదటి ప్రాథమిక దర్యాప్తు నివేదికను కొట్టి వేయాలని మహారాష్ట్ర సాంకేతిక విద్య మాజీ డైరెక్టర్ మహాజన్ కోర్టులో దాఖలు చేసిన స్పెషల్‌లీవ్ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకొని విచారణ చేసిన కోర్టు ఈ తీర్పును వెలువరించింది. కోర్టు డివిజన్ బెంచ్ ముందుగా ఆ కేసుకు సంబంధించిన విధానపరమైన రక్షణ చర్యలకు సంబంధించిన ప్రశ్నలను తయారుచేసింది. అందువల్ల చట్టంలోని ఆ నిబంధనలు అదనంగా ఇతర అంశాలను సంతృప్తిపరిచే విధంగాఏమీ లేవు అని చెప్పింది.

ఈ కేసుకు సంబంధించిన కరద్‌లో ఉన్న ఫార్మశీ కాలేజీ ప్రిన్సిపల్, ప్రొఫెసర్ చేసిన ప్రతికూల వ్యాఖ్యలు సాంవత్సరిక రహస్య నివేదికలో పొందుపరచబడ్డాయి. షెడ్యూలు తరగతికి చెందిన ఉద్యోగి భాస్కర్ గైక్వాడ్ గురించి ఈ వ్యాఖ్యలు చేయబడ్డాయి. భాస్కర్‌గైక్వాడ్ ఆ ఇద్దరి మీద విచారణ కోరుతూ పిటిషన్ దాఖలుచేస్తే మహాజన్ దానిని తిరస్కరించాడు. అప్పుడు గైక్వాడ్ మహాజన్‌కు వ్యతిరేకంగా చట్టంక్రింద ఫిర్యాదును నమోదు చేశాడు. మహాజన్ ఆ ఫిర్యాదును కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు డివిజన్ బెంచ్ ఆ పిటిషన్‌ను త్రోసిపుచ్చుతూ చట్టం అమలు కేవలం నిర్బంధంగా ఉండరాదు. ఎందుకంటే ఆ చట్టాన్ని సక్రమంగా అమలు చేసే అవకాశం ఉన్నది అని చెప్పింది.

"ఆ విధంగా ప్రతి చట్టం లేదా ప్రతి నియమం సక్రమంగా అమలుచేసే శక్తిని కలిగి ఉంది. కేవలం ఎవరైనా ఒకరు సమాచారాన్ని ఇవ్వాలి, అయితే తప్పుడు లేదా ఉపయోగం లేని సమాచారాన్ని ఇవ్వడంగా ఉండకూడదు. ఒకవేళ సమాచారం అలా ఉండేటట్లయితే, ఇచ్చిన సమాచారం ఎటువంటి ఫలితాన్ని ఇవ్వజాలదు. సెక్షన్ 3 (1) (IX) , క్రింద నేరం లేదు సెక్షన్ (1) (IX), క్రింద శిక్షార్హమైనదిగా పరిగణించబడుతుంది." అని చెబుతూ న్యాయం కోసం దళిత ఉద్యమం జాతీయ నాయకుడు రమేష్‌నాథన్ ప్రకారం, ఉద్యోగులకు మధ్య సర్వీస్ సంబంధితమైన శాఖాపరంగా చెలరేగిన వివాదాన్ని తొలగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఎక్కువ చొచ్చుకొని రావడం అసలు పట్టించుకోకపోవడం అనే వాస్తవాన్ని కనబరుస్తుంది. ఇదే కోర్టు బెంచ్ గత సంవత్సర వరకట్న నిషేధ చట్టాన్ని బలహీనపరిచే విధంగా ఉందని విమర్శకు గురైంది. ఆర్నేష్‌కుమార్, బీహార్ రాష్ట్రానికి సంబంధించిన కేసు విషయంలో పోలీసులు కేవలం "యాంత్రికమైన అరెస్టులు చేయడం" ఐపిసి సెక్షన్ 498ఎ క్రింద .... ఈరకమైె కేసులు నమోదు చేయడం సరైనది కాదు." సెక్షన్ 498ఎ దుర్వినియోగం చేయబడుతుందని అంటున్నారు.

**రాజకీయ సాన్నిహిత్యం**

ఈ రెండు రకాల తీర్పులు అణచివేత దారులకు, బాధితులైన మహిళలు, దళితులు, ఆదివాసీలకు వ్యతిరేకంగా చట్టాన్ని దుర్వినియోగం చేసేవిధంగా ఉన్నాయి. చట్టాన్ని బలహీనపరచటం కోసం ఒకేరకమైన పద్ధతిని

> **"ఎందుకంటే అధికారం కలిగి ఉండడం, అధికారంలో లేకపో వడం అనే దానిమీద కూడా ఇది ఆధారపడి ఉంది. దీనికి సంబంధించి అనేకమైన సామూహిక హత్యలు, మూకుమ్మడి దహనాలకు సంబంధించిన ఎన్నోకేసులు స్పష్టంగా ఉన్నా అవి నిందితులను నిర్దోషులుగా ప్రకటించి ముగిసినాయి."**



సంఘ్ పరివార్ దాడికి గురైన ఉనా దళితులు

అనుసరించినట్లు కనిపిస్తుంది. న్యాయమూర్తులైన లలిత్, గోయల్ 2014 జులైలో నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతీయ జనతాపార్టీ కేంద్రంలో అధికారం చేపట్టిన వెంటనే న్యాయమూర్తులు నియమించబడ్డారు. గోపాల సుబ్రహ్మణ్యం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియామకం పొందకుండా మోడీ ప్రభుత్వంలో తిరస్కరించబడిన తరువాత, ఈన్యాయమూర్తుల నియామకం ఆసక్తిని కలిగించింది.

జస్టిస్ లలిత్ భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడైన అమిత్‌షాకు సంబంధించిన కేసులు, గుజరాత్‌కు చెందిన సొహ్రాబుద్దీన్‌ను నకిలీల ఎన్‌కౌంటర్‌లో చంపిన కేసు, తులసీ రామ్ ప్రజాపతిని చంపిన కేసుల్లో, అమిత్‌షా తరపున వాదించిన సీనియర్ న్యాయవాది కావడం గమనార్హం. అలాగే 2జి స్పెక్ట్రం కేటాయింపుకు సంబంధించిన కేసులో ఆయన ప్రత్యేక విచారణాధికారి. అలాగే దేశద్రోహం కేసులో అరెస్ట్ చేయబడిన డాక్టర్ బి నాయక్‌సేన్ పెట్టుకున్న బెయిల్ పిటీషన్‌ను వ్యతిరేకిస్తూ ప్రభుత్వం తరపున వాదించిన వ్యక్తి. మోడీతో ఉన్న రాజకీయ సాన్నిహిత్యాన్ని జస్టిస్‌లలిత్ చక్కగా ఉపయోగించుకున్నాడు. ఇది ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారి, ఈ తీర్పుకు తాను దూరంగా ఉన్నట్లు ప్రభుత్వం చెప్పుకోవల్సివచ్చింది.

క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు భిన్నంగా అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు అనేక తీవ్రమైన ఆరోపణలకు గురైంది. చూడగా ఇది కుల, మతపరమైన హిందుత్వ శక్తులకు అనుకూలంగా ఉన్నది. ఏదైతే దీర్ఘకాలం నుండి అత్యంత "కఠినమైనది"గా అతిశయోక్తులతో కూడిన సంఘటనలతో అత్యుత్తమమైనదిగా ప్రత్యేకించి షెడ్యూలు కూలాలకు సంబంధించి "తీవ్రంగా దుర్వినియోగం" చేయబడినది అనే పదాలను కోర్టు తన తీర్పులో ఉటంకించింది. "పెద్ద ఎత్తున ఫిర్యాదులు నమోదు చేయబడ్డాయి, ప్రత్యేకించి ఉద్యోగులకు వ్యతిరేకంగా లేదా తాత్కాలిక / శాశ్వత న్యాయాధికారులకు వ్యతిరేకంగా ఆ చట్టం తమకు సంక్రమించినహక్కుగా భావించి" దానిని దుర్వినియోగం చేశారు. అని న్యాయస్థానం బెంచ్ చెప్పింది. అనేకమంది ప్రజలు బెంచ్‌చెప్పిన సంఘటనలకు సంబంధించిన సాక్ష్యాలను చూపించమని ప్రశ్నించారు.

పదవీ విరమణ చేసిన భారతపాలన విభాగానికి చెందిన ఒక ఉన్నతాధికారి, రాజకీయేతరుడు అత్యాచార నిరోధక చట్టాన్ని ముందు జాగ్రత్తగా నిలిపివేయాలని, దానిని ముందుకు తెచ్చిన, 2015లో ఆ చట్టంలో సవరణకు కారకు డైన పిఎస్ కృష్ణన్ ఇలా చెప్పారు. "ఈ చట్టానికి సంబంధించి దీనిని సాధారణీకరించడానికి, ముందుగా ఎంచుకున్న వారి మీద దుర్వినియోగం చేయడానికి సంబంధించిన ఎటువంటి ఆధారాలు లేవు. కేవలం పాక్షిక గణాంకాలతో సంపూర్ణమైన చిత్రం లేకుండా ఆరోపణలు చేయడానికి వీలులేదు. మహాజన్‌కు సంబంధించిన ప్రాథమిక హక్కుల విషయంలో కోర్టు సరిగానే వ్యవహరించింది. అయితే అదే సమయంలో షెడ్యూలు కులాలకు సంబంధించిన ప్రాథమిక హక్కుల విషయాన్ని కూడా పరిగణనలోనికి తీసుకోవాలని వారు భావిస్తున్నారు. కనీసం మాట మాత్రంగానైనా ప్రాథమిక హక్కులు లేని వారి విషయంలో కూడా కోర్టు అలాగే చూడాలని వారు అంటున్నారు. దళితులు వారి నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న అత్యాచారాలు, సామూహిక హత్యలు, సామాజిక, ఆర్థిక బహిష్కరణల నుండి విముక్తి కల్పించాలని ఆయన చెప్పారు.

ఆయన కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిగారైన థవర్‌చంద్ గెహ్లోట్‌కు ఒ లేఖ రాశారు. తప్పుడు కేసుల విషయంలో సుప్రీంకోర్టును ప్రశ్నిస్తూ ఆ లేఖ ఉంది. ఇక్కడ తగిన దర్యాప్తు జరపడం, వేగంగా ఫలవంతమైన విచారణ జరపడం చాలా కష్టం. ఎందుకంటే అధికారం కలిగి ఉండడం, అధికారంలో లేకపోవడం అనే దానిమీద కూడా ఇది ఆధారపడి ఉంది. దీనికి సంబంధించి అనేకమైన సామూహిక హత్యలు, మూకుమ్మడి దహనాలకు సంబంధించిన ఎన్నోకేసులు స్పష్టంగా ఉన్నా అవి నిందితులను నిర్దోషులుగా ప్రకటించి ముగిసినాయి. విచారణ చేసిన కోర్టుల చేత చేయబడిన నేరారోపణలు, హైకోర్టుల చేత నిర్దోషులుగా ప్రకటించబడినాయి. హైకోర్టులు నిర్దోషులుగా ప్రకటించిన కొన్ని కేసులను సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. అయితే ఇక్కడ పక్కన పెట్టడం అనేది నిర్దోషులుగా ప్రకటించడం అనేది తప్పు అని అర్థంకాదు అని ఆయన రాశారు.

అత్యాచార కేసులు: తమిళనాడు, కిల్‌వెన్‌మణిలో షెడ్యూల్ కులాలకు చెందిన 44 మందిని కాల్చి చంపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కారంచేడులో ఐదుగురు, చుండూరులో 8 మంది షెడ్యూల్ కులానికి చెందిన వారు సామూహికంగా హత్యగావించబడ్డారు. బీహార్‌లోని బతానితోలాల్‌లో 21 మంది దళి

“కొన్నిసార్లు ఛార్జీషీటు నమోదు చేయడానికి ఒకటి, రెండు సంవత్సరాలు పడుతుంది. ఈ సమయంలో నేరస్థులు బాధితులను భయపెట్టడానికి, రాజీపడేటట్లు చేయడానికి వివిధ స్థాయిలలో ప్రయత్నం జరుగుతుంది. ఒకవేళ అన్ని సక్రమంగా నమోదు చేయబడినా, నిందితులు, పోలీసులు, న్యాయవాదులు రాజకీయ ప్రాబల్యం కలవారితో కలిసిపోవడం అనేది ఆ కేసులో నిర్దోషిత్వాన్ని నిర్ధారిస్తుంది.”

తులు చంపబడ్డారు. ఈకేసులన్నింటిలో నిందితులు నిర్దోషులుగా విడుదల చేయబడ్డారు.

జాతీయ నేర నమోదు సంస్థ (ఎన్‌సిఆర్‌బి) గణాంకాల ననుసరించి, 2016లో షెడ్యూలు కులాల మీద దాడులకు వ్యతిరేకంగా నమోదైన కేసుల్లో నిరాశజనకంగా 1.4 శాతం నేరారోపణ దశలోనే ముగిసినాయి. అలాగే షెడ్యూల్ జాతుల విషయంలో ఇది 0.8 శాతంగా ఉంది. సుప్రీంకోర్టు ధర్మాసనం జాతీయ నేర నమోదు సంస్థ గణాంకాలను ఉదహరించిన దాని ప్రకారం విచారించబడిన 5,347 ఎస్‌సి కేసులు, 912 ఎస్టీ కేసులు తప్పుడు కేసులుగా కనుగొనబడ్డాయి అని వ్యాఖ్యానించింది. అలాగే 2015 సంవత్సరంలో న్యాయస్థానాల చేత నిర్ణయించబడిన 15,638 కేసుల్లో 11024 కేసులు నిర్దోషులుగా తేలడం లేదా కేసులు కొట్టి వేయడం, 495 కేసులను ఉపసంహరించుకోవడం, 4,119 కేసులు నేరారోపణ కేసులుగా తేల్చబడడం జరిగిందని కోర్టు ఉటంకించింది. 2015లో పోలీసుల చేత విచారించబడిన మొత్తం ఫిర్యాదుల్లో, 15 నుంచి 16 శాతం కేసులు మూసివేస్తూ నివేదించబడ్డాయి. 2015లో కోర్టుల చేత మూసివేయబడిన (తొలగించబడిన) కేసుల్లో 75 శాతం కంటే ఎక్కువ కేసులు నిర్దోషిగా ప్రకటించబడడం లేదా వెనక్కి తీసుకోవడం లేదా ఆ కేసులను పరిష్కారం చేయడం జరిగింది. అత్యాచార చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ రకమైన నిర్దిష్ట ఫిర్యాదుల ద్వారా పార్లమెంటులో ప్రశ్న లేవనెత్తబడింది. తప్పుడు కేసులు పెట్టినవారిని ఎలా శిక్షిస్తారు అని పార్లమెంటులో ప్రశ్నించారు. ఈ చట్టం యొక్క లక్ష్యానికి వ్యతిరేకంగా తప్పుడు కేసులు పెట్టిన ఎస్సీ, ఎస్టీలను శిక్షించడం జరుగుతుంది అని ఆ ప్రశ్నకు సమాధానం చెప్పారు.

2015 మార్చి 15న కేంద్రప్రభుత్వం ఒక పత్రికా ప్రకటన ఇచ్చింది. తప్పుడు కేసులు పెట్టే వారి విషయంలో భారతీయ శిక్షాస్మృతిలోని సంబంధిత సెక్షన్ల ప్రకారం శిక్ష విధించబడుతుంది అనేది దాని సారాంశం. కోర్టు ఇచ్చిన వివరణను సవాలు చేస్తూ నిర్దోషులుగా ప్రకటించబడడం అంటే అవి తప్పుడు కేసులా, ప్రజలు చంపబడకపోవడాన్ని తప్పుడు కేసులు అని చెబుతారా అని కృష్ణన్ నిలదీశారు.

“విచారణ ఫలితాలను వెల్లడించడంలో ఆలస్యమంటే బాధితులను బెదిరించడమే, బాధితులు, సాక్షుల ప్రాణాలు పోవడం అనేక రూపాల్లో జరుగుతుంది. సాంఘిక, ఆర్థిక బహిష్కరణలు ఏవైతే వారిని అశక్తులుగా చేస్తాయో అవన్నీ ప్రాణాలు తీసినట్లే భావించాలి. బహిష్కరణ కారణంగా ఏర్పడిన అశక్తత ప్రభావం గురించి 1929లో సైమన్ కమీషన్ ముందు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పాడు. ఈ కారణం వలన ఈ చట్టం మరింత కఠినతరం చేయబడింది. షెడ్యూల్ కులాలు, తెగల (అత్యాచారాల నిరోధక) సవరణ చట్టం 2015 ద్వారా కఠినం చేయబడింది.

ఎందుకంటే కులవ్యవస్థ కొన్ని శతాబ్దాలుగా వారసత్వ సమస్యగా ప్రబలింది. కుల ఆధారిత ఆలోచనా విధానం, కులం ఆధారంగా పక్షపాతం చూపడం లాంటివి బాగా పెరిగాయి. ప్రభుత్వ అన్ని విభాగాలు, సంస్థలలో ఇది ప్రవేశించింది. ఈ మొత్తాన్ని చూపడంలో ఈ చట్టం బాగా ఉపయోగపడినా ఇంకా చాలినంత జరగలేదు” అని ఆయన చెప్పారు. ఈ చట్టంలో కొన్ని ముఖ్యమైన సవరణలతో బాధితులు, సాక్షుల హక్కులతో కూడిన ఓ కొత్త చాప్టర్‌ను ప్రవేశపెట్టాలి.

జాతీయ నేర నమోదు సంస్థ (ఎన్‌సిఆర్‌బి) గణాంకాల ప్రకారం దేశంలో ప్రతిరోజు ఒక దళిత/ ఆదివాసీ మహిళ అత్యాచారానికి గురవుతుంది. అని రమేష్‌నాథన్ చెప్పాడు.

ఈ చట్టం క్రింద చేయబడుతున్న సగటు నేరారోపణ 25 శాతం కంటే తక్కువ. “అధిక నిర్దోషిత్వ రేటును పట్టుకొని, ఇది తప్పుడు కేసుల వల్లనే జరిగిందని వ్యాఖ్యానించడం, కోర్టు అధిక నిర్దోషిత్వానికి కారణాలను లెక్కలోకి తీసుకోక పోవడమే” అని ఆయన చెప్పారు. కులతత్వం సమాజంలో లోతుగా పాతుకుపోయి పోలీసులు, న్యాయవ్యవస్థ లాంటి సంస్థలలో పనిచేసే సభ్యులలోకి ఇది ప్రవేశించింది.

“అధిక నిర్దోషిత్వం నమోదు కావడానికి కారణం పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకపోవడం, తగిన విధంగా దర్యాప్తు చేయకపోవడం, చార్జిషీట్లు దాఖలు చేయకపోవడం లాంటి వాటి వల్ల జరుగుతుంది. కొన్నిసార్లు ఛార్జీషీటు నమోదు చేయడానికి ఒకటి, రెండు సంవత్సరాలు పడుతుంది. ఈ సమయంలో నేరస్థులు బాధితులను భయపెట్టడానికి, రాజీపడేటట్లు చేయడానికి వివిధ స్థాయిలలో ప్రయత్నం జరుగుతుంది. ఒకవేళ అన్ని సక్రమంగా నమోదు చేయబడినా, నిందితులు, పోలీసులు, న్యాయవాదులు రాజకీయ ప్రాబల్యం కలవారితో కలిసిపోవడం అనేది ఆ కేసులో నిర్దోషిత్వాన్ని నిర్ధారిస్తుంది” అని ఆయన చెప్పారు. దీనికి అదనంగా న్యాయవ్యవస్థలో కుల పరమైన ఆలోచనా విధానాన్ని ప్రస్తావించారు.

కొన్ని సందర్భాలలో ఈ చట్టాన్ని స్వార్థ ప్రయోజనాలతో దుర్వినియోగం చేయడాన్ని సుప్రీంకోర్టు గమనించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ ప్రత్యర్థులమీద, వ్యక్తిగతమైన పౌర వివాదాలను పరిష్కరించుకోవడానికి, ఆస్తులు, పర్యవేక్షణ వివాదాల్లో, ఉద్యోగ తగాదాలు, సీనియారిటీ వివాదాల్లో ఇది దుర్వినియోగం అయినట్లు సుప్రీంకోర్టు గమనించింది. వాస్తవంలో ఒక్కడంటే ఒక్క పోలీసు అధికారి కూడా ఈ చట్టం కింద శిక్షించబడలేదు. కస్టడీలో లాకప్ మరణాలు, లేదా రేప్ కేసులులాంటి వాటిలో మాత్రమే యూనిఫాంలో ఉన్నవారిని శిక్షించడం జరిగింది అని రమేష్ నాథన్ చెప్పారు.

ఈ చట్టం ప్రకారం ప్రతి జిల్లాలో ఈ కేసులను వేగంగా పరిష్కరించడానికి ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయబడతాయి. 2015లో సామాజిక న్యాయశాఖా మంత్రి నివేదిక ప్రకారం, 14 రాష్ట్రాల్లో కేవలం 194 ప్రత్యేక కోర్టులు మాత్రమే ఉన్నాయి. దళితులు, గిరిజనులపై జరిగిన అత్యాచారాలలో 80 శాతం కంటే ఎక్కువ బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఛత్తీస్‌ఘఢ్, గుజరాత్, జార్ఖండ్, ఒడిషా తమిళనాడు, తెలంగాణలలో జరిగాయి.

> “మోడీ ప్రభుత్వం ముందుగా ఈ తీర్పు మీద తీవ్రమైన విమర్శలు రాకుండా చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం చట్టాన్ని నీరుగార్చే విధంగా కుట్రచేస్తున్నట్లు కనిపిస్తుంది. ఈ వైఫల్యానికి కేంద్రం తరపున ప్రాతినిధ్యం వహించే అదనపు సొలిసిటర్ జనరల్ వాస్తవాలను కోర్టు ముందు ఉంచడంలో వైఫల్యం చెందారు అని ఆరోపణ లెదుర్కొన్నారు. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటినుండి దళితుల మీద దాడులు బాగా పెరిగాయి.”



సుప్రీంకోర్టు ఎస్‌సి, ఎస్‌టి చట్టాన్ని నీరుగార్చడానికి వ్యతిరేకంగా బంద్‌లో పాల్గొన్న దళితులు

బి.ఆర్ అంబేద్కర్ చెప్పినట్లు, చట్టం పనిచేసేదానిమీద న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. రాజ్యాంగం చెప్పిన దాన్ని సాధించడానికి కులరహిత, ఉమ్మడి సమాజాన్ని సాధించడానికి, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే సూత్రాలను న్యాయమూర్తులు చెప్పారు.

“చట్టం మీద తనిఖీ అంటే అర్థం ఏమంటే సౌభ్రాతృత్వాన్ని అభివృద్ధి చేయడాన్ని బాగా పరిమితం చేసి, వర్తమానాన్ని కులం, కులతత్వం లోకి తీసుకెళ్లే వ్యూహంలో భాగం తప్ప మరొకటి కాదు. ఎస్‌సి, ఎస్టీలకు చెందిన భూమి విషయంలో అధికార దుర్వినియోగానికి పాల్పడడాన్ని, ఎస్సీ, ఎస్టీ భూములకు నీటిపారుదల కొరతను ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు ఎస్సీ, ఎస్టీ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించకపోవడాన్ని, నవజాత శిశువులు, చిన్నపిల్లలు, ఐదుసంవత్సరాలకంటే తక్కువ వయసున్న పిల్లలతో ఉన్న అధిక మరణాల రేటు, పిల్లల్లో పెరుగుదల లేకపోవడం, రక్త హీనత, ఇతర అనారోగ్య సూచీలను తొలగించటానికి కృషిచేయాలి. వీటన్నింటిని పరిగణన లోకి తీసుకొని పనిచేయాలి. కులవ్యవస్థ మీద కేవలం నినాదాలు, మాటల యుద్ధం వల్ల దానిని తొలగించలేము” అని కృష్ణన్ చెప్పారు.

మోడీ ప్రభుత్వం ముందుగా ఈ తీర్పు మీద తీవ్రమైన విమర్శలు రాకుండా చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం చట్టాన్ని నీరుగార్చే విధంగా కుట్రచేస్తున్నట్లు కనిపిస్తుంది. ఈ వైఫల్యానికి కేంద్రం తరపున ప్రాతినిధ్యం వహించే అదనపు సొలిసిటర్ జనరల్ వాస్తవాలను కోర్టు ముందు ఉంచడంలో వైఫల్యం చెందారు అని ఆరోపణ లెదుర్కొన్నారు. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటినుండి దళితుల మీద దాడులు బాగా పెరిగాయి.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల మరణం విషయంలో, ఉనాలో దళితుల మీద దాడుల విషయంలో మోడీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు ప్రభుత్వ దళిత వ్యతిరేక పాత్రను బహిరంగ పరిచింది. రాజ్యాంగాన్ని మార్చాలని, భారతదేశాన్ని హిందూదేశంగా చేయాలని, అన్నికులాలను అలాగే ఉంచాలని కులవ్యవస్థను హిందువుల్లో అగ్రవర్ణాల పెత్తనాన్ని కాపాడాలని, ఎస్సీ ఎస్టీతో కలిసిమెలిసి ఉండకూడదని బిజెపికి చెందిన మంత్రులు, శాసనసభ్యులు ప్రకటనలు చేస్తున్నారు.

**పిటీషన్ల సమీక్ష**

సుప్రీంకోర్టు తీర్పు ననుసరించి, అనేక మంది బిజెపి శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు రామ్‌విలాస్ పాశ్వాన్, థవర్‌పంచ్ గెహ్లాట్ నాయకత్వంలో ప్రధానమంత్రి మోడీని కలిసారు. లోక్‌జనశక్తి పార్టీకి చెందిన చిరాగ్ పాశ్వాన్ సుప్రీంకోర్టులో ఒకరివ్యూ పిటిషన్‌ను దాఖలు చేశారు. అనేకమంది వ్యక్తులు, గ్రూపులు రివ్యూ పిటిషన్స్ వేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. తీర్పును పున: పరిశీలన చేయాలని కోరుతూ ఒక విస్తృత ధర్మాసనం వేయాలని, చట్టంలో ఉన్న మార్గదర్శకాలను తొలగించవద్దని కోరుతున్నారు. కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఏప్రిల్ 2న ఒక రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేసింది. స్పష్టంగా, ఇది మైనారిటీలను బుజ్జగించడానికి ఒత్తిడితో చేసింది. ప్రధానమంత్రి మోడీ లేదా ఆయన మంత్రులు ఎవ్వరూ చట్టాన్ని పరిరక్షిస్తామని హామి ఇవ్వని కారణంగా దేశంలో ఉన్న అనేక దళిత సంఘాలు ఏప్రిల్ 2న భారత్ బంద్‌కు పిలుపు నిచ్చాయి. కేంద్రం వేసిన రివ్యూ పిటిషన్‌ను కోర్టు నమోదు చేసుకుంది, సవివరంగా తరువాత ఈ పిటిషన్‌పై వాదనలను వింటుంది.

1989 చట్టం, 2015 అత్యాచార నిరోధక సవరణలను కూడా 9వ షెడ్యూల్‌లో చేర్చాలి. అలా చేయడం వల్ల న్యాయపరంగా సమీక్ష నుండి రక్షణ కలిగించబడుతుంది అని కృష్ణన్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న అన్ని రాష్ట్రాల అభ్యర్థనల్లో హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించిన కేసుల్లో వాటికి వ్యతిరేకంగా భారత ప్రభుత్వం పార్టీగా వ్యవహరించాలి. చుండూరు, బీహార్‌కు సంబంధించిన ఆరుకేసులు లక్ష్మణ్‌పూర్‌బత్, బతానితోలాతో కలుపుకొని వీటన్నింటిలో కేంద్రం ఒక పార్టీగా ఉండాలని కృష్ణన్ సలహా ఇచ్చారు.

“ఈ దేశంలో ఎస్సీలకు చెందిన ప్రాథమిక సమస్యలైన భూముల తిరస్కరణ లాంటి గ్రామీణ సమాజానికి తీవ్ర హాని కలిగించే సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం ఎక్కువకాలం ఉండలేదు. అలా ఎందుకంటే అన్ని రాజకీయ పార్టీలను ఎవరైతే ఎక్కువగా ప్రభావితం చేస్తారో వారి పాత్ర ఇక్కడ కీలకం. ప్రజాస్వామ్యంలో అణచివేతదారులు, అణచివేయబడే వారికి భిన్నమైన ఆసక్తులు (అభిప్రాయాలు) ఉంటాయి. పాలనకు సంబంధించిన అన్ని సాధనాలు అణచివేతదారుల దగ్గర ఉన్నప్పుడు అణచివేయబడేవారు. తప్పనిసరిగా సంఘటితం కావడం నేర్చుకోవాలి. అణచివేయబడే వారిసంఖ్య తమ వాదనను త్వరలో లేదా తర్వాత అయినా వినే విధంగా చేయాలి. ప్రభుత్వం నిజాయితీగా ఉందా, లేదా అనేది సమస్య కాదు. ఒకవేళ రివ్యూ పిటిషన్లు విఫలమైతే రాజ్యాంగ సవరణ లాంటి ఇతరమార్గాలు ద్వారా ప్రయత్నం చేయాలి” అని కృష్ణన్ అన్నారు.

**(అనువాదం: కె. నాగమల్లేశ్వరరావు)**

**కారల్ మార్క్స్ ద్విశత జయంతి ప్రత్యేకం**

# చరిత్ర గురించి మార్క్స్ భావన

**ఇర్ఫాన్ హబీబ్**



రచయిత ప్రముఖ చరిత్రకారుడు

ఈ ఏడాది మార్క్స్ మహనీయుని ద్విశత జయంతి. దానిని ఘనంగా జరపడమంటే ఆయన బోధనలను మననం చేసుకోవడం, వాటిని ఆచరించడం. ఆయన బోధనలలో అత్యంత కీలకమయినది. చరిత్ర గురించి ఆయన అవగాహన. భారతదేశంలో నివసిస్తున్న మనకు, ఇతర దేశస్థులకు కూడా ఇది అత్యంత ప్రధానమైనది. ఎందుకంటే మానవజాతి గత అనుభవాల నుండి మనం ఏ గుణపాఠాలు తీసుకోవాలి, మానవ సమాజ గమనం తీరు తెన్నులను అర్థం చేసుకుంటూ భవిష్యత్తును ఎలా తీర్చి దిద్దుకోవాలి అనే మార్గదర్శకత్వాన్ని కూడా ఇది అందిస్తుంది.

మార్క్స్ ధృవీకరించిన అంశాలనే ఈనాటి ప్రముఖ ఆధునిక చరిత్రకారులు తరచుగా ధ్రువీకరిస్తున్నారు. ఇ హెచ్ కార్ లాగానే మార్క్స్ కూడా "చారిత్రక వాస్తవాలను" మనం అర్థం చేసుకోగలమని, అన్వేషణ, ఎంపిక, అటువంటి వాస్తవాలను వివరించటం ద్వారా తమ జ్ఞానాన్ని మరింత పరిపుష్టం చేసుకోగలరని చెప్పారు. మార్క్స్ కూడా మార్క్‌బ్లాక్ లాగా చరిత్ర అధ్యయనం ద్వారా దానిని ఉపయోగించుకోగలమని, అది తనకుతానుగా ప్రత్యేకమైనది కాదని, అది మనజ్ఞానంలో ఒకభాగం మాత్రమేనని చెప్పారు. మన భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవటానికి అది ఉపయోగపడుతుందని చెప్పారు. "తాత్వికులు ప్రపంచాన్ని పరి పరి విధాలుగా వ్యాఖ్యానించారు. అయితే అసలు విషయం దానిని మార్చడం ఎలా అన్నదే (థీసిస్ ఆన్ ఫ్యూర్బ)" అని 1845 లోనే మార్క్స్ చెప్పారు. మనం గతకాలపు పరిస్థితులను, అనుభవాలను నమోదు చేసిన చరిత్రను ఈనాటి మన కార్యాచరణను రూపొందించుకోవడానికి సహాయపడేందుకు అధ్యయనం చేస్తాం.

చరిత్రను తెలుసుకునేందుకు రెండురకాల దృక్పథాలు ఉన్నాయి. ఒకటి రాజకీయ, సాంస్కృతిక సంఘటనలను ఇదివరకటి రచయితలు వర్ణించిన విధంగానే నమోదు చేసే పద్ధతి. గతంలో జరిగిన సంఘటనలను మన పూర్వీకుల దృష్టినుంచే చూడడం, అంటే ఆనాటి భిన్నమైన రాజకీయ, సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకపోవడం. నిజానికి ఆనాటి పరిస్థితుల ఉపయోగం మనకిప్పుడు పరిమితంగానే ఉంటుంది. అందువలననే ఈనాడు చరిత్ర అధ్యయన కృషిలో ఉన్నవారు వారి వద్ద ఉన్న చారిత్రక ఆధారాలకు 'గుణాత్మక విశ్లేషణలు' చేయడాన్ని అంగీకరించడం లేదు. మార్క్స్ కూడా ఇదే విషయాన్ని చెప్పారు "ఒక వ్యక్తి తనను గురించి తనేమనుకుంటున్నాడో అన్న దానిని బట్టి అతనిని ఎలాగయితే అంచనా వేయమో అలాగే మారుతున్న కాలానికి సంబంధించి ఆనాటి చైతన్యంతో అంచనాకు రాలేము". (ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీకి ముందు మాట).

**రెండో పద్ధతి:** సాధారణ సార్వజనీన మానవ చరిత్ర సూత్రాలను ప్రత్యేక కాలానికి, లేదా ప్రత్యేక దేశ, ప్రాంత చరిత్రకు జోడించడం. సార్వజనీన, ప్రత్యేక చరిత్రలను నిరంతరం జోడించే అవకాశం పాతతరం చరిత్ర పరిశోధకులకు లేదు. పూర్వకాలంలో చరిత్ర పరిశోధనలో విశేష కృషి చేసిన హెరొడోటస్ (5వ శతాబ్దం బిసి,గ్రీస్)

అత్యున్నత మేధావి ఐన ఇబన్ ఖల్దూం (14వ శతాబ్దం, ఉత్తర ఆఫ్రికా) కాలగమనంతో చరిత్ర విస్తరిస్తుంటుందని చెప్పారు. అలాగే సాధారణ అన్వయింపును జోడిస్తే సార్వజనీన అనుభవాల వన్నె పెరుగుతుంటుంది. ఇది ప్రత్యేకకాలంలోని ప్రతి దేశచరిత్రను అర్థం చేసుకోవడానికి నిరంతరం ఉపయోగపడుతుంటుంది. మార్క్స్ దృష్టిలో చరిత్ర సార్వజనీన అనుభవాల సారం. గతకాలం గురించిన శాస్త్రీయ ఆధునిక పరిశోధనలతో ఆధునిక తాత్వికతను, ముఖ్యంగా హెగెల్ లాంటి వారు జోడించగా, మార్క్స్ చరిత్ర పూర్తిగా వాస్తవ సమాచారం ఆధారంగానే గ్రహించారు. అదే సమయంలో ఒక ఏకీకృత చట్రంలో ఇమిడ్చి చరిత్రనంతటిని అధ్యయనం చేసేందుకు వీలు కల్పించాడు.

తమ భౌతిక అవసరాలను తీర్చుకోవడానికి ప్రయత్నించడమే మానవ సమూహాల మధ్య సామాజిక సంబంధాలు ఏర్పడటానికి మౌలిక ప్రాతిపదిక అని మార్క్స్ భావిస్తారు. ఈ అవసరాలను తీర్చుకోవటం ఉత్పత్తి ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. స్త్రీ, పురుషులు సమూహాలుగా పాల్గనటం ద్వారానే ఉత్పత్తి సాధ్యపడుతుంది. 'భౌతిక జీవనావసరాలను ఉత్పత్తి చేసే పరిస్థితులే సామాజిక, రాజకీయ, వైజ్ఞానిక జీవన క్రమాన్ని నిర్ణయిస్తాయి" అన్న (రాజకీయ అర్థశాస్త్ర విమర్శకు ముందుమాట). భావన మార్క్స్ ఆలోచనలకు మూలం. అందువలననే ఆయన చరిత్రను పరిశీలించిన విధానాన్ని చారిత్రక భౌతికవాదం అని అంటారు. ఇందుకు భిన్నంగా భావవాద తత్వవేత్తల దృష్టిలో చరిత్ర ముకుళించిన ఆలోచనలు విప్పారడం, లేదా దైవాదేశాలు గలది లేదా ఇంకా పామరుల స్థాయిలో చెప్పాలంటే జాతి లేదా మతం పేరుతో ఘనత వహించిన వ్యక్తులు రూపొందించినది మాత్రమేనని భావిస్తారు.

ఉత్పత్తి చేయకుండా కేవలం ఆహారాన్ని సేకరించిన ఆదిమ మానవుని గురించి మార్క్స్ తర్వాతి కాలంలో తెలుసుకున్నాడు (వేట, చేపలు పట్టడం, పండ్లు సేకరించడం తదితరాలుగా). మానవులు వర్గ విభజన లేని పురాతన సమాజాలలో నివసించారు. అయితే వ్యవసాయం అభివృద్ధి చెందిన నాటి నుండి మానవుడు తన

> **"అదనపు ఉత్పత్తి చేసే సమాజాలన్నిటి చరిత్రలోను ఉన్న ఒక సాధారణాంశం వర్గ పోరాటాలైతే ఆ సమాజాలన్నిటిలో ఉన్న వర్గాలు నిరంతరం మార్పు చెందుతూ ఉండడం కూడా సాధారణమైన అంశమే. ఏదైనా మార్పు చెందనిది ఉన్నదంటే అది మార్పు మాత్రమే అని మార్క్స్ అభిప్రాయం. అందువలన సంచిత మార్పులు సమూల మార్పులకు దారితీశాయి."**



పెట్టుబడిదారీ విధానంలో సామూహికంగా ఉత్పత్తి చేస్తున్న కార్మికులు

మౌలిక అవసరాలకంటే 'అదనం' గా ఉత్పత్తి చేయటం మొదలు పెట్టాడు. దానితో సమాజం వర్గాలుగా విడిపోయింది. ఉత్పత్తి చేసేవారు ఒక వర్గంగానూ చేసిన ఉత్పత్తిని వారివద్ద నుండి బలవంతంగా లాక్కునేవారు మరో వర్గంగానూ విభజించబడ్డారు. రెండో వర్గమైన దోపిడీదారులు వారు బలప్రయోగం ద్వారా తమ స్థానాన్ని సుస్థిరం చేసుకుని రాజ్యాలను స్థాపించారు. ప్రైవేటు ఆస్తులను కాపాడే సంస్థలను ఏర్పరచుకున్నారు. మనుషులలో కొందరు వ్యక్తులు మరికొందరు వ్యక్తుల వ్యక్తిగత ఆస్థిగా, బానిసలుగా మారారు. భూమి విషయంలో కూడా ఇదే జరిగింది. ఆనాటి నుండి భౌతిక అవసరాలను తీర్చుకోవడం కోసం శ్రామికుల, ముఖ్యంగా కార్మికుల, రైతుల మిగులును స్వాధీనం చేసుకోవటం, దానిని తామవద్ద ఉంచుకొని తామే అనుభవించటం కోసం జరిగిన పోరాటాలతో మిళితమయింది. మానవ సమాజం దోపిడీ సమాజంగా మారిపోయింది. అందువలననే "ఇప్పటివరకు ఉన్న చరిత్రంతా వర్గ పోరాటాల చరిత్రే" అని కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్ ఏంగెల్స్‌లు చెప్పారు.

అదనపు ఉత్పత్తి చేసే సమాజాలన్నిటి చరిత్రలోను ఉన్న ఒక సాధారణాంశం వర్గ పోరాటాలయితే ఆ సమాజాలన్నిటిలో ఉన్న వర్గాలు నిరంతరం మార్పు చెందుతూ ఉండడం కూడా సాధారణమయిన అంశమే. ఏదయినా మార్పు చెందనిది ఉన్నదంటే అది మార్పు మాత్రమే అని మార్క్స్ అభిప్రాయం. అందువలన సంచిత మార్పులు సమూల మార్పులకు దారితీశాయి. ఫలితంగా మానవ చరిత్ర వేరు వేరు 'సమాజాలఏర్పాటుగా' కనిపిస్తుంది. ప్రతి సామాజిక వ్యవస్థ ఆ సమాజంలో జరుగుతున్న ఉత్పత్తి విధానంపైనా, 'ఉత్పత్తి దారుల' నుండి అదనపు ఉత్పత్తిని ఏ విధంగా కాజేస్తున్నారన్న దానిపైనా ఆధారపడి ఉంటుంది. అంటే ఆనాటి పరికరాలు, అప్పటికున్న సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడి ఉంటుంది. సామాజిక వ్యవస్థకు పునాది 'ఉత్పత్తి సంబంధాలు' అని, ఆనాటికి ఉపయోగంలో ఉన్న ఉత్పత్తి సాధనాలపై ఇవి ఆధారపడి ఉంటాయని చెప్పాడు. యూరప్‌ను పరిశీలించిన మార్క్స్ ప్రాచీన వర్గ సమాజాన్ని బానిసవ్యవస్థగాను, ఆ తరువాత కట్టుబానిసలపై ఆధారపడిన సమాజాన్ని భూస్వామ్య వ్యవస్థగాను పేర్కొన్నాడు. చివరిగా పారిశ్రామిక విధానంపై ఆధారపడిన జీతగాళ్లయిన కార్మికులతో కూడిన సమాజాన్ని పెట్టుబడిదారి వ్యవస్థగా పేర్కొన్నాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ యూరప్‌లో ప్రారంభమయినా ప్రపంచం మొత్తం వ్యాపించింది. దోపిడీ సమాజపు చివరి దశ ఇది. దీనిస్థానంలోనే మనం దోపిడీ రహిత సోషలిస్టు సమాజాన్ని నిర్మించాలి.

పైన మనం చెప్పుకున్న వ్యవస్థలలో మార్పులు రావడానికి కారణం ఏమిటి? ఇవి ప్రకృతి సిద్ధంగా వచ్చిన మార్పులు కాదు. వర్గ పోరాటాలే ఇందుకు కారణం. ఎక్కడయితే మానవ కార్యకలాపాలు ఉంటాయో అక్కడ 'చైతన్యవంతమయిన' ఆలోచన ఉంటుంది. అదే అన్ని తక్షణ చర్యలకు ప్రేరణ అవుతుంది. ఈ ప్రేరణ అన్నది భౌతిక పరిస్థితులమీద ఆధారపడి ఉంటుందని మార్క్స్ అన్నట్టు ఒక అపప్రద ఉంది. "మానవుల చైతన్యం వారి మనుగడను నిర్ధారించదు. వారి సామాజిక మనుగడ చైతన్యాన్ని నిర్ధారిస్తుంది (రాజకీయ అర్థశాస్త్ర విమర్శకు ముందుమాట)" అని మార్క్స్ అనడాన్ని తప్పుగా వొక్కాణించడం వలన ఈ అపప్రద ఏర్పడింది. వాస్తవంగా ఆ తరువాత 'నిర్ధారించడం' అన్న పదాన్ని గురించి మార్క్స్ వివరించారు". మానవజాతి తాను పరిష్కరించ గలిగిన లక్ష్యాలనే ఎంచుకుంటుంది. ఇంకా నిశితంగా పరిశీలిస్తే, ఆ సమస్య పరిష్కరించటానికి తగిన భౌతిక పరిస్థితులు అప్పటికే ఏర్పడినపుడే లేదా కనీసం ఏర్పడుతున్నప్పుడే ఆ సమస్య ఉనికిలోకి వస్తుంది.

మరో మాటల్లో చెప్పాలంటే ఆనాటికున్న భౌతిక పరిస్థితులకు లోబడి చైతన్యం ఉంటుంది. దీనికి తోడు మరికొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. పాత సమాజాలు తమను తాము తార్కికంగా అర్థం చేసుకోవటంలో విఫలమయ్యాయి. అందువలన ఒక వర్గానికి చెందిన వ్యక్తి, ఉదాహరణకు రైతులు తాము ఏ వర్గానికి చెందుతారో తెలుసుకోవడంలో విఫలమై ఉండవచ్చు. అటువంటి తార్కిక ఆలోచనలు కలుగకుండా తరచుగా మతం అవరోధాలు కల్పించింది. అందువలననే మార్క్స్ 'చాలాముందుగానే మతాన్ని "ప్రజల పాలిటి నల్లమందు" అని అన్నారు. అలాగే తగిన భౌతిక పరిస్థితులు ఉన్నట్లయితే మానవులు అహేతుక కార్యకలాపాలకు పూనుకున్నప్పటికీ అవికూడా సామాజిక వ్యవస్థపై ప్రభావం కలిగించటానికి

(మిగతా 23వ పేజీలో)

పుస్తక సమీక్ష

# పేదలకు అందని అభివృద్ధి ఫలాలు

**ఆర్. శ్రీవత్సన్**




దళితులు, ఆదివాసీలను మరింతగా అణచివేయడానికి సరళీకరణ విధానా లను అమలు చేస్తున్న భారతదేశంలో వ్యవస్థీకృత ఏర్పాట్లు జరుగుతున్నాయా? అట్టడుగు ప్రజానీకాన్ని మరింతగా అణచివేతకు గురిచేయడానికి కులము, తెగ, వర్గం కలిసి సాధనాలుగా మారుతున్నాయని పలువురు సామాజిక అధ్యయన కారులు చేసిన అధ్యయనం తెలుపుతోంది. పేదలను జల్లెడ పట్టి వృద్ధి ప్రక్రియ నుండి ఏవిధంగా వేరు చేస్తున్నారో పుస్తక శీర్షిక స్పష్టంగా చెబుతుంది. నూతన ఆర్థిక విధానాల అమలు ద్వారా అభివృద్ధి కొద్దికొద్దిగా సమాజమంతటికి విస్తరిస్తుందన్న ధర్మోపదేశాలను ఈ పుస్తకం సూటిగా తిరస్కరిస్తుంది. పెట్టుబడీదారి విధానంలో జరిగే స్వచ్ఛమైన ఆర్థికవృద్ధి సమాజంలో నెలకొన్న అన్ని రకాల అసమానతలను తన అదృశ్యహస్తం ద్వారా తొలగించివేస్తుందని నయా ఉదారవాద సమర్ధకులు చెబుతారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఇటువంటి భావ నలను ఈ పుస్తకం ప్రశ్నిస్తుంది. క్షేత్రస్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను విమర్శనాత్మకంగా చర్చించడం ద్వారా ఉదారవాద విధానాలను బలపరిచేవారి వాదనల్లోని డొల్లతనాన్ని బట్టబయలు చేస్తుంది.

**వర్గాలను అర్థం చేసుకోవడం..**

కొన్ని తప్పనిసరి విశ్లేషణలకే పరిమితం కాకుండా సమాజంలోని వర్గాలను ఎలా అర్థం చేసుకోవాలన్న దానికి ఈ పుస్తకం ప్రాధాన్యత ఇచ్చింది. పెట్టు బడిదారుడు, కార్మికుడు అంటూ మార్క్సిజంలో పేర్కొన్నవి మాత్రమే కాకుండా కార్మికవర్గాన్ని అణచివేతకు గురిచేస్తున్న కులం, వర్ణం, తెగ, మైనార్టీ తదితర సామాజిక నిచ్చెన మెట్లను పరిశీలించింది. వివక్ష, పేదరికం, అణచివేత లను అధ్యయనం చేయడానికి 1990వ దశాబ్దం నుండి ప్రాచుర్యం పొందిన 'విభజించి పరిశీలించే' పద్దతిని ఉపోద్ఘాతంలోనే ఈ పుస్తక రచయితలు విమర్శించారు. దానికి బదులుగా నిర్దేశిత సమయంలో సమాజంలో ఉత్పత్తి, పునరుత్పత్తు లను ప్రభావితం చేసే సామాజిక అస్థిత్వ ఆధారిత అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. ఆ ఫలితాలతో రాజకీయ ఆర్థ శాస్త్ర కేంద్రంగా చేసుకుని వర్గసంబంధాలు,. కుల, వర్ణ, లింగ, ప్రాంతాలను విశ్లేషించారు. విడివిడిగా పరిశీలించడంలో ఉన్న బలహీనత లను ఈ విధానం ద్వారా అధిగమించారు. కె.పి కన్నన్ అసంఘటితరంగ కార్మికుల పరిస్థితులను తన వ్యాసంలో విశ్లేషించారు. మిగిలిన వారితో పోలిస్తే కొన్ని కులాలకు చెందిన వారు వృద్ధి ఫలాలకు మరింత దూరంగా ఉండటం ఇక్కడ కూడా కనిపిస్తుంది. నిచ్చెనమెట్ల వ్యవస్థలో నామమాత్రపు ఫలాలే చిట్టచివరన ఉన్నవారికి దక్కుతున్నాయన్న సత్యం ప్రభుత్వ స్థూల గణాంకాల ఆధారంగా చేసిన విశ్లేషణలో స్పష్టమౌతుంది.

**వలస, వివక్ష**

జయశీలమ్ రాజ కేరళ తేయాకు తోటల్లో పనిచేసే కార్మికులపై రాసిన వ్యాసం వారి జీవన స్థితిగతులు ఎలా తిరోగమనంలో ఉన్నాయో వివరిస్తుంది. తమిళదళితులు సాంప్రదాయంగా ఇక్కడి తేయాకు తోటల్లో పనిచేస్తారు. సంఘాలు పెట్టుకుని జీవన ప్రమాణాలను పెంచుకోవడానికి వారు చేసే ప్రయత్నాలను స్థానిక తోటల యజమానులు క్రూరంగా అణచివేస్తున్నారు. వీరికి ప్రత్యామ్నాయంగా జార్ఖండ్‌కు చెందిన ఆదివాసీలను పనిలో పెట్టుకుంటున్నారు. సాంస్కృతికంగానూ, ప్రాంతీయంగానూ విస్మరణకు గురైన ఆదివాసీ కూలీలు అతి తక్కువ ధరకే యజమానులకు అందుబాటులో ఉంటున్నారు. ఫలితంగా తమిళ దళితులు ఉపాధి కోల్పోయి బహిరంగ మార్కెట్లోకి ఈడ్చివేయబడుతున్నారు. అక్కడ కూడా కులపరమైనవివక్షను ఎదుర్కుంటున్నారు.

కడలూరు ప్రాంత సమస్యలపై బ్రెండాన్ డోనెగాన్ రాసిన వ్యాసం వలసలకుసంబంధించి కొత్త కోణాన్ని చర్చకు పెట్టింది. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు రావడాన్ని సాధారణంగా వలస అనే అర్థంలో వాడతాం. కానీ, ఇక్కడ పరిస్థితి అది కాదు. పరిశ్రమలు గ్రామీణ ప్రాంతానికి వలస రావడంతో వచ్చిన సమస్యలను ఆయన ఈ వ్యాసంలో వివరించారు. స్థానికంగా పలుకుబడి కలిగిన అగ్రకులస్తులు వన్నియార్లు, గౌండర్లే ఇక్కడ కూడా కీలకపాత్ర పోషిస్తున్నారు. నత్తార్ (మత్స్యకార్మికులు, పరియార్(దళితులు) ఇరుల (ఆదివాసీల)పై వారి ఆధిపత్యం కొనసాగుతోంది. ఎముకల ఫ్యాక్టరీలలో స్థానిక కార్మికులు బెంగాల్, ఒడిషా ప్రాంతాల నుండి వలస వచ్చిన వారి నుండి తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్నారు.

భద్రాచలం షెడ్యూల్డ్ ఏరియా పై దలేల్ బెంబాబలి చేసిన పరిశోధనలో లంబాడీలను ఎస్టీలుగా గుర్తించడంతో కోయ, మాదిగలు ఎదుర్కుంటున్న కొత్త సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చింది. వ్యవసాయదారులుగా గుర్తింపు పొందిన కమ్మకులస్తుల స్థాయి ఆర్థికంగానూ, సామాజికంగానూ మరింతగా పెరిగి వనరులతో నిండిన ఈ ప్రాంతంలో భూమిని పారిశ్రామిక అవసరాలకోసం సొంతం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రాజ్యాంగ బద్దంగా రూపొందించిన పలు చట్టాలు, నిబంధనలు ఎలా ఉల్లంఘనకు గురవుతున్నాయో ఆమె వివరించారు.

ఈ మూడు ఉదాహరణల్లోనూ భూ స్వామ్య కులీన వ్యవస్థను అంతం చేయకుండానే పెట్టుబడీదారీ భూస్వామ్యవర్గం ఆ తరువాతి దశకు ఎలా చేరుకుందో అర్ధమవుతుంది. (మార్క్స్ 18వ శతాబ్దంలోని బ్రూమైర్ ఆఫ్ బోన పార్టీలో చెప్పిన విధంగా)

**గిరిజనుల కష్టాలు ఇలా...**

హిమాచల్ ప్రదేశ్ చంబాలోయలోని గాడి, గుజ్జర్ (ముస్లింలు)లపై రిచ్చర్డ్ అక్సెల్బై చేసిన అధ్యయనంలో సంచార జాతులకు, కాలానుగుణంగా వలసలకు వెళ్లేవారికి మధ్య ఉన్న సంబంధాలను వివరించారు. పశుపోషకుల నుండి వ్యవసాయ దారులుగా మారిన పరిణామక్రమాన్ని వివరించడంతో పాటు, ఆ తరువాత వివిధ నిర్మాణ పనుల్లో కూలీలుగా మారిన ప్రయాణాన్ని ఈ అధ్యయనం వివరిస్తుంది.

విక్రమాధిత్య ఠాకూర్ నర్మదా వ్యాలీలో భిల్లాలపై చేసిన అధ్యయనంలో ఆధునికతకు మారే క్రమంలో వారు ఎదుర్కొన్న మూడు రకాల సంకట స్థితులను వివరించారు. సాంప్ర దాయ గ్రామాల్లో నివసించేవారు, పనుల కోసం పట్టణాలకు వలస వచ్చిన వారు, నర్మద ప్రాజెక్టు ప్రాంతంలో పునరావాసం పొందిన వారిని ఠాకూర్ పరిశీలించారు. అణచివేతకు గురైన వారుగా ఈ మూడు తరగతుల ప్రజలు అగ్ర కులస్తుల చేతుల్లో ఎదుర్కొన్న తీవ్రమైన వివక్షను ఈ అధ్యయనం కళ్లకు కడుతుంది.

వివిధ అధ్యయనాల్లో ముందుకు తెచ్చిన పరిస్థితులను, వాటి మధ్య ఉన్న సంబంధాలను ముగింపు వివరిస్తుంది. సరళీకరణ ఉదారవాద విధానాల అమలు ఫలితంగా అణచివేతకు గురైన ప్రజానీకం ఎదుర్కొన్న కష్టాల జాబితాను పేర్కొంటుంది.

ఈ అధ్యయన బృందం కొన్ని సంవత్సరాలుగా ఒకరికొకరు సహకరించుకుంటూ, స్ఫూర్తిఇచ్చుకుంటూ పరిశీలనను కొనసాగించింది. మరింతగా అధ్యయనాన్ని కొనసాగించేందుకు వీలైన పరిశోధన మార్గాలను, అవగాహనను వీరు ఏర్పాటు చేశారు. భవిష్యత్ మరింత అంధకారంగా ఉండనుంది. ❋

# చరిత్ర గురించి మార్క్స్ భావన

(21వ పేజీ తరువాయి)

దారితీస్తాయి. భారతదేశంలోని వర్ణవ్యవస్థను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అది నిరంతర మత సమ్మతితో నిర్మించబడింది. మార్క్స్ ఈ విభజనను గర్హించారు."ఇవి భారతదేశ అభివృద్ధికి, భారతదేశ శక్తికిఖచ్చితమైన అడ్డంకులు" అని అన్నారు. అలాగే ఆధునిక యుగంలో ప్రొటెస్టెంట్ క్రిస్టియానిటీ ఎదుగుదల "పెట్టుబడి పుట్టుకకు ముఖ్య కారణం" (పెట్టుబడి భాగం-1)అనిమార్క్స్ గుర్తించారు. అందువలన "మత ప్రపంచం అసలు ప్రపంచ ప్రతిబింబం"(మార్క్స్ ). మతం అసలైన ప్రపంచాన్ని

**తీవ్రంగా ప్రభావితం చేస్తుంది**

అందువలన మార్క్స్ ఆలోచనా విధానా నికి కేంద్రబిందువు, పెట్టుబడిదారీ వ్యవస్థలో నిర్మించబడిన చైతన్యం నుండి మానవులను విముక్తులను చేయడం. "పాతకాలపు దురభిమానాలు, అభిప్రాయాలతో స్థిరీకరించబడి ఘనీభవించబడిన అన్ని బంధాలు తెంచుకోబడతాయి. కొత్తగా ఏర్పడ్డవి స్థిరపడడానికి ముందే పాతబడి పోతాయి. ఘనీభవించినదంతా కరిగిపోతుంది. పవిత్రమైనదంతా అపవి త్రమవుతుంది. చివరికి మనిషి తన వివేకవంత మయిన బుద్ధితో జీవిత వాస్తవ పరిస్థితులను, తోటి మానవులతో సంబంధాలను అర్థం చేసుకోవలసి వస్తుంది" (మార్క్స్, ఏంగిల్స్-కమ్యూనిస్ట్ ప్రణాళిక).

వర్గ దోపిడీని ధ్వంసం చేసి సోషలిజాన్ని స్థాపించడానికి భౌతికపరిస్థితులు-యాంత్రీకరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థికాభి వృద్ధి స్థాయి -ఏమేరకు అభివృద్ధి చెందుతాయో ఆ మేరకే మానవ చైతన్యం అభివృద్ధి చెందు తుంది. మార్క్సిజం శాస్త్రీయ సోషలిస్టు చైతన్యం ఎదుగుదలకు పరాకాష్ట. శ్రామిక వర్గం (పెట్టుబడి దారీ వ్యవస్థలో రూపొందించబడి నది) తన పోరాటాల ద్వారా నూతన వ్యవస్థ ఆవిర్భావాన్ని సూచిస్తుంది. అయితే ఉన్న భౌతిక పరిస్థితులు తన చైతన్య స్థాయికి కారణ మని కార్మికవర్గం స్పృహ కలిగి ఉండాలి. గుడ్డి గానో సద్యోజనితంగానో విప్లవం రాదు.

అందుకనే మార్క్స్‌ను ఒక 'నియతివాది '(డెటెర్మినిస్ట్) అనలేము. అదేసమయంలో భావాల పాత్రను నొక్కి చెప్పడమే కాక అత్యంత కఠినమయిన తాత్విక, ఆర్థిక సిద్ధాంతాన్ని వివరించడానికి ఎంతో శ్రమించారు. ఆయన మనకు ఒక అద్భుతమయిన విప్లవ సిద్ధాంతాన్ని మాత్రమే వారసత్వంగా ఇచ్చివెళ్ళలేదు. దాంతో పాటు ఆయన అడుగుజాడలలో నడిచే పద్ధతు లను, ఆ ప్రాతిపదికనే మన గత చరిత్రను, వర్తమాన పరిస్థితులను అంతే కఠినమయిన విశ్లేషణ చేసి, దూరదృష్టితో మన "విప్లవ ఆచరణను" అభివృద్ధి చేసే పద్ధతులను కూడా ఇచ్చివెళ్లారు. ప్రతి చైతన్య పూరితమైన వ్యక్తి ఒక బాధ్యతను నిర్వర్తించాలి. మార్క్సిజంలోని విప్లవసారాన్ని అవగాహన చేసుకోవడమే కాదు. ఆ భావాలను విస్తృతంగా ప్రచారం చేయాలి. ఈ బాధ్యతను నిర్వరించగలిగితే వారు చరిత్రను అవగాహన చేసుకోవడమే కాదు, చరిత్ర సృష్టిస్తారు కూడా.

**(అనువాదం: కె ఉషారాణి)**


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తిప్రెస్,
గవర్నరుపేట, విజయవాడ.

# విద్య ప్రైవేటీకరణ నీతి ఆయోగ్ లక్ష్యం



రచయిత్రి
ప్రముఖ ఆర్థిక విశ్లేషకురాలు

ప్రొతివా కుందు

నీతి ఆయోగ్ మూడు సంవత్సరాల కార్యక్రమాల ప్రణాళికను, అందులో విద్య, శిక్షణ అభివృద్ధి కోసం కేటాయించిన విధానం కేవలం నామమాత్రపు పైపై మెరుగుల వ్యూహం లా గోచరిస్తున్నది. నాణ్యమైన విద్యను అందించే దిశలో, సాంకేతిక విద్యకు ఇవ్వవలసిన ప్రాధా న్యత, ప్రాథమిక విద్యకోసం కేటాయించవలసిన నిధులు, నైపుణ్యాలను పెంపొందించే శిక్షణా కార్యక్రమాలు..మొదలగు అంశాలకు ఇవ్వవల సినంత ప్రాధాన్యత ఇవ్వలేదనిస్పష్టమవుతున్నది.

1951వ సంవత్సరంలో ఆరంభమైన భారతదేశ ప్రణాళికాబద్ధ అభివృద్ధి 2017 మార్చినాటికి 12వ పంచవర్ష ప్రణాళికతో ముగిసిపోయింది. కేంద్రప్రణాళికా సంఘాన్ని రద్దుచేయాలన్న ప్రభుత్వ నిర్ణయం, తదనంతరం ఏర్పడిన "నీతిఆయోగ్" ద్వారా నూతన ప్రణాళి కలను, అభివృద్ధి కార్యక్రమాల ప్రాధాన్యతలను నిర్ణయించి, తద్వారా భవిష్యత్తులోకి పయనించా లన్న నిర్ణయం జరిగింది. నీతి ఆయోగ్ ప్రాధా న్యతలలో ముఖ్యమైన వాటిలో "వ్యూహాత్మక ప్రణాళికలను రచించడం, దీర్ఘకాలిక లక్ష్యాలతో, కార్యక్రమాలను కొనసాగించడం" ప్రధానమై నది. ఈ సందర్భంగా 15 సంవత్సరాలకు దార్శని కతలో ఓ ప్రణాళిక 7 సంవత్సరాలకు వ్యూహాత్మక ఆచరణకు అనువుగా రచన, 3 సంవత్సరాలలో అమలుకు కార్యక్రమ రూప కల్పన చేయమని, "నీతిఆయోగ్"ను ప్రభుత్వం ఆదేశించింది. ఆచరణకు అనువుగా 2017-18 నుండి 2018-19, 2019-2029 కి నిర్దేశించుకున్న లక్ష్యాలను అమలు చేయాలని 2011 ఆగస్టులో నిర్ణయం చేశారు.

ఈ డాక్యుమెంటు ప్రధాన ఉద్దేశ్యం నిర్ణయించిన పాలసీలు, సంస్థాగతమైన నూతన సంస్కరణలు, ముఖ్యంగా "ఆర్థికరంగంలో నూతన విధానాలను అమలు చేయటం ప్రముఖ పాత్ర పోషిస్తాయి.

"నీతి అయోగ్ నిర్దేశించుకున్న లక్ష్యాలలో చాప్టర్ 20లో "సోషల్ సెక్టార్"కి చెందినది. ప్రధానంగా విద్య, నైపుణ్యాల వృద్ధి దేశంలోని నిరుద్యోగతను తగ్గిస్తూ, నూతన ఉపాధి కల్పన మార్గాలను ఏర్పరచి, నిరుద్యోగాన్ని తొలగించి, యువతను స్వయం ప్రతిపత్తితో జీవించే విధం గా తీర్చిదిద్దడం. ఈ అంశాలను డాక్యుమెంట్ లో పొందుపరచిన విధానాన్ని పరిశీలిస్తే ప్రస్తుత వ్యవస్థలోని విద్యా, నైపుణ్యాల శిక్షణ నిరుద్యో గాన్ని నిర్మూలించే తీరులో లేదు. జాతీయస్థాయి లో కొత్తవిధానాలు ఆచరించి, సమానస్థాయిలో అందరికీ అవకాశాలు కల్పించడం ముఖ్యం.

నీతి ఆయోగ్ నిర్దేశించిన "మూడు సంవత్సరాల ప్రణాళికను" పరిమళించే ముందు, దేశవ్యాప్తంగా "భారతీయ పాఠశాల వ్యవస్థ ఎలా ఉంది? ఉన్నత విద్య ప్రమాణాలు ఎలా ఉన్నాయో, పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**భారతీయ విద్యావ్యవస్థ:**

భారతీయ విద్యావ్యవస్థ మిశ్రిత స్థితిలో ఉంది. సాధించిన లక్ష్యాల కన్నా సాధించవలసి నది, చాలా ఉంది. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, అనగా పాఠశాలలకు స్థూలంగా హాజరు అయ్యే నిష్పత్తిలో పరిశీలిస్తే, ప్రాథమిక విద్యాస్థాయిలో 1-5వ తరగతి వరకూ సంపూర్ణంగా 100 శాతం, ప్రాథమిక, ఉన్నత విద్య అనగా 6 నుండి 8వ తరగతి వరకు 97 శాతం బాలబాలికలు, మాత్రమే పాఠశాలలకు వెళతున్నారు. ఇవి మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డిపార్టుమెంట్ వారు స్వయంగా ప్రకటించిన వివరాలు.

విద్యార్థులు విద్యాలయాలలో చేరడం వెనుక, కృషి ఉన్నప్పటికీ, చేరినవారిని విద్యా ర్థులుగా కొనసాగించడం, అందరికీ విద్యదిశగా సమాయత్తం చేయడం వంటి సవాళ్ళున్నాయి. 2011వ సంవత్సరం ప్రకటించిన లెక్కల ప్రకారం 6 సంవత్సరాల నుండి 17 సంవత్స రాల మధ్యనున్న బాలబాలికలలో 6.5 కోట్ల మంది ఇంకా పాఠశాలల గుమ్మం తొక్కలేదు. బాలబాలికలు వందశాతం విద్యార్థులుగా నమోదవుతున్నప్పటికీ, 20 శాతం మంది 5వ తరగతి కూడా ముగించకుండా, (47 శాతం మంది పదోతరగతి ముగించకుండా "డ్రాపవుట్స్"గా మిగిలిపోతున్నారు. 2014 సంవత్సరంలో "జాతీయ మానవ వనరుల అభివృద్ధి" మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ డ్రాపవుట్స్ షెడ్యూల్ ట్రైబ్‌లలో ఎక్కువ ఉంది. 31 శాతం ప్రాథమిక విద్య, 68 శాతం పదోతరగతి కూడా ముగించడం లేదు. "నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్ఎస్) వారి అధికారిక ప్రకటన పరంగా చూస్తే" ఈ డ్రాపవుట్‌లకు మూలం" ఆర్థిక కారణాలే. ప్రభుత్వ విద్యాలయాలలో ఉన్న మౌలిక పరిస్థితులు మరో ముఖ్య కారణం. అంటే "ఆర్థిక సమస్యలు - అననుకూల వాతా వరణం రెండు కలగలుస్తున్నాయి. (ఎమ్ఓఎస్‌పిఐ 2015) ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు అస్తవ్యస్తంగా ఉండడం వలన ప్రాథమిక స్థాయినుండే పిల్లలను ప్రైవేటు సంస్థలలో చేర్పడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు. గత దశాబ్దకాలంగా ఈ శాతం విపరీతంగా వృద్ధి చెందగా పుట్టగొడుగుల్లా సంస్థలు వెలిశాయి. 2006లో 19శాతం ఉ న్న ప్రైవేటు సంస్థల విద్యార్థుల సంఖ్య 2016 నాటికి 31 శాతానికి పెరిగింది (ఎఎస్ఇఆర్-2017)

ఉన్నతవిద్యాస్థాయిలో ఈ పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. దేశవ్యాప్తంగా ఉన్నత విద్య దిశగా యువతరం అడుగులు వేస్తున్నప్ప టికీ మౌలిక వసతుల కల్పనలో వెనకబడి ఉ ంది. మనదేశంలో 864కి పైగా విశ్వవిద్యాల యాలు, 40,026 కాలేజీలు, 11669 ప్రత్యేక

**అపరిపక్వ ఫలితాలు తక్షణ సమస్య కాగా, అంతర్గతంగా నిబిడీకృత మైన సమస్యలు మరికొన్ని. ఉదాహరణకు ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం 7.5 శాతం, ఏకోపాధ్యాయ పాఠశాలలు, 4.2శాతం ఒకే ఒక్కగదిని పాఠశాలగా ఉపయోగించుకుంటున్న బడులు, 5 లక్షలకు పైగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు, 20శాతంమంది శిక్షణ లేని ఉపాధ్యాయులు ప్రాథమిక స్థాయిలో పనిచేస్తున్నారు.**



ప్రభుత్వ పాఠశాలల దుస్థితి

సంస్థలున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో సగటున 58శాతముండగా, మనదేశంలో కేవలం 44 శాతం మాత్రమే ఉంది. పుట్టగొడుగుల్లా వెరిసిన ప్రైవేటు విద్యాలయాలు 77.8 శాతముండగా, 67.3 శాతం విద్యార్థులున్నారు. ప్రాథమిక విద్యావ్యవస్థ ఎలా కునారిల్లుతుందో మౌలిక వసతులు లేని ఉన్నత విద్య కూడా అదే మార్గాన కొనసాగుతూ దేశవ్యాప్తంగా యువతలో "నిరుద్యోగానికి కారణమవుతుంది. "యాంత్రీకరణ" ఫలితంగా మానవ నైపుణ్యాల కన్నా, యంత్రాల ప్రాధాన్యత పెరిగి, నానాటికి నిరుద్యోగం ప్రబలుతుంది. ఇది చాలా ముఖ్యమైన, పరిష్కరించాల్సిన సామాజిక సమస్య.

**ఈ నేపథ్యంలో "నీతి ఆయోగ్" కార్యక్రమ ప్రణాళిక, ఆచరణను పరిశీలిద్దాం.**

**పాఠశాల విద్య కోసం ఎజెండా**

ఈ అధ్యాయం ప్రాథమిక విద్యస్థాయిలో ప్రధానంగా చేపట్టవలసిన నూతన సంస్కరణలు, వ్యూహాలను చర్చిస్తుంది. ప్రథమంగా పరిశీలించాల్సినది.. లక్ష్యాన్ని సాధించాలంటే ముందుగా" విద్యార్థుల ఫలప్రదమైన విద్యలో విజయవంతంగా నైపుణ్యం సాధించడం. నీతి ఆయోగ్ నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం 1. సఫలీకృతమైన విద్యా ప్రమాణాలు, వాటి వల్ల ఒనగూడే లాభాలకు, ప్రోత్సాహక బహుమానాలివ్వడం. 2. నూతన విధానాల రూపకల్పన కోసం, ఉపాధ్యాయులను, విద్యార్థులను ప్రోత్సహించడం. 3. ప్రస్తుతమున్న ప్రభుత్వ పాలన స్థానంలో కొత్త విధానాన్ని సృష్టించడం. ప్రతి విద్యార్థి స్థాయి ఏ విధంగా పెరిగిందో పరిశీలించడానికి నూతన విధానాన్ని ప్రకటించింది. తొలుత జాతీయస్థాయిలో "నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్" (ఎన్‌సిఇఆర్‌టి) వారి సహకారంతో ఓ సర్వే నిర్వహించడం.

నీతిఆయోగ్ 2016 ప్రకటన ప్రకారం, "స్కూల్ ఎడ్యుకేషన్ క్వాలిటీ ఇండెక్స్ (ఎస్ఇక్యూఐ) ద్వారా మంచి ఫలితాలనిచ్చిన విద్యాలయాలకు "ర్యాంకు కేటాయించడం" రైట్ టు ఎడ్యుకేషన్ (ఆర్‌టిఇ)ను, "రైటు టు లెర్నింగ్"గా మార్చి, గతంలో ఉన్న స్థితిగతులను చర్చించి, నూతన విధానంలో రాబోయే ఫలితాలను గుర్తించడం. ఈ దిశగా చేపట్టిన కార్యక్రమంలో "రాష్ట్రస్థాయిలో ఆయా ప్రభుత్వాలు, ఆయా ప్రాంతాల అవసరాల కనుగుణంగా విద్యార్థులకు ఏమేం కావాలో నిర్ణయించుకోవడం. విద్యార్థుల ప్రతిభకు కొలమానంగా స్వయంకృత విధానాలను ఏర్పరచుకోవడం" ఈ ఎజెండాలో, గతంలోనున్న టీచర్ విద్యార్థుల నిష్పత్తి, మౌలిక వసతులైన బిల్డింగ్‌లు, ఆటస్థలాలు తదితర "రైట్ టు ఎడ్యుకేషన్"లో నిర్ణయించిన వాటికి ప్రాధాన్యత ఇవ్వకుండా కేవలం విద్యార్థుల ప్రతిభకు కొలమానాలు మాత్రమే నిర్దేశించారు.

నీతి ఆయోగ్ డాక్యుమెంట్ "రైట్ టు ఎడ్యుకేషనల్" యాక్ట్‌ను విమర్శనాత్మకంగా విశ్లేషించడమే గాక, ఫలితాలు సానుకూలంగా రాకపోవడం వెనక వున్న కారణాలు కూడా పరిగణనలోకి తీసుకుంది. అపరిపక్వ ఫలితాలు తక్షణ సమస్య కాగా, అంతర్గతంగా నిబిడీకృతమైన సమస్యలు మరికొన్ని. ఉదాహరణకు ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం 7.5 శాతం, ఏకోపాధ్యాయ పాఠశాలలు, 4.2శాతం ఒకే ఒక్కగదిని పాఠశాలగా ఉపయోగించుకుంటున్న బడులు, 5 లక్షలకు పైగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు, 20శాతంమంది శిక్షణ లేని ఉపాధ్యాయులు ప్రాథమిక స్థాయిలో పనిచేస్తున్నారు. ఈ అంశాలేవీ "నీతి ఆయోగ్" డాక్యుమెంట్‌లో ప్రస్తావించలేదు. కానీ, ప్రస్తుత తమ లక్ష్యాలలో "మంచి మౌలిక వసతులు, టీచర్ – విద్యార్థి నిష్పత్తి తగ్గించుకోవడం, టీచర్లకు అధిక వేతనాలివ్వడం, మొదలగు లోపాలను నిర్దిష్టంగా గాక, అక్కడక్కడా తీసుకున్న రాండమ్ శాంపిల్స్ ద్వారా ప్రతిపాదించింది.

"బోధనా పద్ధతులను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను మాత్రం స్పష్టంగా గుర్తించింది. ఈ అంశాలను ప్రాథమిక విద్యాస్థాయిలో చేయవలసిన అభివృద్ధి ప్రధానాంగా ఎర్లీ ఛైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఇసిసిఇ) వారి సూచనలు, సలహాలకు అనుగుణంగా తీర్చిదిద్దవలసి ఉంటుంది. ఆశ్చర్యం కలిగించే అంశమే మనగా ఈ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన బోధనాంశాలపై ఎలాంటి దృష్టి పెట్టకుండా, కేవలం "టెక్నాలజీ ఆధారపరమైన బోధనా పద్ధతులను ప్రత్యామ్నాయంగా సూచించడం, ఇది ప్రస్తుత వ్యవస్థను ఏమాత్రం బలోపేతం చేయకపోవడం విచారకరం.

నీతి ఆయోగ్ ఎజెండా, ఉపాధ్యాయులు, విద్యార్థిలోకానికి సరిపడే నూతన పద్ధతులను ఆచరించాలని సూచించినప్పటికీ, వాస్తవ రూపంలో కేవలం విద్యార్థుల కోసం మాత్రమే కేటాయించబడ్డాయి.

రాబోయే మూడు సంవత్సరాలలో బోధనా పద్ధతులు కంప్యూటర్ ఆధారంగానే జరగాలని నిర్ణయించింది. అంతేగాక జాతీయస్థాయిలో పిల్లలందరికీ ప్రాథమిక అంశాలైన "గుర్తుపట్టి

చదవగలగడం". ప్రాథమిక గణిత పరిజ్ఞానం" మొదలగు వాటికి ఓ నిర్ణిత సమయాన్ని సైతం నిర్దేశించడం. అంతేగాక, స్థానికంగా లభించే ఉపాధ్యాయులను "కాంట్రాక్టు ట్యూటర్లు"గా ఈ కార్యక్రమంలోకి తీసుకోవాలనుకోవడం మరో ముఖ్యమైన అంశం. సెకండరీ విద్యనభ్య సిస్తున్న విద్యార్థులకు వారి కోరిక,, డిమాండ్ ప్రకారం టెక్నాలజీ ఆధారంగా పరీక్షలు నిర్వహించడం. ప్రభుత్వం ప్రవేశపెట్టాలను కుంటున్న టెక్నాలజీ ఆధారిత విద్య ద్వారా విద్యార్థులకు నాణ్యమైన వసతులు, విద్య కల్పించాలంటే దానికి, చాలా బలమైన డిజిటల్ నెట్‌వర్క్ కావాలి. (కృష్ణా -డెహెజియా 2017)

ప్రస్తుతం కేవలం 57.3 శాతం ప్రాథమిక పాఠశాలలకు మాత్రమే ఎలక్ట్రిసిటీ కనెక్షన్ ఉంది. కేవలం 26శాతం పాఠశాలల్లో మాత్రమే కంప్యూటర్లు ఉన్నాయి. కాబట్టి సరైన మౌలిక సదుపాయాలు లేని వ్యవస్థలో, టెక్నాలజీ ఆధారిత విద్యను అందించడం ఎంత వరకు సాధ్యం? అన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఈ విధమైన ఆలోచనలు, సంస్కరణలు విద్యావ్యవస్థ పట్ల మారుతున్న ధోరణికి, నైపుణ్యం గల విద్యా విధానం కోసం జరుగుతున్న మేధోపరమైన నూతన విధానాలు, విద్యార్థి సమగ్రాభివృద్ధికే విద్య అన్న అంశానికి పూర్తి దూరంగా జరుగుతున్నాయని గ్రహించాలి.

భారతదేశంలోని విద్యాలయాలు, ముఖ్యంగా పాఠశాలల్లో నాణ్యత పెరగాలంటే, ప్రస్తుత ప్రభుత్వ విధానాలలో పురోగతి ఉండాలి. కొన్ని ముఖ్యమైన ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకోవాలి. ప్రస్తుతమున్న మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ సింగిల్‌విండో విధానం మారాలి,. పాలసీ తయారీ,. క్రమబద్ధీకరణ, నూతన విధానాల పరికల్పన మొదలగునవి వివిధ విభాగాల్లో జరగాలి. మరింత స్వయంప్రతిపత్తి, జవాబుదారీతనం, డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు ఉండాలి. విధానపరంగా పారదర్శకత సైతం విద్యా విధానంలో నాణ్యతను పెంచుతుంది. ప్రభుత్వ విద్యాలయాలకు, ప్రైవేటు పాఠశాలలకు రెండింటికీ ఒకే విధమైన వ్యవస్థ ఉండాలి. ఈ వ్యవస్థకోసం ఎస్ఇక్యూఐ కొన్ని నిర్దిష్ట ప్రమాణాలను ఏర్పరచింది. అవి, ప్రభుత్వ విధానాలు, స్కూల్‌లో నాయకత్వం, టీచర్ల నియామకంలో పారదర్శత్వం టీచర్ల గైర్హాజరు వంటి వాటిని నియంత్రణలో ఉంచడం.

నీతి ఆయోగ్ ఎజెండా మరి కొన్ని సూచనలు కూడా అమలు చేయాలనుకుంటుంది. నూతన ప్రభుత్వ నాయకత్వం, పబ్లిక్, ప్రైవేటు

**"ఎపిఎఫ్ 2013 స్పష్టపరుస్తున్న విషయమేమనగా, గవర్నమెంట్ పాఠశాలల్లో విద్యార్థులకు చదువుకు, ప్రభుత్వం వోచర్ రూపంలో చెల్లించిన ఫీజుల పాఠశాలల్లో విద్యకూ ఏ మాత్రం వ్యత్యాసం లేదు. ప్రభుత్వ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించడం తప్ప పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్‌ని ప్రోత్సహించడం, పెయిడ్ ఓచర్ విధానం వలన ఒరిగిన లాభం ఏమీలేదు."**

పార్టనర్‌షిప్, మోడల్స్ విద్యా వోచర్లు, స్థానిక ప్రభుత్వాల సహకారంతో స్కూల్‌కు కావలసిన పరికరాల కొనుగోళ్ళు, ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై ఖర్చుచేస్తున్న మొత్తం, నిబిడీకృతమైన ఖర్చు మొదలగునవి.

విద్యావ్యవస్థలో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్, విద్యా ఓచర్ల విషయంలో నిర్ణయం తీసుకుని అడుగు ముందుకువేసే క్రమంలో నీతి ఆయోగ్ గతకాలపు అనుభవాలను పరిగణనలోకి తీసుకోవడం మంచిది. ఉదాహరణకు రైట్ టు ఏడ్యుకేషన్ చట్టంలోని సెక్షన్ 12(1)(సి) ప్రకారం, ప్రస్థుతమున్న ప్రైవేటు పాఠశాలల్లో, సామాజికంగా ఆర్థికంగా వెనకబడి ఉన్న విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలి. వారికయ్యే ఖర్చుని ప్రభుత్వం భరిస్తుంది. ఇది విద్యావ్యవస్థలో ఓచర్ సిస్టమ్‌కు ప్రతినిధి. కానీ ఈ విషయంలో ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు తిరిగి చెల్లించాల్సిన మొత్తంలోవిఫలమయ్యింది. ఇది కేవలం ఏ ఒక్క రాష్ట్రానికో పరిమితం అవ్వలేదు. దేశంలో అన్ని రాష్ట్రాలలోనూ ఇదే పరిస్థితి. ఎపిఎఫ్ 2013 స్పష్టపరుస్తున్న విషయమేమనగా, గవర్నమెంట్ పాఠశాలల్లో విద్యార్థులకు చదువుకు, ప్రభుత్వం వోచర్ రూపంలో చెల్లించిన ఫీజుల పాఠశాలల్లో విద్యకూ ఏ మాత్రం వ్యత్యాసం లేదు. ప్రభుత్వ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించడం తప్ప పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్‌ని ప్రోత్సహించడం, పెయిడ్ ఓచర్ విధానం వలన ఒరిగిన లాభం ఏమీలేదు.

### ఉన్నత విద్యారంగం

పాఠశాల విద్యావ్యవస్థను పరిష్టపరచాలన్న ఉద్ధేశానికి అనుబంధంగా, ఉన్నత విద్యను సైతం బలీయం చేయాలన్న సంకల్పంతో మరో ఐదు అంశాలను ఎజెండాలో పొందు పరిచారు. స్వయం ప్రతిపత్తిగల ప్రపంచస్థాయి విశ్వ విద్యాలయాలను నిర్మించాలనేది మొదటిది. అందులో 10 పబ్లిక్ రంగం మరో 10 ప్రైవేటు రంగంలో. సింగపూర్, చైనా దేశాలను ఆదర్శంగా తీసుకుని, ప్రస్థుతమున్న విద్యాసంస్థలనే అంతర్జాతీయ ప్రమాణాలున్న పవర్‌హౌస్‌లుగా మార్చాలని నీతి ఆయోగ్ అభిప్రాయం ఈ 20 యూనివర్సిటీలలో రెండు ఉత్తమ విద్యాలయాలను ఎంపిక చేసి ప్రభుత్వ నిధులను అధిక మొత్తంలో అందించాలి.

రెండు మూడు అంశాలు విశ్వవిద్యాలయాల, కళాశాలల స్వయం ప్రతిపత్తికి, ప్రస్తుతమున్న విధానపరమైన చట్రానికి సంబంధించినవి. ఎజెండా ప్రతిపాదించిన పద్ధతిలో మూడంచెల విధానముంటుంది. మొదటిటైర్‌లో బోధనాంశాల నిర్ణయం, పనిగంటలు మొదలగు విషయాలలో విద్యాలయాలకే స్వయం ప్రతిపత్తి నిచ్చి వాటిని అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా తీర్చి దిద్దుకునే అవకాశాన్నివ్వడం. రెండవటైర్/అంచెలో ఉపాధి సంబంధిత కోర్సులు ప్రవేశపెట్టి నిరుద్యోగాన్ని తొలగించే దిశగా విద్యను అందించడం.. మూడవ అంచెలోనున్న విద్యాలయాల ప్రధాన ఉద్దేశ్యం, లక్ష్యం "విద్యార్థులందరికీ ఉన్నత విద్యనందించడం మాత్రమే మొదటి అంచెనుండీ మూడవ అంచెలోకి వచ్చే క్రమంలో ప్రభుత్వం అందించే నిధులలో వ్యత్యాసం ఉంటుంది.

నాల్గవ సంస్కరణ ప్రకారం, పరిశోధనా రంగంలో చేపట్టవలసిన నూతన విధానాలు. ప్రాజెక్టు కనుగుణమైన పరిశోధనలు చేయడం. శాస్త్ర సాంకేతిక రంగంలోని, అవసరాల కనుగుణమైన పరిశోధనలు చేయడం. వ్యవస్థలో ఎదురువుతున్న సవాళ్లకు పరిశోధనల ద్వారా సమాధానం కనుగొనడం. కాగా ఐదవ అంశం అధికశాతం జనాభాకు ఉపాధి కల్పించే విధానాలను కనుగొనడం, ప్రస్తుతం దేశంలో ఉన్న నిరుద్యోగాన్ని నిర్మూలించే క్రమంలో శిక్షణ, నైపుణ్యాలను పెంచటానికి సంబంధించినది.

ఈ ఐదు సంస్కరణలు స్పష్టపరిచే అంశం ఏమనగా, నీతి ఆయోగ్ ఆలోచనల్లో శాస్త్ర

> **"ప్రస్తుతం మన దేశం స్థూల జాతీయోత్పత్తిలో కేవలం 2.7 శాతం పాఠశాల విద్యకోసం 3.9 శాతం అన్ని స్థాయిలలో విద్యకోసం కేటాయిస్తున్నారు. వాస్తవానికి 1966వ సంవత్సరంలో కొఠారి కమీషన్ 6 శాతం స్థూల జాతీయ ఆదాయాన్ని విద్యారంగానికి కేటాయించాలని సూచించింది. తర్వాత వచ్చిన అనేకానేక కమిటీలు సైతం సూచించాయి."**



ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేట్ పాఠశాలలు

సాంకేతిక రంగాలను పరిష్టపరచడం, మానవాభివృద్ధి, సామాజిక శాస్త్రాలకు ప్రాధాన్యత తగ్గించడం.

విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉండగా, ప్రభుత్వం అతి తక్కువ నిధులు కేటాయిస్తూ మౌలిక సౌకర్యాల విషయంలో శ్రద్ధ వహించడం లేదు. ఇది, ప్రైవేటు విశ్వవిద్యాలయాల వైపు విద్యార్థులను ప్రోత్సహించే తంతులో భాగం. ప్రైవేటు విశ్వవిద్యాలయాలలో విద్యార్థులకయ్యే ఖర్చు అధికం. అంతేగాక విద్యా ప్రమాణాలు సైతం తక్కువ స్థాయిలో ఉంటాయి. ఎన్ఎస్ఎస్ఓ వారి లెక్కల ప్రకారం మనదేశంలో 17.1 శాతం విద్యార్థులు, 10.1 శాతం విద్యార్థినులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. దానికి ప్రధాన కారణం ఆర్థిక స్థితిగతులు (ఎమ్ఓఎస్‌పిఐ 2015) 3 అంచెల విద్యావిధానం, విశ్వవిద్యాలయాలకు నిధుల కేటాయింపు విషయంలో ప్రభుత్వం వేసిన రోడ్ మ్యాప్ సైతం సామాన్య విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయడానికి దోహదం చేసేదిగా ఉంది..

ఇప్పటికే ఉన్న నిధుల కేటాయింపు విషయంలో సైతం ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు. విష:ఫలాలను ఇచ్చేవిధంగా ఉంది.

సాంకేతిక విద్య, శిక్షణ దిశగా ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం చేరలేకపోయిందనినీతి ఆయోగ్ స్వయంగా అంగీకరించింది. అందు వలన ప్రస్తుతం వేసిన కార్యక్రమ ప్రణాళిక, సక్రమంగా కొనసాగి సాంకేతిక విద్య బలోపేతం చేయాలన్న వ్యూహాలను ఆలోచిస్తుంది. ఆచరణలో పెట్టాలని అనుకుంటుంది. ఆ దిశగానే "స్కిల్ ఎసెస్‌మెంట్ బోర్డ్"ను "జాతీయ స్థాయిలోనూ, అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు కలిగించే దిశగా, "ఓవర్‌సీస్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ ఏజన్సీ "ద్వారా శిక్షణా, నైపుణ్యాలను పెంచాలని "మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ ప్రయత్నాలు చేస్తున్నది. సృజనాత్మకరంగంలోనూ, కళారంగంలోనూ, విలువైన ఆభరణాలు, రాళ్ల వస్తువుల తయారీలోనూ, ఆటోమోటివ్ సెక్టార్ రంగాలలో నైపుణ్యాలను పెంచే శిక్షణ ఇప్పించాలని నీతి ఆయోగ్ భావిస్తున్నది.

నీతి ఆయోగ్ నిర్దేశించకున్న సంస్కరణలు అటు రాష్ట్రాలలోను, ఇటు కేంద్రపాలిత ప్రాంతాలలోనూ ఆమోదించబడాలి. అన్నింటికన్నా ముఖ్యంగా మూడు సంవత్సరాలకు నిర్దేశించుకున్న విద్యాకార్యక్రమాల ప్రణాళికకు కావలసిన నిధులు ఎలా అన్న విషయం డాక్యుమెంట్‌లో ఎక్కడా చర్చించబడకపోవడం ఆశ్చర్యకరం.

నూతన విద్యావిధానం కోసం వేసిన ప్రణాళికలలో సాంకేతిక ప్రధాన అంశం. రాష్ట్రస్థాయిల్లోనూ జాతీయ స్థాయిల్లోనూ అమలు పరచాలంటే సాంకేతిక పరిజ్ఞానం ఎంత అవసరమో, నిధుల కేటాయింపు కూడా అంతే భారీ స్థాయిలో అవసరం. ప్రస్తుతం మన దేశం స్థూల జాతీయోత్పత్తిలో కేవలం 2.7 శాతం పాఠశాల విద్యకోసం 3.9 శాతం అన్ని స్థాయిలలో విద్యకోసం కేటాయిస్తున్నారు. వాస్తవానికి 1966వ సంవత్సరంలో కొఠారి కమీషన్ 6 శాతం స్థూలజాతీయ ఆదాయాన్ని విద్యారంగానికి కేటాయించాలని సూచించింది. తర్వాత వచ్చిన అనేకానేక కమిటీలు సైతం సూచించాయి. కానీ ఏ ప్రభుత్వమూ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు సరికదా క్రమానుగతంగా, విద్యాశాఖకు కేటాయింపులు తగ్గించిన చరిత్ర కనపబడుతుంది. జాతీయ కేటాయింపులు తగ్గించి, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల కేటాయింపుల అధికంగా జరగాలని ప్రభుత్వం భావిస్తుంది. కానీ ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వంతో ఎలాంటి సంప్రదింపులు నీతి ఆయోగ్ చేయకపోవడం గమనార్హం.

**ముక్తాయింపు:** వ్యూహాత్మక ప్రణాళికలకు దార్శనికత అవసరం. దార్శనికతను వాస్తవంలోకి మరల్చడానికి, వ్యతిరేక ఫలాలు రాకుండా, ఉండాలంటే, ఆలోచన, ఆచరణ, ఆదాయం మూడు ప్రధాన పాత్రే పోషిస్తాయి. కానీ నీతి ఆయోగ్ త్రైవార్షిక కార్యక్రమాల ఆచరణ ప్రణాళిక కేవలం సాంకేతికపరంగా చేసిన ఒక ప్రణాళికలా ఉంది. విద్యాఫలాలు ప్రధానంగా లాభించాలని భావిస్తుంది.

విద్యా ప్రధానంగా, నీతిఆయోగ్ వ్యవహరించాలని ఆశిస్తున్నప్పటికీ, అధికసంఖ్యలో నున్న పాఠశాలకు వెళ్లని విద్యార్థులు, డ్రాపవుట్స్, రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగ యువత, సామాజిక – ఆర్థిక వెనకబాటుతనం, లింగవివక్షత, విద్యాసంస్థల్లోని ప్రాంతీయ విభేదాలు మొదలగు అంశాలన్నీ, భారతీయ విద్యా వ్యవస్థను శాసిస్తున్నాయి. నీతిఆయోగ్ "దార్శనికప్రణాళిక" ఈ అంశాలన్నింటిని విస్మరించింది. సాంకేతిక విద్య పట్ల అధిక ఆసక్తి, నైపుణ్యాలను పెంచే శిక్షణ దిశగా ప్రణాళికలు, వంటి వాటిపై దృష్టి సారించినప్పటికీ, విద్య ప్రధాన ఉద్దేశ్యం సమగ్ర వ్యక్తిత్వ వికాసం అన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదని స్పష్టమవుతుంది.

**(అనువాదం : డాక్టర్ శమంతకమణి)**

# ప్రచ్ఛన్న శ్రమ దోపిడీ

**ఇవా స్వెడ్లర్**

పెట్టుబడిదారీ విధానంలో అమలౌతున్న పలు వేతన చెల్లింపులు లేని శ్రమలను కారల్ మార్క్స్ తన రచనల్లో పొందుపరిచారు.

ఉత్పత్తి, వేతన సంబంధాలలో ప్రామాణిక స్థాయి దోపిడి గురించి మన అవగాహనల పరిధిని విస్తృత పరిచేందుకు పలువురు మార్క్సిస్టు సిద్ధాంతకర్తలు తోడ్పడ్డారు. అదనపు విలువ సిద్ధాంతం, వేతనంతో శ్రమించే కార్మికులకు, వేతనం లేకుండా పని చేస్తున్న కార్మికులు ఇరువురికీ వర్తిస్తుందన్న వాస్తవాన్ని క్రమంగా అందరూ గుర్తిస్తున్నారు.

పెట్టుబడిదారులు కేవలం వేతనం రూపంలో ఇచ్చే శ్రమ విలువకు మించి కార్మికుల నుండి అదనపు విలువను నిరంతరం రాబట్టుకుంటున్న విషయం మనకు తెలుసు. అదనపు విలువను రాబట్టడంలో పలు ప్రత్యామ్నాయ పద్ధతులను పెట్టుబడిదారులు ప్రవేశపెడుతున్నారు. ఆ పద్ధతులను ఇముడ్చుకోవటం ఈ శతాబ్దం ప్రత్యేకతగా గుర్తింపు పొందింది. ఈ వ్యవస్థలో శ్రామికులను చుట్టుముట్టి బలవంతంగా కొనసాగుతున్న పలు దోపిడీ రూపాలలో 'చెల్లింపులు లేని శ్రమలు' పెరుగు తున్నాయి. ఆ క్రమాన్ని పరిశీలిద్దాం.

ప్రాథమిక దశలో పెట్టుబడి పోగేసుకోవటంతో పాటు శ్రమ పునరుత్పత్తి అంశాన్ని కూడా మార్క్స్ అధ్యయనం చేశారు. వేతనం చెల్లింపులు లేని శ్రమలు శ్రామిక శక్తిని పునరుత్పత్తి చేస్తున్నాయి. అందులో చెల్లింపులకు నోచుకోని మహిళల శ్రమ చాలా ముఖ్యమైనది. పిల్లల్ని కనడం వారిని పెంచడం, తిండి పెట్టడం, బట్టలు, నివాసం సమకూర్చడం, కుటుంబంలో వయసు మళ్ళిన శ్రామికుల అవసరాలు తీర్చడం తదితర సేవల ద్వారా శ్రామిక మహిళలు పైన తెల్పిన శ్రమ పునరుత్పత్తి కర్తవ్యాన్ని అమలు చేస్తున్నారు. 1970వ దశకం ఆరంభం నుండి మార్క్సిస్టు మహిళా సంఘాలు కుటుంబ శ్రమను కూడా వేతనశ్రమగా లెక్కించాలని ఉద్యమిస్తున్నాయి. అన్నింటి కంటె మించి మహిళల కుటుంబ శ్రమ అతి ముఖ్యమైన సరుకైన 'శ్రమ శక్తి'ని సృష్టిస్తున్న సత్యాన్ని ఈ సంఘాలు ఎలుగెత్తి చాటాయి. అయినప్పటికీ మహిళల శ్రమ శ్రమశక్తిగా గుర్తింపు పొందటం లేదు. పైగా దాన్ని ప్రకృతి సిద్ధంగా జరుగుతున్న 'ప్రేమతో చేసే శ్రమ'గా నిర్వచిస్తున్నారు. ఒక గృహిణిగా తన సేవలు, ఉత్పత్తుల ద్వారా కుటుంబాన్ని అత్యంత శ్రద్ధతో నిర్వహిస్తున్నది. మహిళల శ్రమను 'నీరు, గాలి' వలె ఉచితంగా లభించే పకృతి వనరుగా పరిగణించబడుతున్న వాదనలను 'మోరిస్ మైన్' తన రచనల ద్వారా చీల్చి చెండాడారు.

'మహిళ శ్రమను లెక్కిస్తే' శీర్షికతో 1988లో వెలువడిన 'మెరిలైన్ వేరింగ్' రచన పెద్ద ప్రభావాన్ని కలిగించింది. ఆ పుస్తకంలో మహిళల కుటుంబ శ్రమను సాంప్రదాయ, ఆర్థిక కొలబద్దలతో కొలవడాన్ని వ్యతిరేకించారు. కుటుంబానికి అవసరమైన నీరు మోసుకురావడం నుండి, వృద్ధుల సంరక్షణ వరకు మహిళల శ్రమను లెక్కలోకి తీసుకుని తీరాలని ఆమె వాదించారు. డబ్బు పరమైన కొలమానాలైన వేతనం, లాభాలు, ఉత్పాదకత వంటి అంశాలను ఇక్కడ వర్తింప చేయక పోవడాన్ని ఆమె తీవ్రంగా తప్పు పట్టారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఈ అంశంపై గణాంకాలను సేకరించే నూతన పద్ధతులను తన పుస్తకంలో ఆవిష్కరించారు. భార్యలు, కుమార్తెలు, మరియు తల్లులుగా మహిళలు చేస్తున్న కుటుంబ శ్రమలు, ప్రతి పనిలోను అంకిత భావంతో, అపురూపంగా వారు చూపుతున్న శ్రద్ధ, వెలకట్టలేని ఉచిత సేవలను తన పుస్తకంలో పొందుపర్చారు. ఆ సేవలకు గంటల వారీ మార్కెట్ విలువను అంచనా వేశారు. ఈ గ్రంథం రెండవ ముద్రణకు ఉత్తేజకరమైన ముందుమాట రాశారు. "దేనికి కొరగాని, లెక్కలోకి రాని" అంటూ ఆసక్తికరమైన శీర్షికను జోడించారు. అందులో వెలకట్టని, చెల్లింపులకు నోచుకోని కుటుంబ శ్రమల ఆర్థిక కోణాన్ని వెలికి తీశారు. అందుకు జత చేసిన నోట్సు రెండు వైపులా పదునైన కత్తిలా ఆమె వాదనలకు ఎంతో ఉపకరించింది. తద్వారా ఈ వ్యవస్థలో మహిళల కుటుంబ శ్రమకున్న సైద్ధాంతిక, ఆచరణాత్మక ప్రాధాన్యతలను ప్రపంచం దృష్టికి తేవటం అభినందనీయం. అమెరికన్ మార్క్సిస్టు మేరి ఇన్‌మాన్ "సామాజిక ఉత్పత్తిలో గృహిణుల పాత్ర"పై రాసిన వ్యాసం 1944లో ప్రచురించబడింది. అనగనగా అమెరికాలో ఒక గృహిణి. ఆమె భర్త కాలిఫోర్నియాలోని ఫైర్‌స్టోన్ ప్లాంట్‌లోని టైర్ల విభాగంలో పనిచేస్తున్నాడు. అతడికోసం ప్రతిరోజూ ఆమె వంట చేయడం నుంచి అనేక సేవలందించి అతన్ని ఫ్యాక్టరీలో శ్రమించేందుకు సిద్ధం చేస్తుంది. అదే సమయంలో ఆ ఫ్యాక్టరీ క్యాంటిన్‌లో వంట మనుషులుగా, వెయిటర్స్‌గా, పనిచేస్తున్న శ్రామిక మహిళల శ్రమను టైర్ల విలువలోకి చేర్చి తద్వారా వారి శ్రమకు విలువ కడుతున్నారు. మరి ఇక్కడి పురుష కార్మికులకు పలు రకాల సేవలు చేసి పనికి సిద్ధంచేసి పంపుతున్న వారి భార్యల శ్రమలను కూడా ఈ టైర్ల విలువలో కలుపుతున్నారా? భార్యల సేవలకు లెక్క కడుతున్నారా? అని రచయిత్రి సంధిస్తున్న ప్రశ్నలు ఎంతో హేతుబద్ధమైనవి.

కొన్ని సర్వేలు, మార్క్సిజానికి చెందిన పలు స్రవంతులు ప్రాథమిక సంచయం (పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రారంభంలో బలవంతంగా పెట్టుబడులను పోగేసుకున్న క్రమం), బానిసత్వం, కుటుంబశ్రమ ద్వారా పెట్టుబడిదారులకు లాభాలు పోగుచేయటంలో చెల్లింపులు లేని శ్రమ పాత్రపై కూడా దృష్టి సారించాయి. అయితే కొందరు వేతన శ్రమలపై మాత్రమే కేంద్రీకరించి, పెట్టుబడిదారీ దోపిడీని విశ్లేషించారు. వేతనాల చెల్లింపులు లేని ఇతర శ్రమ

❝మొదట కార్మికుల నుండి పెట్టుబడిదారులు కోరేది కేవలం శ్రమ చేయటం ఒక్కటే కాదు. వారు వేతన శ్రమను మాత్రమే గుర్తిస్తున్నారు. తమకు అవసరమైన శ్రమ కాలంతో పోల్చినపుడు శ్రామికులకు అతి తక్కువగా చెల్లిస్తున్నారు. నామమాత్రపు వేతనాలు పొందే కార్మికులను యజమానులు కోరుతున్నదేమిటి? పని ప్రదేశానికి ముందే రావాలి.❞



ఉత్పత్తి కార్యకలాపాల్లో పాల్గొంటున్న మహిళా కార్మికులు

లను తమ విశ్లేషణా పరిధి నుండి మినహాయించారు. మరి కొందరు వేతన చెల్లింపులు లేని శ్రమలు ఆధిపత్యం వహిస్తున్న ఆర్థిక వ్యవస్థలో విస్తరిస్తున్న వేతన సంబంధాలను ఆహ్వానిస్తున్నారు. దాన్నే వారు నిజమైన పెట్టుబడిదారీ విధానపు ఆగమనంగా గుర్తిస్తున్నారు. ఈ పరిణామం నష్టదాయకంగా కనిపించినప్పటికీ సోషలిజం వైపు పురోగమనంలో అవసరమైన దశగా అభివర్ణించారు.

సరళీకృత ప్రపంచీకరణ కొనసాగుతున్న ప్రస్తుత యుగంలో ప్రాథమిక సంచయం, బానిసత్వం, కుటుంబ శ్రమలు వేతన శ్రమలను అధిగమించలేక పోతున్నాయి. కానీ కొనసాగుతున్నాయి. పైగా విస్తరిస్తున్నాయి కూడా. పలు విధాలైన వేతనంలేని శ్రమలను రోజువారీ మనం కూడా చూస్తున్నాము. కొన్నిసార్లు పెట్టుబడిదారీ దోపిడీలో ఆర్థికేతర సంబంధాలు కూడా సృష్టించ బడుతున్నాయి. పై తెల్పిన ప్రక్రియల ద్వారా సాంప్రదాయ, శాసనబద్ధ వేతనాలు, కూలి కంటె కూడా పై పద్ధతులన్నింటి ద్వారా అధిక దోపిడి జరుగుతున్నట్లు అర్ధమవుతుంది.

పై సిద్ధాంతాలు వేగంగా పురోగమిస్తున్నాయి. కానీ అదనపు విలువను లాక్కునేందుకు పెట్టుబడిదారులు అనుసరించే అనేక మార్గాలలో కొన్నింటిని మాత్రమే మనం గమనించగలుగుతున్నాము. అవి పెట్టుబడిదారీ విధానానికి సహజ సిద్ధం, అవసరమైన వేతన శ్రమ వంటి దోపిడి రూపాలకు పరిమితం కాకుండా, పురాతన సంచయం, బానిసత్వం , కుటుంబ శ్రమల వరకు విస్తరించి ఉన్నాయి.

మన సౌకర్యార్ధం వేతనాల పరిధిని దాటి పెట్టుబడిదారీ దోపిడి రూపాలను పలు రకాలుగా విభజించుకోవచ్చు. మొదట కార్మికుల నుండి పెట్టుబడిదారులు కోరేది కేవలం శ్రమ చేయటం ఒక్కటే కాదు. వారు వేతన శ్రమను మాత్రమే గుర్తిస్తున్నారు. తమకు అవసరమైన శ్రమ కాలంతో పోల్చినపుడు శ్రామికులకు అతి తక్కువగా చెల్లిస్తున్నారు. నామ మాత్రపు వేతనాలు పొందే కార్మికులను యజమానులు కోరుతున్నదేమిటి? పని ప్రదేశానికి ముందే రావాలి. పనికోసం వేచివుండే సమయానికి విధిగా కట్టుబడి వుండాలి. ఉదాహరణకు రెస్టారెంటు ఉద్యోగులు తమ డ్యూటీకి రావడానికి ముందే కొంత పనిని నివాసం వద్ద తప్పక చేసుకుని రావాలి. డ్యూటీ టైం ముగిశాక క్లీనింగ్ వర్క్ చేసి తీరాలి. హెూం కేర్ నర్సులు డ్యూటీ నుండి తిరిగిపోయాక తమ యిళ్ళ వద్ద కొంత పేపరు వర్క్ పూర్తిచేయాలి. వైట్ కాలర్ ఉద్యోగులు డ్యూటీ దిగాక సాయంత్రం వేళల్లో, వారాంతపు సెలవుల్లో కంపెనీ ఈ మెయిల్స్‌ను తప్పక చెక్ చేసుకోవాలి. వాస్తవానికి పైన తెల్పిన పనులన్నింటికీ వేతనాలు చెల్లించాలి. కానీ ఎక్కువ శ్రమలకు వేతనాలు లేవు.

వేతనాల చెల్లింపులకు నోచుకోని పలు రకాల శ్రమ దోపిడి రూపాలుగా గుర్తించబడిన సాంప్రదాయ పనుల జాబితా పెరుగుతున్నది. దక్షిణాది దేశాలలో చిరకాలంగా అమలవుతున్న పలురకాల పీస్‌రేటు, కాంట్రాక్టు పనులు ఉత్తరాది దేశాలలోనూ పెరుగుతున్నాయి. ఇలాంటి పనులకు దాదాపు వేతనాలు లేకపోవడం లేదా నామమాత్రపు వేతనాలే చెల్లిస్తున్నారు. ఇంటర్న్‌షిప్, జైళ్ళలో ఖైదీలు, స్వతంత్ర కాంట్రాక్టర్లుగా పిలవబడుతున్నవారు, అప్రధాన ఉద్యోగాలలో ఉన్నవారు, ఫ్రీ లాన్స్, కన్సల్టెంట్లు ఇలాంటి వారిలో ఉన్నారు. ఆర్థిక చట్రంలో కొద్దిగా ఎగువ స్థానంలో ఉండే అనుబంధ ప్రొఫెసర్లు, ఊబర్ డ్రైవర్ల నుండి దినకూలీల వరకు, స్వయం ఉపాధి, వీధుల్లో కుక్కలను నడిపించేవారు, సీమ కుందేళ్ళను వేటాడేవారు ఈ జాబితాలో మరికొందరు.

ప్రాథమిక సంచయం అనేది పెట్టుబడిదారులు లాభాలు పోగేసుకునే ప్రక్రియగా దీనికి విశాల గుర్తింపు లభించింది. ఇది వేతన రూపంలోనే ఉండాలని లేదు. ఉదాహరణకు ప్రకృతి వనరుల కబ్జాలకు ముగింపు రాలేదు. పైపులైను నిర్మాణ కంపెనీలు, గనుల కంపెనీల అవసరాలకు ఆదివాసుల భూముల దురాక్రమణ వంటివి కొనసాగుతున్నాయి. సామాన్యులకు ఉపకరిస్తున్న వనరులు ప్రైవేటు పరం అవుతున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆరంభంలో సంపదలు పోగేసుకున్న రూపాలు ఆధునీకరించబడుతున్నాయి. ఉదాహరణకు సంపన్నులకు ప్రోత్సాహకాలు, పన్నులపై రాయితీలు, బెయిలవుట్‌లు, భారీ మొత్తంలో లాభాలు సమకూర్చటం వంటివి. దీనినే ప్రాథమిక సంచయం – ప్రజా ధనాన్ని పెట్టుబడిదారీ

వర్గానికి కట్టబెట్టడం తద్వారా సంపదలను పై వర్గం వారికే పున:పంపిణీ చేస్తున్నారు.

అమలులో ఉన్న సామాజిక పరిస్థితుల్లో తమకు తాము జీవించేందుకు, పునరుత్పత్తి కోసం వెచ్చించవలసిన శ్రమను 'అవసరమైన సామాజిక శ్రమ'గా మార్క్స్ నిర్వచించారు. మహిళలు, నామమాత్రపు వేతనాలతో జీవించే కార్మికుల చెల్లింపులు లేని శ్రమ వినియోగించుకోగల సరుకులు, సేవలను ఉత్పత్తి చేయడానికి, అవసరమైన వేతనాన్ని తగ్గించేందుకు ఉపయోగపడుతుంది. మహిళలు వేతనం లేకుండా వంట చేసినపుడు, తమ పిల్లలను డే కేర్ సెంటర్‌లకు పంపేబదులు ఇంటివద్దే స్వయంగా ఆ పని తామే చేయడం, ఇంట్లో అనారోగ్యం పాలైన కుటుంబ సభ్యులపై శ్రద్ధపెట్టడం వంటి పనులన్నింటికీ చెల్లింపులు లేవు. వీటిని 'సహజసిద్దమైన ప్రేమ'తో చేసే పనులుగా పిలుస్తున్నారు. సామాజికంగా అవసరమైన శ్రమకు ప్రత్యక్షంగా ఇవి ఆర్థిక సబ్సిడీలను అందిస్తాయి. ఈ సేవలకు ాలు చెల్లించాల్సివస్తే వారి వేతనాలు చాలా ఎక్కువగా పెంచవలసి ఉంటుంది. దక్షిణాది ప్రపంచంలో వలె పొలాలు, వంటింటిలో మహిళలు లేక ఇతర కుటుంబ సభ్యులు వంట చేయడం, ఇళ్లను బాగుచేయడం, వారి బట్టలను స్వయంగా తయారు చేయడం వంటి పనులను చేయవలసి వస్తుందనుకుందాం. వారి జీవన ప్రమాణాలు, శ్రమ పరిస్థితుల్లో ఉండే తేడాల దృష్ట్యా ఇంకా తక్కువ వేతనాలు పొందగలుగుతారు. ఈ క్రమం పెట్టుబడిదారులకు అధిక లాభాలను కుమ్మరిస్తుంది. మేరియా మీస్ సూత్రీకరణకు ఈ అదృశ్య శ్రమలు ప్రాతినిధ్యం వహిస్తాయి. అలాంటి వారిలో సాంప్రదాయ వేతన కార్మికులు ఒక చిన్న భాగం మాత్రమే.

ఈలోగా ఇతరుల కోసం చెల్లింపులు లేని షరతుపై పనిచేస్తున్నవారిని ఆర్థికంగా వెనుకబడ్డవారిగానూ, ఏనాడూ పనిచేయనివారిగాను వర్గీకరిస్తున్నారు. భూస్వామి బంధనాల్లో చిక్కుకున్న కౌలురైతులను లేదా బూర్జువాలు సృష్టించిన గృహిణులు కూడా పీడితుల్లో భాగమే. పెట్టుబడిదారీ చట్రంలో నిమ్నస్థాయి నుండి చెల్లింపులు లేని కార్మికులు దోపిడీ, పీడనలకు గురవుతూ ఒక మూలకు నెట్టివేయబడుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో చివరి అంచున ఉన్నప్పటికీ, ఉత్పత్తిలోనూ, పెట్టుబడిదారుల లాభాల నిర్వహణలోనూ చెల్లింపులు లేని కార్మికులు కేంద్ర స్థానంలో ఉన్నారు.

❝ఈలోగా ఇతరుల కోసం చెల్లింపులు లేని షరతుపై పనిచేస్తున్నవారిని ఆర్థికంగా వెనుకబడ్డవారి గానూ, ఏనాడూ పనిచేయనివారిగాను వర్గీకరిస్తున్నారు. భూస్వామి బంధనాల్లో చిక్కు కున్న కౌలురైతులను లేదా బూర్జువాలు సృష్టించిన గృహిణులు కూడా పీడితుల్లో భాగమే.❞



బాలల సంరక్షణలో మహిళ

అభివృద్ధి చెంది, విస్తరిస్తున్న పెట్టుబడిదారీ విధానం ఉడుంపట్టుతో వ్యక్తిగత జీవితాలు, అనుభవాలపై దాడిచేసి వాటిని సరుకులుగా మార్చుతున్నది. అదేకాలంలో సాంప్రదాయ వేతన కార్మికుల సంఖ్య గణనీయంగా కుదించుకుపోతోంది. కాంట్రాక్టు, పీస్‌రేటు, క్రమ పద్ధతిలేని ఉద్యోగాలు, ఇతర అనిశ్చితమైన ఉపాధులు పెరుగుతున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధి వేతన కార్మికుల పరిధిని అధిగమించిందని మనకు స్పష్టం కావాలి.

చాలా కాలంగా పారిశ్రామిక పని ప్రదేశంలో కార్మికులు కలుస్తారని, ఐక్యమవుతారని, ఉత్పత్తి క్రమంలో ఉమ్మడిగా కొనసాగుతున్న దోపిడీ మూలంగా వారి మధ్య సంఘీభావం, వర్గ చైతన్యమూ వర్ధిల్లుతాయని పలువురు నమ్ముతున్నారు. కాని పెట్టుబడిదారుల వ్యూహాలు వేరుగా ఉంటాయి. సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా యూనియన్ల ఏర్పాటు, శ్రామికుల రక్షణలు, సంక్షేమ రాజ్యం వంటి అంశాలపై పెట్టుబడిదారులు దాడి చేస్తున్నారు. చెల్లింపులు లేని శ్రమల పరిధిని విస్తరించేందుకై వారి వ్యూహాలు కేంద్రీకరించబడుతున్నాయి.

పెట్టుబడిదారులందరూ తమ నుండి అదనపు శ్రమను దోచుకుంటున్నారన్న వాస్తవాన్ని అన్ని రకాల కార్మికులూ గుర్తించాలి. వారు ఈ అంశంపై దృష్టి పెట్టాలి. ఇందులో వేతనాలను అడ్డంపెట్టుకుని, పీస్‌రేటు శ్రమల కూలిరేట్లు, పని పిలుపు కోసం గంటలకొద్దీ పని ప్రదేశంలో వేచివుంటున్న షిఫ్ట్ కార్మికులు, అధిక వడ్డీ రేట్లు చెల్లింపు, చెల్లింపులు లేని శ్రమలపై అధికంగా వత్తిడి పెట్టడం వంటివన్నీ అదనపు శ్రమ దోపిడీ రూపాలే. కొత్త కొత్త రూపాల్లో పలు రకాలైన శ్రమలు పెరుగుతున్నాయి. ఈ క్రమం ఆయా రంగాల్లోని కార్మికులను ఐక్యం చేయాలన్న మన కర్తవ్య సాధనకు ఆటంకంగా వుంది. దోపిడిని ప్రతిఘటించేందుకు, స్వతంత్రమైన కార్మికులకు అనుకూలమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి నూతన అవకాశాలను అన్వేషించాలి. నమూనాలను సృష్టించుకోవాలి. జాప్యం లేకుండా ఐక్యకార్మికోద్యమ పునరుజ్జీవనానికి ఒక మేధోపరమైన పునాదిని నిర్మించుకోవాలి.

**(స్వేచ్ఛానుసరణ : వై సిద్ధయ్య)**

**కారల్ మార్క్స్ ద్విశత జయంతి ప్రత్యేకం**

# పెట్టుబడిదారీ విధానం - కారల్ మార్క్స్

**ప్రభాత్ పట్నాయక్**



రచయిత
ప్రముఖ ఆర్థికవేత్త

**మా**ర్క్స్ ప్రతిపాదించిన రెండు అంశాల ద్వారా పెట్టుబడిదారీ విధానాన్ని పరిశీలించటం ఎంతో ప్రయోజనకరంగా వుంటుంది. అందులో మొదటిది అదనపు విలువ ఆవిర్భావానికి సంబంధించినది. ఇది సరుకుల ప్రపంచం. ఇక్కడి సరుకుల యాజమాన్యాలలో కార్మికులు కూడా కలసి వున్నారు. సరుకుల యాజమాన్యాల మధ్య స్వచ్ఛందంగాను, సమతుల్యంగా మారకం జరుగుతుందని, ఎలాంటి మోసాలకు ఇక్కడ తావులేదని చెబుతారు. మరి అలాంటపుడు అదనపు విలువ ఎలా వుత్పన్న మౌతుంది?

శ్రమకు, శ్రమ శక్తికి మధ్య నెలకొన్న వ్యత్యాసంలోనే ఈ చిక్కు సమస్యకు ఒక పరిష్కారం వుందని మార్క్స్ కనుగొన్నారు. కార్మికులు అమ్ముకునేది తమ శ్రమను కాదు. ఒక సరుకుగా మారిన తమ శ్రమశక్తిని, అంటే పని చేసే సామర్థ్యాన్ని మాత్రమే. ఒక యూనిట్ సరుకుల వుత్పత్తిలో ప్రత్యక్షంగాను, పరోక్షం గాను వినియోగిస్తున్న మొత్తం శ్రమ కాలానికి సమానమైన ఒక విలువ అన్ని సరుకులకు వుంటుంది. అలాగే ఒక యూనిట్ శ్రమశక్తి వుత్పత్తికి మరియు పునరుత్పత్తికి అవసరమైన కనీస జీవన అవసరాలను తీర్చగలిగేదిగా ఆ విలువ వుండాలి. శ్రమశక్తి ఒక సరుకుగా, తనను ఉపయోగించినపుడు ఎంత శ్రమ కాలాన్ని వినియోగించారన్న దాన్ని బట్టి ఒక విలువను సృష్టించటమే దీని విశిష్ట లక్షణం. ఆ శ్రమశక్తిని వినియోగించి సృష్టించే విలువ, ఆ సరుకు సొంత విలువ కంటే అధికంగా వుండటంలోనే అదనపు విలువ పుట్టుకకు ప్రాతిపదిక ఏర్పడింది. కనుక సరుకులన్నీ తమ సొంత విలువలకే మారకం జరుగుతున్నాయనుకున్న సందర్భాలలో కూడా ఒక అదనపు విలువ ఏర్పడుతుంది.

ఈ విలక్షణమైన అవగాహనకు పలు సూత్రీకరణలున్నాయి. మొదటిది. అది పెట్టుబడిదారీ విధానానికి ఒక సమగ్రము, తర్కబద్ధమైన నిర్వచనాన్ని అందిస్తున్నది. శ్రమ శక్తి ఒక సరుకుగా మారిన స్థితిలో సాధారణ సరుకుల వుత్పత్తి వ్యవస్థగా పెట్టుబడిదారీ వ్యవస్థ రూపొందింది. ఒక సాధారణ సరుకుల వుత్పత్తి ఆర్థిక వ్యవస్థలో ద్వంద పార్శ్వాలుంటాయి. అస్తిత్వంలోని వస్తువుల పార్శ్వాలకు, వాటి సంబంధాల పార్శ్వాలకు మధ్య ఈద్వంద్వ స్వభావం వుంటుంది. ఉపయోగపు విలువ –మారకపు విలువ , శ్రమ ప్రక్రియ– విలువ సృష్టించబడే ప్రక్రియ, వుత్పత్తి–సరుకు, నిర్దిష్ట శ్రమ– అనిర్దిష్ట శ్రమ వంటి పలు అంశాల మధ్య సంబంధాలను అది ప్రతిబింబిస్తున్నది. వర్తమానంలో మరింత విస్తృతమైన జీవన సాధనాలు – అస్థిర పెట్టుబడి, అదనపు వుత్పత్తి –అదనపు విలువ వంటి అంశాలు ఈ సంబంధాలలో పార్శ్వాలుగా వుంటాయి.

రెండవది. ఈ వ్యవస్థలో అదనపు విలువ మారకం ప్రక్రియలో కాకుండా వుత్పత్తి ప్రక్రియలోనే సృష్టించబడుతుంది. సరుకుల వుత్పత్తిదారులైన పెట్టుబడిదారీ సంస్థలు పరస్పరం పోటీలు పడుతున్నాయి. కాల గమనంలో ఉత్పత్తి వ్యయం అధికంగా వున్న వారు రంగం నుండి నిష్క్రమిస్తారు. అధిక ఉత్పత్తి వ్యయాన్ని కుదించవలసిన వత్తిడిలో నూతన పద్ధతులు, నూతన వుత్పత్తులు ప్రవేశి స్తున్నాయి. ఉత్పత్తి పద్ధతులను నిరంతరం విప్లవీకరిస్తున్నారు. ఉత్పత్తిని నిరంతరం విప్లవీకరించే ధోరణి గతకాలపు అన్ని రకాల వుత్పత్తి విధానాలకు, పెట్టుబడిదారీ వుత్పత్తి విధానానికున్న తేడాను తెలియజేస్తుంది. తద్వారా ఉత్పత్తి క్రమంలోనే అదనపు విలువ జనిస్తుందన్న వాస్తవానికి ఆధారం దొరుకుతుంది.

మూడవది. నూతన వుత్పత్తి పద్ధతుల అన్వేషణ పెట్టుబడి యూనిట్ పరిమాణంపై ఆధారపడి వున్నందున పెద్ద పెట్టుబడిదారులకు అవకాశాలెక్కువ వుటాయి. ఈ క్రమంలో చిన్న పెట్టుబడిదారులు బయటకు గెంటేయబడుతుంటారు. అందుకే వ్యవస్థలో నెలకొన్న పోటీ వల్ల ప్రతి పెట్టుబడిదారుడూ సంపద పోగేసుకోవటం ద్వారా తన సంస్థ పరిమాణాన్ని పెంచుకోవాలన్న వత్తిడిలో వుంటాడు. సూటిగా చెప్పాలంటే దానితో పెట్టుబడి కేంద్రీకరణ ప్రక్రియ మొదలవుతుంది. మనుగడ కోసం సాగుతున్న పోరాటంలో ప్రతి పెట్టుబడిదారీ సంస్థ ఓటమి అంచులకు చేరకుండా వుండేందుకు తన శక్తి కొలదీ ఆశావహంగా ప్రయత్నిస్తుంది. కానీ ఈ జీవన్మరణ పోరాటంలో కొందరు ఓటమి పాలౌతుంటారు. దానితో పెట్టుబడి కేంద్రీకరణ ప్రక్రియ ఆరంభమౌతుంది. అంటే అచిర కాలంలో పెద్ద పెద్ద పెట్టుబడిదారీ సంస్థలు ఏర్పడతాయి. (అంతిమంగా ఈ క్రమం 'గుత్త పెట్టుబడిదారీ విధానం' ఆవిర్భావానికి దారి తీస్తుంది. ఈ విధానంలో కూడా పోటీలు నివారించబడవు. పెట్టుబడిదారుల మధ్య బహిరంగ, రహస్య ధరల ఒప్పందాలు జరుగుతుంటాయి.)

నాల్గవది. పెట్టుబడిదారులు అదనపు విలువ సంచయాన్ని (పోగేసుకోవటాన్ని) కొనసాగించాలంటే శ్రమశక్తి విలువ నిరంతరం తాను సృష్టించిన విలువ కంటే తక్కువగా వుండాలి. అంటే ఈ వ్యవస్థలో శ్రమశక్తికి ఏనాడూ కొరత ఏర్పడరాదు. అందువల్ల పెట్టుబడిదారులు ఈపాటికే తమ పనిలో కొనసాగుతున్న క్రియాశీలురైన శ్రామిక సైన్యంతో పాటు మరి కొంత నిరుద్యోగ శ్రామిక (రిజర్వు) సైన్యాన్ని కూడా నిరంతరం తమ అధీనంలో వుంచుకోవటం వారికి తప్పనిసరి అవుతుంది. ఈ నిరుద్యోగ శ్రామిక సైన్యం సృష్టి

పెట్టుబడి సంచయం ద్వారానే సాధ్యమౌతుంది. పెట్టుబడి కేంద్రీకరణ, చిన్న వుత్పత్తులను నాశనం చేయటం ద్వారా అక్కడ ఉపాధులు కోల్పోయిన ప్రజలు నిరంతరం శ్రామిక సైన్యంలోకి నెట్టేయ బడతారు. ఈపాటికే పెట్టుబడిదారీ వుపాధుల్లోవున్న సమరశీల శ్రామిక సైన్యంతో పాటు, నిరుద్యోగ శ్రామిక సైనికుల వాస్తవ పరిమాణం నిరంతరం పెరుగుతుంది. పెట్టుబడి సంచయం జరిగేకొద్దీ, ఒక ధృవం వద్ద సంపద, వేరొక ధృవం వద్ద పేదరికం కూడా తప్పనిసరిగా పెరుగుతాయి.

ఈ అంశంలో సాంప్రదాయ ఇంగ్లీషు ఆర్థికవేత్తలు వాస్తవాలను వక్రీకరించారు. 'వేతనాలను కనీస జీవనస్థాయి పరిధికే పరిమితం చేయాలని, అంతకు మించి వేతనాలు పెంచితే కార్మికులు అధిక సంతానాన్ని కంటారని వారు అభిప్రాయ పడ్డారు. ఈ జుగుప్సాకర వాదనలను మార్క్స్ తిరస్కరించారు. మానవాళి పట్ల అభిశంసనా పత్రమైన 'మాల్థస్ జనాభా సిద్ధాంతం' ఆధారంగా ఈ వాదనలు రూపొందించినట్లు మార్క్స్ దుయ్యబట్టారు. కనీస జీవనాధార పరిధిలోనే వేతనాలు చిక్కుబడి పోయి వుండటానికి మనం పేర్కొన్న సామాజిక కారణాలనే సాక్షీభూతంగా ఆయన వుటంకించారు.

ఐదవది : ఉత్పత్తి దారులను తమ వుత్పత్తి సాధనాల నుండి వేరుచేసి, వాటిని కేవలం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకరించటంతోనే పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావం జరిగింది. అందువల్లనే సరుకుల యజమానులు రెండు వర్గాలుగా విభజించబడ్డారు. ఒకరు, ఉత్పత్తి సాధనాలు, కనీస జీవనాధారాలను తమ చేతుల్లోనే వుంచుకున్నవారు. రెండవవారు, అమ్మేందుకు తమ శ్రమశక్తి తప్ప వేరొకటి లేని వర్గంగా సృష్టించబడినారు. ఈ రెండువర్గాలు ముఖాముఖి మొహరించబడినాయి. కాలగమనంలో పెట్టుబడిదారీ వ్యవస్థ పనితీరువల్లే ఈ మౌలిక ద్వంద్వ విభజన పునరుత్పత్తి జరుగుతున్నది.

ఆరవది : ఉత్పత్తి విధానాలను నిరంతరంగా విప్లవీకరించటం ద్వారా కాలక్రమంలో శ్రమ వుత్పాదకత పెరుగుతున్నది. కానీ నిరుద్యోగ శ్రామికుల సైనిక వ్యవస్థ మనుగడలోనే వున్నందున, వారిని ఇతర విషయాలలో సమానులుగా చూపుతూనే, వేతనాలను మాత్రం చారిత్రకంగా నిర్ధారించబడ్డ కనీస జీవనస్థాయి లోనే వుంచగల్గుతున్నారు. కాకుంటే శ్రామికుల వేతనాలు కాలగమనంలో చాలా నెమ్మదిగా పెరుగుతున్నాయి. వేతన మొత్తాలన్నీ పూర్తిగా

**"ఉత్పత్తి విధానాలను నిరంతరంగా విప్లవీకరించటం ద్వారా కాలక్రమంలో శ్రమ వుత్పాదకత పెరుగుతున్నది. కానీ నిరుద్యోగ శ్రామికుల సైనిక వ్యవస్థ మనుగడలోనే వున్నందున, వారిని ఇతర విషయాలలో సమానులుగా చూపుతూనే, వేతనాలను మాత్రం చారిత్రకంగా నిర్ధారించబడ్డ కనీస జీవనస్థాయి లోనే వుంచగల్గుతున్నారు."**



కారల్ మార్క్స్



విఐ లెనిన్

వినియోగించబడుతున్నందున, అదనపు విలువలో సాపేక్షంగా స్వల్ప భాగం మాత్రమే వినిమయానికి ఖర్చువుతున్నాయి. ఉత్పత్తి విలువతో పోల్చి చూస్తే, ఆర్థిక వ్యవస్థలోని వినిమయం డిమాండును తక్కువస్థాయిలోనే వుంచగల్గుతున్నారు. ప్రధానంగా తమ స్థిర, అస్థిర పెట్టుబడులకు వినిమయంకాని అదనపు విలువలను జమచేస్తే అపుడు ఆర్థికవేత్త'సే' సూత్రీకరణకు అనుగుణంగా వుత్పత్తి విలువకు సాపేక్షంగా వుండవలసిన సగటు డిమాండులో లోటు ఏర్పడే సమస్యే వుత్పన్నం కాదు. కానీ సంచయం (పోగేసుకున్న)మొత్తమంతా నగదు పెట్టుబడికి కలిసే రూపాన్ని పొందే అవకాశం వున్నందున మొత్తం వుత్పత్తి విలువలో అదనపు విలువ వాటా పెరుగుతుంది. తద్వారా 'అదనపు వుత్పత్తి సంక్షోభం' ధోరణి వుత్పన్నమౌతుంది.

పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభాలు పలు రకాలుగా ఏర్పడవచ్చని మార్క్స్ భావించారు. అలాంటి సంక్షోభాలలో 'పెట్టుబడి సజీవ అంగ నిర్మాణం' అంటే స్థిర, అస్థిర పెట్టుబడుల నిష్పత్తులు పెరగటం వల్ల ఏర్పడే సంక్షోభాలు కూడా ఉన్నాయి. పెట్టుబడిదారీ విధానంలో నగదు వినియోగించే స్వభావమే అధికోత్పత్తి సంక్షోభానికి కారణమని , అందుకే సంపదను నిల్వ చేసుకునే రూపాలలో నగదు కూడా ఒకటని ఆయన గుర్తించారు.మార్క్స్ గుర్తించిన 'అధికోత్పత్తి సంక్షోభం', 'సే' సూత్రీకరణలను ఆమోదించిన సాంప్రదాయఇంగ్లీషు ఆర్థికవేత్తల ప్రతిపాదనల కంటే మెరుగైనదే. 1930 మహా సంక్షోభ కాలంలో ఏర్పడి, 'కీనీషియన్ విప్లవం గా పిలువబడుతున్న క్రమాన్ని అంచనా వేయటంలో మార్క్స్ వారి కంటే 75 సంవత్సరాలు ముందున్నారు.

పెట్టుబడిదారీ విధానంలోని దోపిడి స్వభావంపై చేసిన ఈ మౌలిక సూత్రీకరణ, దాని దోపిడీ స్వభావాన్ని ఆ వ్యవస్థే పునరుద్ధరిస్తుందన్న వాస్తవాన్ని, తన పనితీరుతోనే ఏర్పడుతున్న వైరుధ్యాలు తదితర అంశాలను సమగ్ర దృష్టితో పరిశీలించారు. ఈ వ్యవస్థ స్వభావాన్ని మౌలికంగా ఒక 'సద్యోజనిత'వ్యవస్థగా అంచనా వేశారు. పలు వ్యక్తిగత సంస్థలు, వ్యక్తుల చర్యల సమాహారంగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. ఈ

❝ వ్యవస్థ నిర్దేశించిన మార్గంలో ఏ వ్యక్తి అయినా ప్రవర్తించకపోతే ఆ వ్యవస్థలో అతడు లేక ఆమె తన స్థానాన్ని కోల్పోతారు. ప్రధాన స్రవంతి నుండి పక్కకు నెట్టేయబడతారు. ఉదాహరణకు పెట్టుబడిని కేద్రీకరించుకోరాదని నిర్ణయించుకున్న పెట్టుబడిదారుని పరిస్థితి కూడా అలాం టిదే. వ్యక్తుల చర్యలను మొత్తంగా చూసినపుడు వ్యవస్థకు చెందిన కొన్ని స్వత:సిద్ధ ధోరణులకు దారితీస్తాయి. ❞



బడా పెట్టుబడిదారీ సంస్థలో ఉత్పత్తిలో పాల్గొంటున్న కార్మికులు

వ్యవస్థలోని నిర్భంధ స్వభావమే, ఆ సంస్థల, వ్యక్తుల అలాంటి ప్రవర్తనకు కారణం. అందుకే వ్యవస్థ ప్రధానంగా స్వయం చోదకమైనది. అలాంటి వ్యక్తిగత చర్యలే దాని స్వయం చోదక స్వభావానికి సంధానకర్తలుగా వుంటాయి. అయితే ఆ చర్యలు కూడా ఆ వ్యవస్థ తార్కిక స్వభావంచేత నిర్ణయించ బడుతున్నాయి. వ్యవస్థ నిర్దేశించిన మార్గంలో ఏ వ్యక్తి అయినా ప్రవర్తించకపోతే ఆ వ్యవస్థలో అతడు లేక ఆమె తన స్థానాన్ని కోల్పోతారు. ప్రధాన స్రవంతి నుండి పక్కకు నెట్టేయబడతారు. ఉదాహరణకు పెట్టుబడిని కేద్రీకరించుకోరాదని నిర్ణయించుకున్న పెట్టుబడిదారుని పరిస్థితి కూడా అలాంటిదే. వ్యక్తుల చర్యలను మొత్తంగా చూసినపుడు వ్యవస్థకు చెందిన కొన్ని స్వత:సిద్ధ ధోరణులకు దారితీస్తాయి. పెట్టుబడి కేంద్రీకరణ, సరుకులమయంగా మారుతున్న సమాజం, నిరుద్యోగ శ్రామిక సైన్యపు విస్తృత పునరుత్పత్తి, చిన్న వుత్పత్తి సంస్థలను హరించి వేయటం, ఒక ధృవంలో సంపద కేంద్రీకరణ, మరొక వైపు పేదరికం కేద్రీకరణ తదితర ధోరణులన్నీ ఆ వ్యవస్థ లక్షణాలను వ్యక్తీకరిస్తాయి.

మార్క్స్ రెండవ సూక్ష్మ పరిశీలలో కూడా ముఖ్యమైన అంత:సూత్రాలున్నాయి. వ్యక్తిగత స్వేచ్ఛ గ్యారంటీ చేయబడుతుందన్న తన ప్రకటిత లక్ష్యాలకు భిన్నంగా పెట్టుబడిదారీ విధానం నిర్భంధాన్ని ప్రయోగించి విశ్వజనీన పరాయీకరణ లక్షణాన్నిసంతరించుకుంటుంది. తన అభీష్టానికి అనుగుణంగా వ్యవహరించ గల స్వేచ్ఛ లేనపుడు, చివరకు ఒక పెట్టుబడి దారుడు కూడా పెట్టుబడిదారీ విధానం నుండి వైదొలిగిపోవలసిందే. కానీ పెట్టుబడి దారులందరూ డార్వేనియన్(మనుగడకోసం పోటీ) పోరాటంలో తలమునకలై వున్నందున, కొన్ని ప్రత్యేక పద్ధతుల్లో పనిచేయటానికి వారు వత్తిడి చేయబడతారు. మార్క్స్ పెట్టుబడిదారుని 'మూర్తీభవించిన పెట్టుబడి' గా నామకరణం చేశాడు. అంటే పెట్టుబడి నిర్దేశించిన అంతర్గత ధోరణులను అమలుపరచే ఒక వాహకంగా పెట్టుబడిదారుడైన ఒక వ్యక్తి వుంటాడు.

రెండవది. వ్యవస్థ యొక్క 'సద్యోజనిత ' లక్షణం వల్ల ఆ వ్యవస్థకు స్పందించే గుణం లేకుండా పోతుంది. అంటే ఆర్థిక వ్యవస్థలో రాజకీయ జోక్యంద్వారా దాని పని విధానాన్ని, ఫలితాలను మార్చటం సాధ్యంకాదు. అయితే పెట్టుబడిదారీ రాజ్యంలో, రాజకీయ జోక్యం పాత్ర సాధారణంగా తన 'సద్యోజనిత' లక్షణాన్ని పునరుద్ధరించి, బలోపేతం చేసేదిగానే వుంటుం ది. అంటే అంతర్గతంగా వుండే దాని ధోరణులు విజయాలను వేగవంతంచేసేవిగానే వుంటాయి. ఏవైనా కొన్ని ప్రత్యేక సందర్భాలలో రాజకీయ జోక్యం ద్వారా వ్యవస్థ యొక్క 'సద్యోజనితాని'కి ఆంక్షలు విధిస్తే, అలాంటి ఆటంకాలు ఆ వ్యవస్థ పనిని కుంటుపరుస్తాయి. అపుడు వ్యవస్థనే మార్పు చేసేందుకు మరోసారి జోక్యం చేసుకోవటంగానీ , లేదా సద్యోజనితాన్ని పురన రుద్ధరించేందుకు గత జోక్యాన్ని వుపసంహరిం చటం గానీ చేయాలి.

ఈ సద్యోజనిత స్వభావం మూలంగానే సోషలిజం ఆవశ్యకత ఏర్పడుతుంది. మరింత మానవీయంగాను, శ్రామికులపట్ల స్నేహ పూర్వకమైనది గాను, సామాజికంగా మరింత బాధ్యతాయుతమైనదిగాను, సర్వమానవ సమానత్వాన్ని పెంచేదిగాను, సంక్షేమాత్మకంగాను, వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు అనుకూలించే ఏ విధమైన సంస్కరణలనైనా తనలో కలుపుకుని పోగల్గినపుడే దానిని సానుకూల పెట్టుబడిదారీ వ్యవస్థగా పేర్కొన వచ్చు. అపుడు ఈ వ్యవస్థను రద్దుచేసి సోషలిస్టు వ్యవస్థగా మార్పు చేయాలన్న వాదనకే అవకాశాలు తగ్గిపోతాయి. కానీ వ్యవస్థలోని 'సద్యోజనితం' స్వభావం ఈ సానుకూల మార్పుకు ఆటంకంగా నిలుస్తుంది. తద్వారా ఎలాంటి ప్రాధాన్యతగల సంస్కరణైనా అసమంజసమైనదిగా మారుతుంది. సంక్షేమ పెట్టుబడిదారీ విధానం కొనసాగేందుకు వీలుకాని వైరుధ్యాలను సృష్టిస్తారు. అందుకే పెట్టుబడిదారీ విధానాన్నే అ ధిగమించ వలసిన అవసరం ఏర్పడుతుంది.

అదేవిధంగా సోషలిజాన్ని మొత్తంమీద 'సద్యోజనిత' లక్షణాలులేని, ఒక భిన్నమైన సామాజిక వ్యవస్థగా పరిగణించాలి. పెట్టుబడిదారీ విధానంతోపోల్చినపుడు, సోషలిజంలో వుత్పత్తి సాధనాల యాజమాన్యాన్ని సమాజం మొత్తం తరఫున రాజ్యమే నిర్వహిస్తుందన్న అంశమొక్కటే ప్రత్యేకత కాదు. పెట్టుబడిదారీ సంస్థల్లోవలే ప్రభుత్వ రంగ సంస్థలు కూడా మార్కెట్‌లో పరస్పరం పోటీపడితే సంక్షోభం, నిరుద్యోగం ఇంకా పలు రకాల పెట్టుబడిదారీ రుగ్మతలు, ఆ సమాజంలో అంతర్లీనంగావుండే అరాచక ధోరణులన్నీ పునరావృతమౌతాయి.

అంతే కాదు, సోషలిజంలో ఆదాయాలు మెరుగ్గా పంపిణీ అవుతాయన్న వాస్తవంలో కూడా ఈ తేడా లేదు. నిరుద్యోగ శ్రామిక సైన్యాన్ని సృష్టించే ధోరణిని కొనసాగనిస్తే పై తేడాలను కూడా కాలక్రమంలో రద్దు చేయ వచ్చు. అపుడు మాత్రమే సమిష్టి రాజకీయ జోక్యం ద్వారా శ్రామిక ప్రజలు చైతన్యంతో తమ ఆర్థిక పరిస్థితులను మెరుగు పరుచుకో గల్గుతారు. ఒక్క సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ మాత్రమే దీనిని సుసాధ్యం చేస్తుంది. సోషలిజంలో అంతర్గతంగా ఎలాంటి ఆర్థిక ధోరణులు వుండవన్న వాస్తవంలోనే సోషలిజానికి, పెట్టుబడిదారీ విధానానికి తేడావుంది.

పెట్టుబడిదారీ విధానం తన తార్కిక చింత నా పద్ధతుల్లోనే వ్యక్తులందరూ నడచుకోవాలని వత్తిడి చేస్తుంటే, సోషలిజం ఎప్పటికైనా మనుగడలోకి వస్తుందా? కార్మికుల మధ్య పోటీలు, చీలికలు, వేర్పాటువాదాలను పెట్టు బడిదారీ విధానం ప్రోత్సహిస్తున్నప్పటికి, వారిని సమూహాలుగా ఆ విధానమే ఒక చోటికి చేర్చు తుందన్నది మార్క్స్ సమాధానం. తన అంతర్గత తార్కిక భావజాలాన్ని చట్టబద్ధం చేయటంలో 'విచ్చితి' ఏర్పడుతుంది. ఈ విచ్చితికి, వ్యవస్థను ఒక సైద్ధాంతిక అవగాహనతో దర్శించగల ఒక బాహ్య సహకారం ('బాహ్యవర్తనమైన జ్ఞాన మీమాంస')తోడైతే సోషలిజం సాధనకు ఆచరణాత్మక మార్గం లభిస్తుంది.

వ్యక్తి స్వేచ్ఛ గురించి వుదారవాదం ఎంత నొక్కి వక్కాణించినా రాజ్యం, కొందరు వ్యక్తులు, గ్రూపుల నుండి ఆటంకాలు వస్తాయి. అంతే తప్ప వ్యవస్థ నుండి మాత్రం కాదని భావించ టమే వుదారవాదానికి , మార్క్సిజానికి మధ్య నెలకొన్న మౌలిక తేడా. అన్ని ఆర్థిక సంబం ధాలూ స్వచ్ఛందంగా ఏర్పడినవేనని ఉదార వాదం భావిస్తుంది. ఆర్థిక సంబంధాలలోకి వ్యక్తులందరినీ బలవంతంగా ప్రవేశపెట్టేందుకు అవకాశం కూడా వుంటుందన్న ఈ అంశాన్ని వుదారవాదం గుర్తించటం లేదు.

మార్క్స్ ఎత్తి చూపినట్లు, ఈ ఆర్థిక వ్యవస్థ లోని నిర్బంధ స్వభావమనేది వ్యక్తిగత ప్రాజెక్టులకు, చర్యలకు మాత్రమే పరిమితమైన ఆటంకం కాదు. అందుకు భిన్నంగా వ్యవస్థ లోని అంతర్లీన ధోరణులే పెట్టుబడిదారీ విధా నానికి చోదక శక్తులుగా నడిపిస్తాయి. ఆ ధోరణుల సాలెగూడులోనే వ్యక్తి చిక్కుకుంటాడు. అందుకే వ్యక్తి స్వేచ్ఛ అమలు పెట్టుబడిదారీ వ్యవస్థలో సాధ్యం కాదు. ఎలాంటి అతంర్లీన మైన ప్రతికూల ధోరణులు లేని సోషలిస్టు

**"పెట్టుబడిదారీ విధానం తన తార్కిక చింత నా పద్ధతుల్లోనే వ్యక్తులందరూ నడచుకోవాలని వత్తిడి చేస్తుంటే, సోషలిజం ఎప్పటికైనా మనుగడలోకి వస్తుందా? కార్మికుల మధ్య పోటీలు, చీలికలు, వేర్పాటువాదాలను పెట్టు బడిదారీ విధానం ప్రోత్సహిస్తున్నప్పటికి, వారిని సమూహాలుగా ఆ విధానమే ఒక చోటికి చేర్చు తుందన్నది మార్క్స్ సమాధానం."**


థామస్ మాల్థూస్


ఆర్థికవేత్త జెబి సే

వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థను అధిగమించ వలసి వుంది. కులవివక్ష, లింగ వివక్ష, జాతి వివక్ష, ఇతర అన్ని రకాల అణచివేతల నుండి విముక్తి కోసం పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి బయటపడటం తప్పనిసరి. పెట్టుబడిదారీ వ్యవ స్థలో అంతర్లీనంగా అస్థిత్వంలో ఈ ధోరణులు వున్నాయి. అన్ని రకాల అణచివేతలను అంతం చేసేందుకు సోషలిజం అవసరమైన షరతుగా వుంది.

మార్క్స్ తన 'పెట్టుబడి గ్రంథం'లో పెట్టు బడిదారీ విధానాన్ని వేరుగా విశ్లేషించినట్లు కన్పిస్తుంది. పెట్టుబడిదారీ విధానానికిచుట్టూ వున్న పెట్టుబడిదారీ పూర్వ వుత్పత్తి విధానాల లోని వుత్పత్తి సంబంధాలకున్న సంపర్కాలు చాలా ప్రాధాన్యత గల అంశాలు. ప్రాధాన్యత గల ఈ అంశాలను పెట్టుబడిగ్రంథంలో చర్చిం చలేదు. ఆ వుత్పత్తి విధానాలతో సంబంధాల గురించి పెట్టుబడి గ్రంథంలో చర్చ జరుగలేదు. ఈ గ్రంథ రచనపై పనిచేస్తున్న కాలంలోనే భారతదేశంపై బ్రిటిష్ వలసవాదం ప్రభావం గురించి మార్క్స్ లోతైన అధ్యయనం చేసి, పలు వ్యాసాలు వ్రాసి న్యూయార్క్ డైలీ ట్రిబ్యున్ పత్రికలో ప్రచురించినప్పటికీ, పై విధంగా జరగటం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. పెట్టుబడి దారీ విధానం విశ్లేషణలో సామ్రాజ్యవాదం అంశాన్ని అంతర్భాగంచేసి సమగ్ర విశ్లేషణ చేయలేదు. బహుశా ఆ కాలంలో ఆనాటికే పశ్చిమ యూరప్‌లో తాను అనివార్యమని భావించిన కార్మికవర్గ విప్లవాల అధ్యయనంలో తలమునకలై వుండడమే అందుకు కారణం కావచ్చు. తదనంతర కాలంలో పశ్చిమ యూర పు కార్మికోద్యమ విజయావకాశాలు వెనుకపట్టు పట్టినందున ఆయన తన దృష్టిని ఇతర ప్రాంతాల వైపు మరల్చారు. తన మరణానికి రెండు సంవత్సరాల ముందు నరోదిక్ ఆర్థికవేత్త ఎన్.ఎఫ్. డేనియల్‌సన్‌కు మార్క్స్ ఒక లేఖ వ్రాశారు. భారత్ నుంచి బ్రిటన్‌కు తరలిపోతున్న అపారమైన సంపద గురించి ఆ లేఖలో ఆయన ప్రస్తావించారు.

పెట్టుబడిదారీ విధానంపై మార్క్స్ చేసిన విశ్లేషణ దాని అంత్య దశ గురించి కాదని, అది ఆరంభ దశ గురించేనని గమనించాలి. మార్క్స్ జీవిత కాలపు మరియు అనంతరకాలపు పరిణామాలను పరిశీలించి, తమ విశ్లేషణలో

సామ్రాజ్యవాదాన్ని అంతర్భాగంగా చేసుకుని మార్క్సిజాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మార్క్స్ అనంతర కాలపు రచయితలపై వుంది. ముఖ్యంగా ఈ బాధ్యతను లెనిన్ నెరవేర్చారు. అలాంటి ఖాళీలను పూరించినపుడు పెట్టుబడిదారీ విధానంపై మార్క్స్ చేసిన పలు మేధో పరమైన సూత్రీకరణలు మరింత బలంగా రుజువు చేయబడతాయి.

ఉదాహరణకు చిన్న ఉత్పత్తి ఆర్థిక వ్యవస్థల్లోకి, పెట్టుబడిదారీ విధానం చొరబాటును మార్క్స్ విశ్లేషించారు. అపుడు పెట్టుబడిదారీ వుత్పత్తిలోని క్రియాశీల శ్రామిక సైన్యంలోకి చిన్న వుత్పతిలో పని చేస్తున్న శ్రామికులను కలుపుకోకుండానే గత ఉపాధుల నుండి పెట్టుబడిదారీ విధానం వారిని తరిమేస్తున్నది. ఈ అంశం పెట్టుబడిదారీ వ్యవస్థలోని ఒక ధృవంలో సంపద, వేరొక ధృవంలో పేదరికం పోగుబడతాయన్న మార్క్స్ నిర్ధారణలను మరింత బలోపేతం చేస్తున్నది. పెట్టుబడిదారీ విధానం ముందుగా అభివృద్ధి చెందిన ప్రాంతంలో అలాంటి శ్రామిక విభజన జరగలేదని వాదించేవారు పెట్టుబడిదారీ వ్యవస్థతో దాని పరిసర ప్రపంచానికున్న గతితార్కిక సంబంధాన్ని పూర్తిగా విస్మరించారు. మార్క్స్ మాతృకలో పేర్కొన్న అంశాన్ని అధిగమించి చూస్తే ఆయన సూత్రీకరణలు బలోపేతమౌతాయి.

మార్క్స్ విప్లవభావన అంశానికి కూడా ఈ అవగాహన వర్తిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థను మొత్తంగా చూసినపుడు సామ్రాజ్యవాదాన్ని పెట్టుబడిదారీ వ్యవస్దలో అంతర్భాగం చేస్తే విప్లవాలకు అవకాశాలు ఎన్నో రెట్లు పెరుగుతాయి. అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మికవర్గ విప్లవం గురించి మాత్రమేగాక పెట్టుబడిదారీ వ్యవస్థ అంతగా అభివృద్ధి చెందని దేశాలలో కార్మిక –కర్షక మైత్రి ఆధారంగా దశలవారీగా సోషలిజంవైపు పయనించే ప్రజాస్వామిక విప్లవం గురించి కూడా మనం మాట్లాడగల్గుతాం. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆలస్యంగా ఆవిర్భవించిన దేశాలలో పాలకవర్గాలకు భూస్వామ్య వ్యతిరేక విప్లవ కర్తవ్యాలను పూర్తిచేయగల సామర్థ్యం లేనందున కార్మిక కర్షక మైత్రికి అవకాశం వుందని లెనిన్ సూత్రీకరించాడు. ప్రపంచీకరణ యుగపు ఆధునిక శకంలో, చిన్నవుత్పత్తిదారుల ఆర్థిక వ్యవస్థలోకి పెట్టుబడిదారీ విధానం చొరబడటంతో చిన్న వుత్పత్తిదారులు దారిద్ర్యంలోకి నెట్టివేయబడటాన్ని, ఆత్మహత్యలకు పాల్పడటాన్ని మనం అర్థంచేసుకునేలోగానే అది మరింతగా బలోపేతం అవుతుంది.

**(స్వేచ్ఛానుసరణ : వై సిద్ధయ్య)**

# వ్యవసాయరంగ సంక్షోభం పరిష్కారాలు

(10వ పేజీ తరువాయి)

మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న దృష్ట్యా వ్యవసాయ సంక్షోభం అన్నది ఒక తీవ్రమయిన విషయంగా పరిగణించబడుతుంది.

* ఇంతకు మునుపటి సంవత్సరాలకన్నా ఇప్పుడు గ్రామీణ ఉపాధి బాగా నెమ్మదించింది. పెరిగిన ఉద్యోగితకూడా తక్కువ వేతనాలతో కూడుకుని, అస్థిరమైన నాసిరకమయినది. 2014లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుండి ఉద్యోగాల పరిస్థితి దౌర్భాగ్యంగా ఉంటే గ్రామీణ ఉపాధి పరిస్థితి మరింత దిగజారుడుగా ఉంది.

* అదేసమయంలో వ్యవసాయ సంక్షోభ పరిస్థితి దేశమంతా, అన్ని పంటలకు ఒకే రకంగా లేదు. 1997–2003 మధ్య కాలం ఎదుగుదల లేని స్థితి ఉంది. 2004–2008 మధ్య కాలంలో కొంత ఎదుగుదల కనిపిం చింది. కానీ వ్యవసాయ సంక్షోభం మాత్రం తీవ్రంగానే ఉండి దాని ప్రభావం అశేష జనం మీద ఉంది. 2008–2018 మధ్య కాలం వ్యవసాయాభివృద్ధి సుమారుగా ఉంది; తీవ్రమయిన ఒడిదుడుకులకు లోనయింది.

* ఈ సంక్షోభం కొనసాగుతున్నా కొంతవరకు పెట్టుబడి సంచయనం జరిగింది. ఇది చాల పంటల దిగుబడి అంతకు మునుపటి కన్నా, అంటే నయాఉదారవాద సంస్కరణలు అమలుకు ముందుకన్నా, నెమ్మిదిగానయినా పెరగడంలో కనిపిస్తుంది.

* రియల్ ఎస్టేట్ మాఫియావలన గాని, కార్పొరేట్లు కబళించడం గాని, కొంతమంది భూములను కోల్పోవడం భూమి కొందరిదగ్గర పోగుపడడం జరిగినా సంచయనం అంతా వీరి వలననే జరగలేదు. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి జరిగింది; వ్యవసాయం మీద ఆధారపడిన చిన్న తరగతిలో కొందరు ధనవంతులు కూడా అయ్యారు.

* ఒకవైపు అంతర్జాతీయ పెట్టుబడి భారతదేశ వ్యవసాయ రంగం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోనికి చొచ్చుకుపోవడం నయా ఉదారవాద విధానాల అమలు జరుగుతున్న ఈ కాలంలో వేగవంతం అవుతుండగా, భారతదేశ గ్రామాలలో భూస్వాములకు, వ్యవసాయ కూలీలకు మధ్య ఉన్న మౌలిక వైరుధ్యం కొనసాగుతూనే ఉంది. భూమి గుత్తాధిపత్యం, భూస్వాముల, బడా పెట్టుబడిదారీ రైతుల, ధనిక రైతుల చేతులలో ఉత్పత్తి సంపదల కేంద్రీకరణ కొనసాగుతూనే ఉన్నది. వీరు గ్రామీణ ప్రాంతాలను శాసిస్తున్నారు. అత్యంత కఠినమయిన నిబంధనలతో కౌలుదారులు కౌలు చేస్తున్నారు. దళితులు, ఆదివాసీలు, మహిళలు మరింతగా దోపిడీకి గురవుతున్నారు.

* వ్యవసాయం పైన, వ్యవసాయ సంక్షోభం పైన ఈ పత్రం కేంద్రీకరించింది. అయితే భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవ స్థాగతమైన సంక్షోభం, భూస్వాములు, పెట్టు బడిదారులతో బడా బూర్జువాల నాయకత్వంలో నిర్మించబడిన పాలన. ఇది కొంతమేరకు సామ్రాజ్యవాదులతో పోల్చినపుడు స్వతంత్రం గానే ఉన్నా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో అంతకంతకు ఎక్కువగా బుజం బుజం రాచుకో వడాన్ని విస్మరించకూడదు. 2014లో బిజెపి కొత్త ప్రభుత్వం వచ్చిన నాటి నుండి సబ్సిడీలను తగ్గించడం, గిట్టుబాటుధరలను పెంచడంలో తగు మాత్రంగా వ్యవహరించడం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వాస్తవంగా తగ్గించడం, భూ సేకరణ చట్టాలను కార్పొరేట్లకు అనుగుణంగా మార్చేందుకు ప్రోత్సహించడం, నయా ఉదారవాద విధానాలను తీవ్రంగా అమలు చేయడం జరుగుతున్నది. ఇవి వ్యవసాయ సంక్షోభానికి దారితీసి, వ్యవసాయంపై ఆధారపడిన అశేష ప్రజానీకానికిగాని, గ్రామీణ ప్రాంతాలలో శ్రమ చేసి జీవిస్తున్న పేదలకు గాని ఏ రకంగానూ మేలు చేయవు. రైతులను గ్రామీణ కార్మికులను పెద్ద ఎత్తున కదిలించి ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తేగాని రైతులను గ్రామీణ శ్రామికులను కాపాడుకోలేము. రాజస్థాన్‌లో రైతు పోరాటాలు మొదలయి రెండేళ్ల పాటు కొనసాగి చివరకు మహారాష్ట్రలో రైతుల సుదూర నడక (లాంగ్ మార్చ్) జరిగింది.

* దీని ఫలితంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం నుండి కొన్ని వెసులుబాట్లు పొందగలిగారు. ఈ పోరాటం ప్రజాతంత్రయుతంగా కొన సాగించ వచ్చని ఇది మనకు తెలియచేస్తున్నది. మారుతున్న గ్రామీణ భారత ముఖచిత్రం, వ్యవసాయంపై ఆధారపడకుండా మిగిలిన పనులు చేకుంటున్న గ్రామీణ శ్రామికులు, పారిశ్రామికరించబడిన పట్టణాలతో దగ్గరి అనుబంధం ఉన్న గ్రామీణ కార్మికుల గురించిన నిర్మాణాత్మక అధ్యయనాలు ప్రజాసమీ కరణలు ఎలాచేయాలో తెలియచేస్తాయి. అటువంటి ఆధ్యయనాలే రైతులలో వైవిధ్యాలను విశ్లేషించిన భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ఆద్యుడు, కామ్రేడ్ పుచ్చల పల్లి సుందరయ్యకు ఇవ్వగల నివాళి. ❊

## జైలుపై ఎర్రజెండా ఎగురవేసిన ధీశాలి

(2వ పేజీ తరువాయి)

పార్టీతో సంబంధాలు పెట్టుకొని చిన్నచిన్న కార్యక్రమాలు నిర్వహించడం ప్రారంభించారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఎక్కడా లేనివిధంగా సహచరులతో కలిసి ఖమ్మంలో పోస్టర్లు వేశారు. కొన్ని రోజుల తరువాత పోస్టర్లు వేసినందుకు ఆయనసహా 16 మందిపై పోలీసులు కేసులు పెట్టారు. ఇందుకోసం ప్రత్యేక కోర్టునే ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న పార్టీ కమిటీ పోస్టర్లు వేసిన కేసులో ఉన్నవారికి అండగా నిలిచింది. దీంతో పార్టీతో చిర్రావూరి సంబంధాలు మరింత పటిష్టమయ్యాయి. ఇక్కడి న్యాయవాదులు ప్రభుత్వానికి భయపడి ఈ కేసును వాదించడానికి ముందుకు రాలేదు. హైదరాబాదు నుంచి నాగులపల్లి కోదండరామారావును తీసుకు వచ్చారు. ఆయన ఆంధ్ర మహాసభ అభిమాని. కేసు రెండేళ్ళు నడించింది. 16 మందికీ రెండేళ్ళ శిక్ష పడింది. 11 నెలల తరువాత ప్రభుత్వం వారిని విడిచిపెట్టింది. అప్పటికే పార్టీ 'ప్రజా యుద్ధం' నినాదం తీసుకున్నది. నాగపూర్‌లో ఎల్ఎల్‌బి చదువుతున్న సర్వదేవభట్ల రామనాథం, ఎస్ఐగా పనిచేస్తున్న రమణయ్య, జైలు నుంచి విడుదలైన చిర్రావూరి పార్టీ శాఖగా ఏర్పడ్డారు. చిర్రావూరి పార్టీ ఖమ్మం కార్యదర్శిగానూ, రామ నాథం, రమణయ్య వరంగల్‌కు కార్యదర్శులుగానూ వ్యవహరించే వారు. కొత్తగూడెంలో ట్రేడ్ యూనియన్‌నూ, వరంగల్‌లో మిల్ మజ్దూర్ యూనియన్‌నూ ఏర్పాటు చేశారు. చిర్రావూరి ఖమ్మం ప్రాంతంలో వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించేవారు. ఆంధ్ర మహాసభ ఉద్దేశ్యాలు ప్రచారం చేసేవారు. ఈ క్రమంలో ఎవరైనా మిలి టెంట్లు దొరికితే పార్టీ సభ్యులుగా రిక్రూట్ చేసేవారు. పార్టీ 1943లో చిర్రావూరిని 'ప్రదేశ్ కమిటీ'లోకి తీసుకున్నది. అప్పుడే ఆయనకు పుచ్చలపల్లి సుందరయ్యతో పరిచయ మేర్పడింది.

ఆ తరువాత ఏడుగురితో ఖమ్మం జిల్లా కమిటీ ఏర్పడింది. ఈ జిల్లాలోని కార్మికోద్యమాన్ని రాష్ట్రంలోనే రెండో పెద్ద ట్రేడ్ యూనియన్‌గా తీర్చిదిద్దారు. 1945లో ఖమ్మంలో 12వ ఆంధ్ర మహాసభ జరిగింది. దానికి రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించగా పుచ్చలపల్లి సుందరయ్య హాజరయ్యారు. ఆ సభలో చిర్రావూరి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మహాసభకు జన సమీకరణను చూసిన ప్రభుత్వం నిర్బంధాన్ని మరింతగా పెంచింది. 1946లో చిర్రావూరీ, పెండ్యాల సత్యనారాయణా 'స్టేట్ పీపుల్స్ కాన్ఫరెన్సు'కు ప్రతినిధులుగా కాశ్మీర్ వెళ్లారు. అదే సమ యంలో కాశ్మీర్‌లో షేక్ అబ్దుల్లా నేతృత్వంలో పోరాటం సాగుతోంది. కాంగ్రెసు నుంచి కమ్యూనిస్టులను బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రభుత్వం తమను అరెస్టు చేస్తుందేమోనని ప్రయాణ మార్గం మార్చి రాయపూర్ మీదుగా బెజవాడ వచ్చారు. భూమికోసం, భుక్తి కోసం, బానిసత్వ విముక్తి కోసం నల్గొండలో జరుగుతున్న పోరాటానికి వ్యతిరేకంగా నిర్బంధం మొదలైంది. పార్టీ భూ సమస్యపై ప్రతిఘటనకు పిలుపు ఇచ్చింది. ఆ సమయంలో చిర్రావూరిని మానుకోట ప్రాంతానికి పంపింది. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం ఉధృతంగా సాగు తోంది. ప్రభుత్వ నిర్బంధం పెరిగింది. పోలీసుల కాల్పులూ, ప్రజల ప్రతిఘటనా ఎక్కువయ్యాయి. మానుకోట ప్రాంతంలో భూస్వా ములు ఎక్కువ. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భూ పంపకం జరిగింది. భూస్వాముల ధాన్యా గారాల్లోని ధాన్యాన్ని ప్రజలకు పంచిపెట్టారు. దాంతో ఉద్యమం మరింత పెరిగింది. గ్రామ కమిటీలు వేశారు. అవి గెరిల్లా దళాలకు సాయ పడుతుండేవి. కే సముద్రంలో పెద్ద పోరాటమే జరిగింది. పోలీసు స్టేషన్‌లో పోలీసులు గెరిల్లాలతో మూడు రోజులు పోరాడిచివరికి లొంగిపోయారు. స్టేషన్‌లోని ఆయుధాలను గెరిల్లాలకు అప్పగించారు. యూనియన్ మిలటరీ వచ్చి స్టేషన్‌లో కట్టివేయబడిన పోలీసులను విడిపించింది. అక్కణ్ణుంచి బయలుదేరి పార్టీ కార్య కర్తలపై దాడులకు దిగింది. కమ్యూనిస్టుల కోసం గ్రామంలో ఆచూకీ తీసింది. దీంతో చిర్రావూరి సహా పార్టీ కార్యకర్తలందరూ గ్రామస్తుల సహకా రంతో తప్పించుకోగలిగారు. పార్టీ ఆదేశాల మేరకు పోలీసులపై కాల్పులు జరపరాదని ఊరుకున్నారు. ప్రాంతీయ దళాన్ని విభజించి చిన్నచిన్న గెరిల్లా దళాలుగా మార్చారు. అవి కూడా కొంత కాలం ప్రతిఘటించాయి. అయినా పోలీసులు పెద్దఎత్తున దాడులు చేశారు. చాలా దళాలు దెబ్బతిన్నాయి. ముఖ్యులు చనిపోయారు.

ఆ పరిస్థితుల్లో ట్రేడ్ యూనియన్ బాధ్యత వహించాలని పార్టీ నాయకత్వం చిర్రావూరిని వరంగల్‌కు పంపింది. అక్కడ పార్టీకి కార్యకర్త లెవరూ మిగల్లేదు. సర్వదేవభట్ల రామనాథం జైలు నుంచి విడుదల కాగానే ఆయననూ వరంగల్‌కు పంపించారు. ఇద్దరూ కలిసి అక్కడున్న పాత పరిచయాలు పెంచుకోవడానికి ప్రయత్నించారు. హైదరాబాద్‌లో ఉన్న ట్రేడ్ యూనియన్ కార్యకర్త రామమోహన్‌ను వరంగల్ కమిటీ కార్య దర్శిగా పంపారు. ఆయన జైలు నుంచి విడుదలై ఇక్కడికి వచ్చారు. జైల్లో ఉండొచ్చిన కాంగ్రెసువారు ఆయన్ను గుర్తుపట్టి పోలీసులకు పట్టించారు. తర్వాత చిర్రావూరి తదితరులను పట్టించారు. పోలీసులు చిర్రావూరిని కాల్చి చంపాలనుకొని ఆ తర్వాత నిర్ణయాన్ని మార్చుకున్నారు. తిరిగి జైలుకు తీసుకువచ్చి తన తల్లితోనూ, భార్యతోనూ చిర్రావూరిని గుర్తింపచేయించారు. భార్యను ఎని మిది నెలలు, తల్లిని మూడు నెలలు జైల్లో పెట్టారు. ఆయన జైల్లో ఉన్నప్పుడు ఇల్లూ, ఇతర ఆస్తులూ జప్తు చేశారు. ఆయన ఇంటిని పోలీసు ఠాణాగా మార్చారు. ఆయనకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. కాళ్ళకూ, చేతులకూ సంకెళ్ళు వేసి క్రూరంగా వ్యవహరించారు. 1952లో సాధారణ ఎన్నికలు జరిగాయి. జైలు నిర్బంధం కొంత తగ్గింది. అప్పటికే చాలా మంది విడుదలకాగా, చిర్రావూరి, మంచికంటి రామ కిషన్‌రావు, తమ్మా శేషయ్య జైల్లోనే ఉన్నారు. మే దినోత్సవం రోజున జైలు మీద జెండా ఎగురవేసి కారాగార సూపరింటెండెంటునూ, సిఐడీనీ, పోలీసులనూ ఖంగు తినిపించారు.

వారు జైల్లో ఉండగానే మున్సిపల్ ఎన్నికలచ్చాయి. కొంతమంది కామ్రేడ్స్ జైలుకు వచ్చి చిర్రావూరి సంతకం తీసుకుని ఎన్నికల నామినేషన్ పత్రం పూర్తి చేసి సంబంధిత అధికారికి అందించారు. ఆయన జైల్లో ఉండగానే కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. మున్సిపాలిటీలోని మొత్తం 17వార్డులకుగాను కమ్యూనిస్టు పార్టీకి 12, ప్రజాపార్టీకి 1, ఇండిపెండెంట్లకు 4 స్థానాలచ్చాయి. ప్రభుత్వం రెండు నెలలపాటు ఛైర్మన్ ఎన్నిక జరిపించలేదు. పైగా ప్రజాస్వామ్య విరుద్ధంగా తన మద్దతుదారులను ఏడుగురిని మున్సిపాలిటీకి నామినేట్ చేసింది. వీరుగాక ఎన్నికైన నలుగురు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు, ఒక ప్రజాపార్టీ కౌన్సిలరునూ కలుపుకొంది. దీంతో ఇరుపక్షాలకూ చెరిసమానంగా 12 మంది సభ్యులున్నట్లయింది. ఛైర్మన్ ఎన్నికల సమయంలో ఒకరు కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఓటు చేయడంతో చిర్రావూరి ఖమ్మం మున్సిపాలిటీ ఛైర్మనుగా ఎన్నికయ్యారు. నాటి నుంచి కొద్దికాలం మినహా ఆయన దాదాపు 30 ఏళ్లపాటు ఖమ్మం మున్సిపల్ ఛైర్మనుగా పనిచేశారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే ఒక రికార్డు. చిర్రావూరి తెలతెలవారుతుండగానే తెల్లని పంచెకట్టుతో సైకిల్‌పై పట్టణ వీధుల్లో తిరుగుతూ ఛైర్మనుగా తన దినచర్యను ప్రారంభిం చేవారు. ఛైర్మనుగా తన సుదీర్ఘ పాలనలో ఆయన క్రమశిక్షణ, అంకితభావంతో ప్రజలకు సేవ చేశారు. కమ్యూనిస్టు పార్టీలో చీలిక అనంతరం సిపిఎం వైపుకు వచ్చిన ఆయన దీర్ఘకాలం ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగానూ బాధ్యతలు నిర్వహించారు. ఆయన వృద్ధాప్యంతో 2006లో కన్నుమూశారు. ❋

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-06-2018 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# తోడేలును మించిన పెట్టుబడిదారుల లాభాల ఆకలి



– కార్ల్ మార్క్స్

**1860** జనవరి 14వ తేదీన సాటింగ్ హామ్ అసెంబ్లీ గదుల్లో నిర్వహించబడిన సమావేశానికి అధ్యక్షత వహించిన కౌంటీ మేజిస్ట్రేట్ అయిన బ్రాటన్ చార్లటన్ ఇలా ప్రకటించాడు: "అల్లిక వ్యాపారంలో పనిచేస్తున్న ప్రజావిభాగం అనుభవిస్తున్న బీదరికమూ, బాధలూ మన రాజ్యంలో ఇతర భాగాల్లో గాని, నిజానికి నాగరిక ప్రపంచంలో గాని లేవు. తొమ్మిది, పదేళ్ల పిల్లలను వాళ్ల మురికి పక్కల మీద నుండి రాత్రి రెండు, మూడు లేదా నాలుగుగంటలకు లాగి మళ్లీ రాత్రి పది, పదకొండు, పన్నెండు దాకా కేవలం బతికి ఉండటానికి అవసరమైనంత ఇచ్చి బలవంతంగా పని చేయిస్తారు. వారి అవయవాలు డస్సిపోయి, వారి శరీరం కృశించిపోయి, వారి ముఖాలు పాలిపోయి, వారి మానవత్వం పూర్తిగా శిలా సదృశ్యమైన మత్తులోకి కుంగిపోయి, ఊహించటానికే అత్యంత భయానకం... రెవరెండ్ మోంటాగూ వాల్పీ వర్ణించినట్టుగా, ఈ పద్ధతి సామాజికంగా, శారీరకంగా, నైతికంగా, ఆత్మికంగా ఎటువంట మినహాయింపులూ లేని బానిసత్వం... మగవాళ్ల శ్రమను రోజుకు పద్దెనిమిది గంటలకు తగ్గించాలని విజ్ఞప్తి చేయడం కోసం బహిరంగ సభ నిర్వహించే పట్టణం గురించి ఏమనుకోగలం? .. వర్జీనీయా, కరోలీనియా పత్తిపొలాల యజమానుల్ని మనం ఖండిస్తుంటాం. వారి నల్ల బజారూ, వారి కొరడా, వారు నిర్వహించే మానవ శరీరాల క్రయ విక్రయాలు పెట్టుబడిదార్ల ప్రయోజనం కోసం మేలి ముసుగులో జరుగుతున్న ఈ నరబలి కంటే గర్హనీయాలా?"

9 ఏళ్ల విలియమ్ ఉడ్ 7సంవత్సరాల 10 నెలలల వయసులో పనిలో చేరాడు. అతడు మొదటి నుంచీ పోత వస్తువులను చేరవేస్తున్నాడు. (పోత పోయబడిన వస్తువుల్ని అరబెట్టే గదిలోకి చేరవేసి ఖాళీ అచ్చును వెనక్కు తెస్తాడు) అతడు వారంలో ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు పనిలోకొచ్చి రాత్రి 9గంటలకు పనినుండి బయటపడతాడు. "నేను వారంలో 6 రోజులు రాత్రి 9గంటల వరకూ పనిచేస్తాను. ఏడెనిమిది వారాలుగా అలాగే చేస్తున్నాను". ఏడేళ్ల వాడికి 15 గంటలపని! 12 ఏళ్లున్న జె. ముర్రే ఇలా చెప్పాడు. "నేను పోత వస్తువుల్ని చేరవేస్తాను. నేను 6గంటలకు వస్తాను. అప్పుడప్పుడూ 4 గంటలకే వస్తాను. ఈ రోజు ఉదయం 6 గంటల వరకూ గత రాత్రంతా పనిచేశాను. అంతకు ముందు రాత్రి నుండి ఇప్పటి వరకూ నేను నిద్రపోలేదు. గత రాత్రి ఇంకా 8,9 మంది బాలురు పనిచేశారు. ఒక్కరు తప్ప అందరూ ఈ రోజు ఉదయం వచ్చారు. నాకు 3 షిల్లింగుల ఆరు పెన్నీలు ఇస్తారు. రాత్రిపూట పనిచేసినందుకు నాకేమీ ఇవ్వరు. పోయిన వారం నేను రెండు రాత్రులు పనిచేశాను." పదేళ్ల ఫెర్నిహో: "నాకు (భోజనానికి) ఎప్పుడూ ఒక గంట ఉండదు. కొన్నిసార్లు, గురు, శుక్ర, శని వారాల్లో ఆరగంటే ఉంటుంది".

పింగాణీ వాడలుండే స్టోక్ ఆన్ ట్రెంట్, వోల్ స్టాంటన్ జిల్లాల్లో సగటు ఆయుస్సు అసాధారణంగా తక్కువ అని డాక్టర్ గ్రీన్‌హౌ ప్రకటించాడు. 20 ఏళ్లు దాటిన పురుషులు స్టోక్‌జిల్లాలో కేవలం 36.6 శాతం మంది వొల్ స్టాంటన్ జిల్లాలో కేవలం 30.4 శాతం మంది పింగాణి పనిలో నియమించబడ్డారు. మొదటి జిల్లాలో అదే వయసుగల పురుషుల్లో సగం కంటే ఎక్కువ, రెండో జిల్లాలో 2/5 వంతు మరణాలకు కారణం పింగాణీ కార్మికుల్లో శ్వాసకోశ వ్యాధులు. లూసిఫర్ అగ్గిపుల్లల తయారీ 1833 నుంచీ, అనగా పుల్లకి భాస్వరం పూయటం అనే పద్ధతి కనుగొన్న నాటి నుంచీ ఉంది. 1845 నుండి ఈ ఉత్పత్తి ఇంగ్లండులో చాలా వేగంగా అభివఅద్ధి అయింది.

జె.లీచ్ వాంగ్మూలం : "గత శీతాకాలం అధిక పని వల్ల ఒకసారి 19 మంది ఆడపిల్లల్లో 6 మంది జబ్బుపడి పనికి రాలేదు. వారిని మెలకువగా ఉంచటానికి నేను గట్టిగా గదమాయిస్తూ ఉండాలి," డబ్ల్యు, డఫీ: "పిల్లల్లో ఎవ్వరూ పనికోసం కళ్ళు తెరచి ఉంచలేకపోవడాన్ని నేను గమనించాను. నిజానికి మాలో ఎవ్వరూ కళ్ళు తెరచి ఉంచలేకపోయారు." జై లైట్బోర్న్ : "నా వయసు 13. గత శీతాకాలం మేము 9 గంటలదాకా (రాత్రి) పని చేశాము. అంతకు ముందు శీతాకాలమైతే 10 దాకా చేశాము. గత శీతాకాలం పుళ్లు పడిన పాదాలతో నేను ప్రతి రాత్రి ఏడ్చేవాణ్ణి." జి. అప్పడిన్ "వాడు మా పిల్లడు... వాడికి 7 ఏళ్లున్నప్పుడు నేను వాణ్ణి వీపు మీద ఎక్కించుకుని మంచులో కార్ఖానాకు, ఇంటికి తీసుకెళ్ళేవాడిని. వాడికి రోజూ 16 గంటల పని ఉండేది... వాడు యంత్రం దగ్గర నిల్చున్నప్పుడు అక్కడి నుంచి కదల్లేడు, దాన్ని ఆపలేడు. కనుక వాడికి అలాగే అక్కడే అన్నం పెట్టడం కోసం నేను తరచుగా మోకాళ్ళపై కూర్చునే వాడిని." స్మిత్ అనే ఒక మాంచెస్టర్ ఫ్యాక్టరీ మేనేజింగ్ పార్టనర్ "మేము (అంటే "మా" కోసం పని చేసే "చేతులు" అని అతని ఉద్దేశం.) సాయంత్రం 4.30 లోగా 10.30 గంటల రోజు పనిని పూర్తి చేయడం కోసం భోజనానికి విరామం లేకుండా పని చేస్తూనే ఉంటాం. 4. 30 తర్వాత చేసేందంతా ఓవర్‌టైమ్." (10.30 గంటలలో శ్రీమాన్ స్మిత్ కూడా భోజనం చెయ్యడా?) "మేము (అదే స్మిత్) సాయంత్రం 6 గంటల వరకూ పని చేయకుండా ఎప్పుడోగాని వదిలి వెళ్ళము. (అనగా 'మా' శ్రమ శక్తి యంత్రాల అనుభోగాన్ని వదలి వెళ్లటం అని అతని ఉద్దేశం.) ఆ రకంగా మేము (అదే మనిషి) నిజంగా ఏడాది పొడుగునా ఓవర్‌టైమ్ పని చేస్తున్నాము..

*(కార్ల్‌మార్క్స్ రచించిన పెట్టుబడి గ్రంథం మొదటి భాగంలోని పదవ అధ్యాయం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి)*

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.13, No.2. Published on June 1, 2018